www.prajasakti.com
PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 39 Vol సంచిక : 23 No | విజయవాడ, గురువారం 24 జనవరి 2019 | 12 + 12 పేజీలు వెల : 4.00 Rs.

జగన్‌పై దాడి కేసులో ఎన్ఐఏ ఛార్జిషీటు

విచారణ ఆపాలని రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్

2



భారత్ బోణీ

న్యూజిలాండ్‌ను కట్టడి చేసిన బౌలర్లు

రాణించిన ధావన్, కోహ్లీ - షమి రికార్డు

12



6 నుంచి ఆర్‌టిసి సమ్మె

జెఎసి ప్రకటన

2



నేడు అర్ధరాత్రి నింగిలోకి పిఎస్ఎల్‌వి-సి 44

అంతరిక్షంలోకి కలాం శాట్

కౌంట్ డౌన్ ప్రక్రియ ప్రారంభం

12

రాష్ట్రంలో ఒంటరిగానే

కాంగ్రెస్ ప్రకటన • జాతీయ స్థాయిలోనే టిడిపితో పొత్తు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఊమెన్‌చాండీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సాధారణ ఎన్నికల బరిలోకి ఒంటరిగానే దిగాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. రాష్ట్రంలోని 173 శాసనసభ, 25 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఒంటరిగా పోటీ చేయాలని బుధవారం జరిగిన ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్ణయించింది. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి ఊమెన్‌చాందీ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీతో జాతీయ స్థాయిలోనే పొత్తు ఉంటుందని, రాష్ట్రంలో ఒంటరిగానే పోటీ చేస్తామని చెప్పారు. ప్రత్యేకహదా అంశమే తమ ఎన్నికల అజెండాఅని అన్నారు. రాష్ట్రానికి హోదా రావాలంటే కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి తీరాలని ప్రజలకు చెబుతామన్నారు. . ఫిబ్రవరిలో రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 13 జిల్లాల్లో బస్సుయాత్ర ప్రారంభిస్తామని వెల్లడించారు. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) ఆదేశాల మేరకు త్వరలోనే ఎన్నికల కమిటీలను

మిగతా 9లో



రామాయపట్నంలో జిందాల్‌కు రెండు బెర్తులు

రూ.3500 కోట్ల ప్రాజెక్టుకు లోకేష్ సమక్షంలో ఒప్పందం

2

ఎన్నికల తరువాతే ప్రధానిపై నిర్ణయం



లోక్‌సభ ఎన్నికలపై శబరిమల సానుకూల ప్రభావం

ది హిందూ పత్రిక ఇంటర్వ్యూలో సీతారాం ఏచూరి

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల ఫలితాలొచ్చాక ప్రధాని ఎవరో నిర్ణయించుకోవచ్చని, ఇదేమీ కొత్త పద్ధతి కాదని, గతంలో చాలా సార్లు అనుసరించిందేనని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఉద్ఘాటించారు. ది హిందూ ఆంగ్ల దిన పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఏచూరి మాట్లాడుతూ ప్రతిపక్షాల పొత్తులు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఉంటాయని చెప్పారు అన్ని వయసులకు చెందిన మహిళలు శబరిమల ఆలయంలోకి ప్రవేశించటంపై మితవాద శక్తులు నానా యాగీ చేస్తున్నప్పటికీ రానున్న లోక్ సభ ఎన్నికల్లో పార్టీపై ఇది సానుకూల ప్రభావాన్నే చూపుతుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. జనరల్ కేటగిరిలోని పేదలకు 10 శాతం రిజర్వేషన్లను సిపిఐ(ఎం) ఎందుకు బలపరుస్తున్నదీ, ఇప్పటికీ వామపక్షాలు ఎందుకు ప్రాధాన్యత కలిగి ఉన్నాయి తదితర అంశాలపై హిందులో ప్రచురించిన ఆయన ఇంటర్వ్యూ పూర్తి పాఠం ప్రజాశక్తి పాఠకుల కోసం...

- **కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వాని గద్దె దించడమే ప్రధాన లక్ష్యమని గత ఏడాది సిపిఎం పేర్కొంది. మరో వంద రోజుల్లో ఈ ప్రభుత్వ పాలనా కాలం ముగియనున్న నేపథ్యంలో ఆ లక్ష్యాన్ని చేరుకోగలరని మీరు భావిస్తున్నారా?**

చాలా నమ్మకంగా ఉన్నాం. 2004 లోక్‌సభ ఎన్నికల ముందునాటి పరిస్థితులే ఇప్పుడు కన్పిస్తున్నాయి. అప్పుడు కూడా వాజ్‌పాయ్‌కి ప్రత్యామ్నాయం లేదని, భారత్ వెలిగిపోతుందని, ప్రజల్లో సానుకూల భావన ఉందని, అంతకు ముందు జరిగిన రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో బిజెపి గెలిచిందని, మళ్లీ వాజ్‌పాయ్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని భావించిన బిజెపి, లోక్‌సభ ఎన్నికలను ముందుగానే జరపటానికి పూనుకుంది. కానీ ఏం జరిగిందో మనందరికీ తెలుసు. అటువంటి పరిస్థితులే ఇప్పుడు కూడా ఉన్నాయి. నేనెందుకు ఇంత పూర్తి విశ్వాసంతో ఉన్నానంటే..వైవిధ్యభరితమైన భారతదేశంలో వివిధ రాష్ట్రాల్లో, వివిధ రాజకీయ పార్టీలు వివిధ రకాలుగా ప్రభావాన్ని కలిగివున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే సంకీర్ణం కూటమి ఎప్పుడూ ఎన్నికల ఫలితాల తర్వాతనే ఏర్పడింది. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం, 1998లో వాజ్‌పేయి ప్రభుత్వం, 2004లో మన్మోహన్ సింగ్ ప్రభుత్వాలు ఇలాగే ఏర్పడ్డాయి.

- **టిఎంసి నేత, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నిర్వహించిన ప్రతిపక్షాల ర్యాలీకి వామపక్షాలు దూరంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో బిజెపి వ్యతిరేక కూటమి ఏర్పాటులో సైద్ధాంతిక విభేధాలు, వ్యక్తిగత ఆకాంక్షలు అడ్డుగా నిలుస్తాయని మీరు భావిస్తున్నారా?**

సైద్ధాంతిక విబేధాలు ఉంటాయి. ర్యాలీని వెళ్ళకుండా వామపక్షాలు తప్పుకోలేదు. ర్యాలీకి వామపక్షాలను అసలు

మిగతా 8లో



బహిరంగ సభలో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్, వేదికపై బాలరాజు, మనోహర్, సిహెచ్ నర్సింగరావు, సత్యనారాయణ మూర్తి

గిరిజనులకు అండగా వుంటాం

ఏజెన్సీలో విద్య, వైద్యం, ఉపాధి కల్పిస్తాం

పాడేరు బహిరంగ సభలో పవన్ కల్యాణ్

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

"కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలబడే జనసేనను బలపర్చండి. మా ప్రభుత్వం వస్తే డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండి గిరిజనులకు వైద్యసేవలు అందించే బలమైన వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించి గిరిజన ప్రాంతం అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటాం' అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. బుధవారం పాడేరు అంబేద్కర్ సెంటర్లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ బాక్సైట్ తవ్వి, పర్యావరణాన్ని ధ్వంసం చేసేవారికి వేల కోట్లు కనిపిస్తున్నాయిగాని లక్షలాది మంది జీవితాలు నాశనమవుతుండటం కనిపించడం లేదని విమర్శించారు. పర్యావరణ సమస్య లేని పరిశ్రమల ఏర్పాటు, టూరిజం ద్వారా విశాఖ ఏజెన్సీలో లక్ష మంది యువతకు ఉపాధి కల్పిస్తామని చెప్పారు. టిడిపికి దోచుకోవడంలో ఉన్న చిత్తశుద్ధి ప్రజలకు సేవ చేయడంలో లేదన్నారు. ప్రజలను రక్షించాల్సిన ప్రజాప్రతినిధులే దోపిడీ వ్యవస్థలో భాగస్వామ్యం వహిస్తే ఏం చేస్తామని ప్రశ్నించారు. మైనింగ్ దోపిడీని అడ్డుకోకపోవడంతో నాయకులు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందన్నారు. అక్రమ క్వారీలపై చర్యలు తీసుకొని వుంటే ఎమ్మెల్యే ప్రాణాలు కోల్పోయే వారు కాదన్నారు. నాయకుల మృతికి సిఎం బాధ్యత వహించాలన్నారు. గత ఎన్నికల్లో బాక్సైట్ తవ్వకాలు నిలుపుదల చేస్తామని చెప్పిన చంద్రబాబు అధికారంలోకొచ్చాక తవ్వకాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మైనింగ్ తవ్వకాలకు పాల్పడేవారు తమవారే కావడంతో చట్టసభలకు వైసిపి వెళ్లడం మానేసిందని విమర్శించారు. జనసేన, టిడిపి కలిసి పోటీ చేస్తాయని వ్యాఖ్యానించిన టిడిపి ఎంపీ టిజి.వెంకటేష్‌పై పవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మేం వదిలేసిన రాజ్యసభ సీటు పొందిన వెంకటేష్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకోం. పరిశ్రమలతో పర్యావరణానికి

మిగతా 9లో

స్తంభించిన రక్షణరంగం

తొలిరోజు సమ్మె విజయవంతం

విశాఖలో 11వేల మంది భాగస్వామ్యం



డాక్‌యార్డు వద్ద నినాదాలు చేస్తున్న రక్షణరంగ ఉద్యోగులు

ప్రజాశక్తి - యంత్రాంగం

నరేంద్రమోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా రక్షణరంగ ఉద్యోగుల మూడు రోజుల సమ్మె విజయవంతంగా ప్రారంభమైంది. సమ్మెలో భాగంగా తొలిరోజైన బుధవారం దేశవ్యాప్తంగా అన్ని ఆయుధకర్మాగారాలు నావల్ డాక్‌యార్డ్స్, వర్క్‌షాపులు, సైనిక డిపోల్లో కార్యక్రమాలు పూర్తిగా స్తంభించాయి. ఢిల్లీ, చెన్నై, పూనే, జబల్‌పూర్, కాన్పూర్, ముంబాయి, ఆగ్రా,కోల్‌కత్తాల, హైదరాబాద్, విశాఖపట్నంలలో సమ్మె విజయవంతమైనట్లు ఆల్‌ఇండియా డిఫెన్స్ ఎంప్లాయస్ ఫెడరేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. 'అన్ని ప్రభుత్వ రంగ రక్షణ యూనిట్లు స్థంభించాయి' అని ఆ సంఘ ప్రధాన కార్యదర్శి సి. శ్రీకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంలోని ఎన్ఎడి డిపో వద్ద ఉద్యోగులు, కార్మికులు, సూపర్‌వైజర్లు ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. డిఫెన్స్ కో ఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ రెడ్డి వెంకటరావు, ఎఐడిఇఎఫ్ నాయకులు పి. గోపాల్‌కృష్ణ తదితరులు సమ్మెను పర్యవేక్షించారు. విశాఖలో మొత్తం 11వేల మంది సమ్మెలో పాల్గొన్నారు. తెలంగాణలో తొలిరోజు ఎ సమ్మె నూరుశాతం విజయవంతమైందని ఎఐడిఇఎఫ్ జాయింట్ సెక్రటరీ జిటి గోపాల్‌రావు తెలిపారు.







ముస్లిం-హిందూ జంట పిల్లలు తండ్రి ఆస్తికి వారసులే

న్యూఢిల్లీ : ముస్లిం యువకుడు, హిందూ యువతిని వివాహం చేసుకుంటే అది ముస్లిం మత నిబంధనల ప్రకారం 'అక్రమమైనప్పటికీ' వారికి పుట్టిన పిల్లలు తండ్రి ఆస్తిలో హక్కు పొందడం చట్టబద్ధమేనని సుప్రీంకోర్టు మంగళవారం రూలింగ్ ఇచ్చింది. దీనిపై గతంలో ట్రయల్ కోర్టుతో పాటు కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును జస్టిస్ ఎన్.వి. రమణ, జస్టిస్ మోహన్ ఎం. శంతనగౌడర్‌తో కూడిన ధర్మాసనం సమర్థించింది. భిన్న మతాలకు చెందిన తల్లిదండ్రులకు జన్మించిన తనకు తండ్రి ఆస్తిపై హక్కు కల్పించాలని మహ్మద్ సలీమ్ అనే యువకుడు చేసుకున్న అభ్యర్థనను సుప్రీంకోర్టు సమర్థించింది. మహ్మద్ ఇలియాస్, వల్లియమ్మలకు మహ్మద్ సలీమ్ జన్మించాడు.

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ప్రియాంకా గాంధీ

- **తూర్పు యుపి ఇన్‌ఛార్జ్‌గా నియామకం**
- **రాహుల్‌కు ఊతకర్ర దొరికింది : బిజెపి వ్యాఖ్య**



న్యూఢిల్లీ : వచ్చే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సోదరి ప్రియాంక గాంధీ రాజకీయ రంగ ప్రవేశానికి సిద్ధమయ్యారు. పార్టీ తూర్పు ఉత్తరప్రదేశ్ విభాగానికి ఇన్‌ఛార్జిగా ఫిబ్రవరి 1 నుండి బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటి వరకు యుపిఎ ఛైర్‌పర్సన్, తన తల్లి సోనియాగాంధీ, రాహుల్‌గాంధీల నియోజకవర్గాలైన రాయబరేలీ, అమేథీలో వారి తరపున ప్రచారంలో పాల్గొన్న ఆమె ఇప్పుడు ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. కాగా, 47 ఏళ్ల ప్రియాంకా గాంధీని రంగంలోకి దింపుతున్నట్లు కాంగ్రెస్ ప్రకటించడంతో ఈ ఎన్నిక మరింత ప్రాధాన్యం సంతరించుకోనుంది.

యుపిలో అత్యధికంగా 80 లోక్‌సభ

మిగతా 9లో

ఆర్థిక మంత్రిగా పియూష్ గోయల్‌కు అదనపు బాధ్యతలు



న్యూఢిల్లీ : అరుణ్ జైట్లీ ఆరోగ్యం దెబ్బతినడంతో అతను కోలుకునే వరకూ కేంద్ర రైల్వే, బొగ్గు శాఖ మంత్రి పియూష్ గోయల్‌కు ఆర్థిక మంత్రిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. రాష్ట్రపతి భవన్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. 'ప్రధానమంత్రి సూచన మేరకు అరుణ్ జైట్లీ కోలుకునే వరకూ అతని అధీనంలో ఉన్న ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖను తాత్కాలికంగా పీయూష్ గోయల్‌కు అప్పగిస్తున్నాం' అని ప్రకటన తెలిపింది. అరుణ్ జైట్లీ ఎలాంటి శాఖ లేకుండా మంత్రిగా కొనసాగుతారు. అరుణ్ జైట్లీ ప్రస్తుతం చికిత్స కోసం అమెరికాలో ఉన్న సంగతి తెలిసిందే. అలాగే అతనికి క్యాన్సర్ సోకిందనే వార్తలను అర్థిక మంత్రిత్వ శాఖ తోసిపుచ్చింది. కాగా, అరుణ్ జైట్లీ నుంచి ఆర్థిక శాఖ బాధతలను స్వీకరించడం పీయూష్ గోయల్‌కు ఇది రెండోసారి. గత ఏడాదిలో కూడా అరుణ్ జైట్లీకి కిడ్నీ మార్పిడి ఆపరేషన్ జరిగినప్పుడూ కూడా పీయూష్ గోయల్ ఆర్థిక మంత్రిగా అదనపు బాధ్యతలు నిర్వహించారు.

వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఆర్ఎస్‌పి మద్దతు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

2019 ఎన్నికల్లో టిడిపికి మద్దతు ఇవ్వాలని రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ నిర్ణయించినట్లు, ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల కార్యదర్శి జూపల్లి జానకి రాములు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. త్వరలో జరిగే లోక్‌సభ, శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బిజెపిలను అంధ్రప్రదేశ్‌లో ఓడించేందుకు టిడిపికి మద్దతివ్వాలని జాతీయ ప్రధాన కార్యదర్శి క్షితి గోస్వామి సమక్షంలోనే సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు తెలిపారు. చంద్రబాబు లాంటి నాయకుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా మరోసారి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆర్ఎస్‌పి టిడిపితోనే కలసి పనిచేస్తుందని చెప్పారు.

ఒప్పందం

దావోస్‌లో జిందాల్ చైర్మన్ సజ్జన్ జిందా, రాష్ట్ర మంత్రి లోకేష్ సమక్షంలో ఒప్పంద పత్రాలు చూపుతున్న అధికారులు



రామాయపట్నంలో జిందాల్‌కు రెండు బెర్తులు

రూ.3500 కోట్ల ప్రాజెక్టుకు లోకేష్ సమక్షంలో ఒప్పందం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రముఖ మౌలిక సదుపాయాల సంస్థ జిందాల్ గ్రూప్ రాష్ట్రంలో రూ.3500 కోట్ల మేర పెట్టుబడులు పెట్టనుంది. ప్రకాశం జిల్లాలోని రామాయపట్నం పోర్టులో రెండు బెర్తుల అభివృద్ధి, పైప్‌లైన్ ప్రాజెక్టులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఆ సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. దావోస్ ఆర్థిక సదస్సులో ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు రాష్ట్ర ఐటి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి లోకేష్ బుధవారం తెలిపారు. రాష్ట్ర మౌలిక సదుపాయాల (పోర్టులు) శాఖ, ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివద్ధి మండలి, ఏపీ మ్యారిటైమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లతో జెఎస్‌డబ్ల్యూ ఈ అవగాహన ఒప్పందం చేసుకుందని లోకేష్ తెలిపారు. ఒప్పందం ప్రకారం రామాయపట్నం పోర్టులో స్టాక్‌యార్డు, పోర్టు కార్యకలాపాలకు వీలయ్యే సుమారు 200 ఎకరాల స్థలంలో రూ.1000 కోట్లతో రెండు బెర్తులనూ, అలాగే రూ.2500 కోట్లతో పైప్‌లైన్‌లనూ ఏర్పాటు చేస్తారని ఆయన అన్నారు. రెండు ప్రాజెక్టుల్లో మొత్తం 40 మందికి ప్రత్యక్షంగా, 175 మందికి పరోక్షంగా ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ఉక్కు, విద్యుత్ వాహనాల తయారీ పరిశ్రమలు, అపెరల్ పార్కులు ఏర్పాటు చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు జిందాల్ గ్రూపు చైర్మన్ తెలిపారని చెప్పారు. కాగా జిందాల్ సంస్థ చైర్మన్ సజ్జన్ జిందాల్ త్వరలోనే రాష్ట్రంలో పర్యటిస్తారని లోకేష్ తెలిపారు. ఈ ఎంఒయుపై ఎపిఎమ్ఐడిసి డైరెక్టర్ డాక్టర్ కోయ ప్రవీణ్, ఎపిఇడిబి తరపున సిఇఒ జె కష్ణకిశోర్, జెఎస్‌డబ్ల్యూ నుంచి సంస్థ జెఎండి, సిఇఒ బివిజికె శర్మ సంతకాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఐఐసి మేనేజింగ్ డైరెక్టర్ అహ్మద్ బాబు, సమాచారశాఖ కార్యదర్శి బి రామాంజనేయులు పాల్గొన్నారు.



కోస్తా, సీమకు వర్ష సూచన

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

నైరుతి బంగాళాఖాతానికి ఆనుకుని ఉత్తర తమిళనాడుపై 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నట్లు భారత వాతావరణ కేంద్రం తెలిపింది. అక్కడ నుంచి రాయలసీమ మీదుగా తెలంగాణ వరకు ద్రోణి కొనసాగుతోందని పేర్కొంది. మరోవైపు దక్షిణ మధ్య బంగాళాఖాతానికి ఆనుకుని హిందూ మహా సముద్రంలో అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోందని తెలిపింది. రాయలసీమపై కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో 26, 27 తేదీల్లో కోస్తా, సీమల్లో ఒకటి రెండు చోట్ల ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

6 నుంచి ఆర్‌టిసి సమ్మె

- జెఎసి ప్రకటన



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వేతన సవరణపై యాజమాన్యంతో జరిపిన చర్చలు విఫలం కావడంతో ఆర్‌టిసిలో ఫిబ్రవరి ఆరవ తేది నుండి నిరవధిక సమ్మె ప్రారంభం కానుంది. ఈ మేరకు ఆర్‌టిసి కార్మిక సంఘాల జెఎసి ప్రకటించింది. విజయవాడలోని ఇయు కార్యాలయంలో బుధవారం జెఎసి సమావేశం జరిగింది. అనంతరం జెఎసి నాయకులు మీడియాతో మాట్లాడుతూ సమ్మెకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. జెఎసి కన్వీనర్ పలిశెట్టి దామోదరంవు నిరవధిక సమ్మెకు సన్నాహంగా ఈ నెల 25 నుండి రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కార్యాక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. 25న అన్ని డిపోల వద్ద సమ్మె సన్నాహక ధర్నా నిర్వహిస్తామని,

26 నుంచి 28 వరకూ డిమాండ్లతో ఉన్న బ్యాడ్జీలతో విధులకు హాజరవుతామని, 28న అన్ని డిపోల వద్ద జెఎసి ఆధ్వర్యంలో సమూహిక నిరాహార దీక్ష చేపడతామని తెలిపారు. 30న అన్ని రీజినల్ మేనేజర్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపడతామని తెలిపారు. . సమ్మెకు ఎన్ఎంయు కూడా బయట నుంచి మద్దతు తెలుపుతోందన్నారు. ఆర్టీసి నష్టాలకు కార్మికులు కారణం కాదని, ప్రభుత్వ విధానాలే కారణమని అన్నారు. . ఆర్టీసికి ట్యాక్స్ హాలిడే ప్రకటించాలని, ఆర్టీసిని ప్రభుత్వం ఆదుకోవడంపై ఖచ్చితమైన హామీని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల కంటే 30 శాతం తక్కువ వేతనాలకు పనిచేస్తున్నామని, 50 శాతం ఫిట్‌మెంట్ న్యాయమైన కోరికని చెప్పారు. సిబ్బంది కుదింపుతో నష్టాలను తగ్గించుకోవాలన్న ఆలోచనను యాజమాన్యం విరమించుకోవాలన్నారు. అవసరాలకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచి రెగ్యులర్ నియామకాలు చేపట్టాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి పదవీ విరమణ వయసు 60 ఏళ్లకు పెంచాలని, ఆర్టీసి సమస్యల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఖర్చుకు, ఆదాయానికి మధ్య ఉన్న వ్యత్యాసం(వయబుల్ గ్యాప్) వల్లే ఆర్టీసి నష్టాల్లో ఉందని, ప్రభుత్వం బడ్జెట్‌లో వయబుల్ గ్యాప్ ఫండింగ్ ఇవ్వాలని అన్నారు. ఆర్టీసి నష్టాలకు ప్రయివేటు బస్సుల అక్రమ రవాణా కూడా కారణమని, ప్రభుత్వం జోక్యం చేసుకుని అక్రమ రవాణాని అరికట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జెఎసి కో కన్వీనర్లు సిహెచ్ సుందరయ్య, వి వరహాల నాయుడు, ఇయు రాష్ట్ర అధ్యక్షులు వైవి రావు, వైఎస్ఆర్ మజ్దూర్ యూనియన్ నాయకులు సిబిఎస్ రెడ్డి, యునైటెడ్ వర్కర్స్ యూనియన్ నాయకులు జి శ్రీనివాస్, ఓస్వా నాయకులు ఎంవి కొండారెడ్డి, వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాస రాజు, బహుజన వర్కర్స్ యూనియన్ నాయకులు సిహెచ్ శ్యాంసన్ పాల్గొన్నారు.

సిఎం వద్ద సీట్ల పంచాయితీ

కర్నూలు, కొవ్వూరు నేతల ఫిర్యాదులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అధికార తెలుగుదేశం పార్టీలో సీట్ల వ్యవహారం చర్చనీయాంశం అవుతోంది. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు వద్దే కర్నూలు, కొవ్వూరు సీట్ల పంచాయతీ మొదలైంది. కర్నూలు నుండి తన కుమారుడుకి సీటు కేటాయించాలని రాజ్యసభ సభ్యులు టి.జి.వెంకటేష్ సిఎంను కోరారు. కొవ్వూరుకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు కూడా సిఎంను కలిసి మంత్రి జవహర్ వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకులకు దగ్గరగా ఉన్నారని, ఈ సారి ఎన్నికల్లో అతనికి సీటివ్వొద్దని విజ్ఞప్తి చేశారు. ఎస్.వి.మోహన్‌రెడ్డిపై వ్యతిరేకత ఉందని, తన కుమారుడికి సీటు కేటాయిస్తే తప్పకుండా గెలిపించుకుంటామని టి.జి.వెంకటేష్ అన్నారు. అయితే వ్యతిరేకత అంశంపై పార్టీ నిర్వహించే సర్వేలో తేలుతుందని, దాని అధారంగానే సీటు ఇస్తే ఉపయోగంగా ఉంటుందని సిఎంతో చెప్పినట్లు టిజి మీడియాకు తెలిపారు. కొవ్వూరుకు చెందిన సుమారు 50 మంది ప్రజాప్రతినిధులు మంత్రి జవహర్‌కు వ్యతిరేకంగా ఫిర్యాదు చేశారు. మంత్రి అయినప్పటి నుండి వైసిపికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, పార్టీ నాయకత్వాన్ని పట్టించుకోవడం లేదని వివరించారు. అతనికి సీటు కేటాయిస్తే ఓడిపోవడం ఖాయమని తెలిపారు. దీనిపై తరువాత మాట్లాడుతానని సిఎం కార్యాలయ సిబ్బంది వారిని వారించి పంపించివేశారు. బుధవారం ఉండవల్లిలోని సిఎం కార్యాలయం వద్ద టిడిపి నాయకుల హడావుడి కనిపించింది. ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉన్న అభ్యర్థులు పెద్దఎత్తున బయోడేటాలతో అక్కడకు చేరుకుంటున్నారు. వారికెవరికీ సిఎం అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడంతో ఇంటివద్దే పడిగాపులు పడుతున్నారు.

జగన్‌పై దాడి కేసులో ఎన్ఐఏ ఛార్జిషీటు

విచారణ ఆపాలని ప్రభుత్వం పిటీషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



జగన్‌పై దాడి కేసులో ఎన్ఐఎ ఛార్జిషీటును దాఖలు చేసిది. ఎన్ఐఏ కోర్టులో బుధవారం జరిగిన విచారణ ప్రక్రియలో భాగంగా దర్యాప్తు అధికారులు ఛార్జిషీట్‌ను న్యాయమూర్తికి అందచేశారు. అయితే, వెంటనే బహిరంగపరవద్దని, కొద్దిరోజులు గోప్యంగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన న్యాయమూర్తి ఆ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఛార్జిషీట్‌తో పాటు నిందితుడు శ్రీనివాసరావు జైలులో రాసిన 22 పేజిల పుస్తకాన్ని కూడా జతపరిచినట్లు సమాచారం. శ్రీనివాస్‌రావును ఏ-1గా పేర్కొన్న ఎన్ఐఎ అధికారులు, కుట్ర కోణంపై విచారణ కొనసాగిస్తున్నామని ధర్మాసనానికి వివరించారు.

మనోవైపు ఎన్ఐఎ విచారణను తక్షణం ఆపాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనికి సంబంధించి హైకోర్టులో వాదోపవాదాలు జరుగుతున్నందున విచారణ ప్రక్రియను నిలిపివేయాలని ఈ పిటిషన్‌లో ప్రభుత్వం కోరింది. ఈ కేసులో ఇప్పటికే పలు పిటిషన్లు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో హడావిడిగా ఛార్జిషీట్ దాఖలు చేయాల్సిన అవసరం ఏమిటని నిందితుడి తరపు న్యాయవాది ప్రశ్నించారు.

జనసేనపై టిజి వివాదాస్పద వ్యాఖ్యలు

- విధానాలపై వ్యక్తిగత ప్రకటనలొద్దన్న సిఎం
- నోరు అదుపులో పెట్టుకోవాలన్న పవన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జనసేన నాయకులు టిడిపితో టచ్‌లో ఉన్నారని, మార్చిలో సీట్లపై చర్చించే అవకాశం ఉందని మాజీ మంత్రి, టిడిపి ఎంపి టి.జి.వెంకటేష్ వ్యాఖ్యానించడం వివాదానికి దారి తీసింది. ఉండవల్లిలో సిఎంను కలిసిన అనంతరం మీడియాతో టిజి చేసిన ఈ వ్యాఖ్యలను సిఎం కొట్టి పారేశారు. పార్టీ విధానాలపై వ్యక్తిగత ప్రకటనలొద్దని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంయమనం కోల్పోరాదని సూచించారు. టిజి వ్యాఖ్యలపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఘాటుగా స్పందించారు. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, తాము వదిలేసుకున్న రాజ్యసభ సీటుకు ఎంపికైన టిజి వ్యాఖ్యానాలు చేసేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని హెచ్చరించారు. రాజకీయంగా ఎదుర్కొలేక ఇటువంటి కుయుక్తులు పన్నుతున్నారని, తాము టిడిపితో కలిసి పోటీ చేయాలనిగానీ, కలవాలనిగానీ ఆలోచన లేదని అన్నారు. రానున్న ఎన్నికల్లో తాము అధికారానికి వస్తామన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కాగా తానలా అనలేదని, చర్చించే ఆలోచన మాత్రమే ఉందని చెప్పానని టిజి మీడియాకు వివరణ ఇచ్చారు.

కుంభకోణాలే జగన్ నవరత్నాలు యనమల

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

కుంభకోణాలే జగన్మోహన్‌రెడ్డి నవరత్నాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. నవరత్నాలను కాపీ కొట్టారనడంపై ఆయన స్పందిస్తూ జగన్ నేరాలను కాపీ చేయడం ఎవరి తరమూ కాదని చెప్పారు. ఎమ్మార్ కుంభకోణం, టైటానియం కుంభకోణం, వోక్స్ వ్యాగన్ కుంభకోణం, మద్యం కుంభకోణం, ముగ్గు రాయి కుంభకోణం, బాక్సైట్ కుంభకోణం, ఇనుప ఖనిజం కుంభకోణం, వాన్‌పిక్ కుంభ కోణం, లేపాక్షి కుంభకోణం ఇలా గతంలో జరిగిన కుంభకోణాలను ఆయన ప్రస్తావించారు. ఈ విధంగా చెప్పుకుంటూ పోతే జగన్ కుంభకో ణాలకు అంతేలేదని, లక్షకోట్లు, 13 చార్జీ షీట్లు, 16 నెలల జైలు, ఇవి తప్ప జగన్ సాధించింది ఏముందని ప్రశ్నించారు.

ప్రజ్ఞ

1. అగ్రవర్ణాలకు 10శాతం రిజర్వేషన్‌ను కల్పించిన మొదటి రాష్ట్రం గుజరాత్ కాగా రెండు మూడు రాష్ట్రాలు ఏవి ?
2. ఐఎమ్ఎఫ్ అంచన ప్రకారం భారత వృద్ధి శాతం 2020కి ఎంత ఉంటుంది ?
3. కె9 వజ్ర యుద్ధ ట్యాంకుల తయారీ కర్మాగారాన్ని ప్రధాని ఎక్కడ ప్రారంభించారు?
4. జి-77లో సభ్యత్వం లేని ఏ దేశానికి ఛైర్మన్‌షిప్ వహించే అవకాశం లభించింది?
5. రక్షణ పరిశ్రమల కారిడార్‌ను ఏ రాష్ట్రలో ప్రారంభించారు?

సమాధానాలు 7లో

ఫిబ్రవరి 15 నుంచి టెన్త్ ప్రీ ఫైనల్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదో తరగతి ప్రి ఫైనల్ పరీక్షల టైం టేబుల్‌ను ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ విడుదల చేశారు. ఫిబ్రవరి 15 నుంచి పరీక్షలు జరుగుతాయని డైరెక్టర్ ఎ సుబ్బారెడ్డి బుధవారం వెల్లడించారు. ఏడు రోజుల పాటు ఈ పరీక్షలు జరగనున్నాయి. 15న ఒకేషనల్ మెయిన్ పేపర్‌తో పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 22 వరకు ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా పరీక్షలు జరుగుతాయి.

30 నుంచే అసెంబ్లీ

28న కీలక అంశాలపై ముందస్తు భేటీ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 30వ తేదీ నుంచే జరగనున్నాయి. ఈ మేరకు అసెంబ్లీ సెక్రటేరియట్ స్పష్టం చేసింది. ఇందులో భాగంగానే 28వ తేదీన మండలి చైర్మన్, శాసనసభ స్పీకర్‌లు కీలక అంశాలపై ఉన్నతాధికారులతో సమావేశాన్ని నిర్వహించనున్నారు.

కాపు రిజర్వేషన్లను వక్రీకరిస్తున్నారు

టెలీకాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాపులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన రిజర్వేషన్లను వక్రీకరిస్తూ రాష్ట్రంలో కుల చిచ్చుపెట్టడానికి వైసిపి, బిజెపిలు ప్రయత్నిస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. టిడిపి కార్యకర్తలు, నేతలతో బుధవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ అగ్రకులాల్లో కాపులు సగంపైగా ఉన్నారని చెప్పారు. కాపు, బలిజ ,తెలగ,ఒంటరి కులాల శాతమే అధికంగా ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకునే ఇబిసిలకు కేటాయించిన 10శాతం రిజర్వేషన్లలో 5శాతం వారికి కేటాయించామని చెప్పారు. కాపు రిజర్వేషన్ల గురించి ఢిల్లీలో అడగలేని అసమర్థులు, కాపులకు మేలు చేసిన టిడిపిని విమర్శిస్తున్నారన్నారు అవినీతిని 85శాతం నియంత్రించామని మోడీ అనడం హాస్యాస్పదమన్నారు. రాఫెల్ ఒప్పందంలో చోటుచేసుకున్న రూ.43వేల కోట్ల కుంభకోణం, వేలకోట్లు ఎగ్గొట్టి విదేశాలకు పరారు కావడం, బ్యాంకుల కుంభకోణాలు, అవినీతి నియంత్రణా? అని ఆయన ప్రశ్నించారు.

దావోస్‌లో లోకేష్ బృందం సత్ఫలితాలు

ఏపిలో పెట్టుబడులపై అనేక కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయనీ, డెలాయిట్, విప్రో, ఎజైల్ గవర్నెన్స్ ,స్విస్ రే సంస్థలు ముందుకు వచ్చాయని సిఎం చంద్రబాబు తెలిపారు. 13జిల్లాల్లో పారిశ్రామికీకరణలో ముందంజలో ఉన్నామనీ, పెట్టుబడులకు అనువైన వాతావరణం నెలకొందని వివరించారు.

31న డైరెక్టరేట్ ముట్టడి

మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయుల ఆపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్స్ టీచర్స్ ఫెడరేషన్ ఈ నెల 31న పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చింది. యుటిఎఫ్ అధ్యక్షులు షేక్ సాబ్జీతో కలిసి ఫెడరేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ మురళీమోహన్, ఎన్ బోసుబాబు బుధవారం డైరెక్టరేట్ కార్యాలయంలో విద్యాశాఖ కమిషనర్ కె సంధ్యారాణిని కలిసి నోటీసు అందజేశారు. ఆదర్శ పాఠశాలలను రాష్ట్రప్రభుత్వం తన అధీనంలోకి తీసుకోవాలని, ఎమ్మెల్సీ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని, సర్వీస్ రూల్స్ విడుదల చేయాలని, 11వ పిఆర్‌సిలో ఆదర్శ పాఠశాలలను చేర్చాలని, హెల్త్ కార్డు మంజూరు చేయాలని, తెలుగు టిజిటి పోస్టును పిజిటిగా అప్‌గ్రేడ్ చేయాలని, హిందీ పిజిటి పోస్టు కేటాయించాలని, హాస్టల్స్‌లో డిప్యూటీ వార్డెన్‌ను నియమించాలని, రెండో దశలో చేరిన పిజిటి, టిజిటి ఫిట్‌మెంట్‌లో తేడాలను సరిచేయాలని, పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ఫెడరేషన్ ఉపాధ్యక్షులు పి చంద్రశేఖర్, నాయకులు ఎస్ బాలాజీ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి

మంత్రికి ఆర్టీసి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్టీసి రిటైర్డ్ ఉద్యోగులకు వృద్ధాప్య పింఛన్, ఇళ్ల స్థలాలు, ఆరోగ్య శ్రీ కార్డులు ఇప్పించాలని కోరుతూ సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబుకు ఆర్టీసి రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు బుధవారం వినతిపత్రం సమర్పించారు. పింఛన్ సౌకర్యం లేక రిటైరయ్యాకా ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆర్థికంగా ఆదుకునేందుకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. రవాణా శాఖ మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి కోరిన సదుపాయాలు అందేలా కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర అధ్యక్షులు పి ఉమాకాంతారావు, ప్రధాన కార్యదర్శి వివి సుబ్బారావు, ఉప ప్రధాన కార్యదర్శి కానాల గంగాధరరావు, నాయకులు ఎల్‌వి రత్నం, జి రవీంద్రబాబు, శంకరరెడ్డి, సాయాబాబు, యోహాన్, జ్ఞానేశ్వర్, ముసలయ్య, ఆంజనేయులు, శేషగిరిరావు ఉన్నారు.

24, 25న అంగన్‌వాడీల రాష్ట్ర వ్యాప్త ధర్నా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మూడు నెలలుగా అంగన్‌వాడీలకు జీతాలివ్వకపోవడాన్ని నిరసిస్తూ ఈ నెల 24, 25 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాజెక్టుల స్థాయిల్లో ధర్నా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ అంగ్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బేబిరాణి, సుబ్బరావమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

2018 అక్టోబరు 20 నుండి జీతాల్లేక అంగన్‌వాడీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా ప్రభుత్వానికి ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తోందని విమర్శించారు. అంగన్‌వాడీ సెంటర్లకు చెల్లించాల్సిన అద్దె, గ్యాస్ బిల్లులు కూడా చెల్లించడంలేదన్నారు. జనవరి 23లోగా అంగన్‌వాడీలకు జీతాలు చెల్లిస్తామని ఐసిడిఎస్ కమిషనర్ ఇటీవల ప్రకటించారనీ, కానీ నేటి వరకు జీతాలు అందడంలేదని తెలిపారు. ఈ విషయంపై ప్రభుత్వానికి మూడు సార్లు వినతిపత్రాలు అందించినా ఫలితం లేనందునే ధర్నాకు దిగుతున్నామని తెలిపారు.

ప్రత్యేకం

సర్కారుకు రూ.1,600 కోట్లే!

ప్రయివేటుకే లక్షల కోట్ల గనుల ఆదాయం



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఖజానాకు గణనీయమైన ఆదాయం సమకూరే గనులు, క్వారీల విషయంలో ప్రభుత్వం తగిన దృష్టి సారించడం లేదు. వచ్చే ఆదాయం మొత్తం ప్రయివేటు వ్యక్తుల జేబుల్లోకే వెళ్లిపోతోంది తప్ప ఖజానాకు రావడంలేదు. రాష్ట్రంలో గనులు, క్వారీలకు 7398 లీజులు మంజూరు చేశారు. అయితే ఖజానాకు వచ్చిన ఆదాయం మాత్రం కేవలం రూ.1,600 కోట్లు మాత్రమే. అంటే ప్రతి లీజు ద్వారా ఖజానాకు చేరుకుంటున్న మొత్తం కేవలం 21 లక్షలు మాత్రమే! ఈ లీజుల ద్వారా ప్రయివేటు వ్యక్తులు సంపాదిస్తున్న మొత్తం మాత్రం ఏటా లక్ష కోట్లకు పైగానే ఉంటోందని ఒక అంచనా. రాష్ట్రంలో ఉన్న లీజులను అధ్యయనం చేస్తే ప్రాస్పెక్టింగ్ లీజులు పది ఉన్నాయి. ఎక్కడ ఖనిజాలు ఉన్నాయన్నది నిరంతరం శోధిస్తుంటారు. అయితే చివరిలో లీజులు ఖరారు చేసే సమయంలో ప్రాస్పెక్టివ్ లీజుదారులకే ప్రాధాన్యత ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. అందువల్ల ఇక్కడ కూడా ప్రయివేటు వ్యక్తులు, సంస్థలకే ప్రయోజనాలు కలుగుతున్నాయి. మేజర్ మినరల్స్ విభాగంలో 381 లీజులున్నాయి. వీటిల్లో అత్యంత ఖరీదైన ఖనిజాలు కూడా ఉన్నాయి. ప్రధానంగా భారీ పరిశ్రమల్లో ఈ ఖనిజాలు ఉపయోగిస్తారు. వీటి ద్వారా ప్రభుత్వానికి రాయల్టీ, లీజుమొత్తం ద్వారా ఎంత వస్తుందో... ప్రయివేటు సంస్థలకు వెయ్యి రెట్లు ఎక్కువ ఆదాయం వస్తుందని అధికారులే అంటున్నారు. మరో 1,806 మైనర్ లీజులు కూడా మంజూరు చేశారు. ఈ విభాగంలో అధికంగా వుండేది గ్రానైట్. క్వారీ లీజులు మరో 5,200 ఇచ్చారు. ఇవి చిన్న చిన్న మొత్తాలతో ఇస్తున్న లీజులే అయినప్పటికీ, దీనికోసం రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు కూడా పోటీ పడుతున్నారంటే ఎంత ఆదాయం లభిస్తుందో అర్థమవుతూనే ఉంది.

ఇక రాష్ట్రానికి లభిస్తున్న ఆదాయాన్ని పరిశీలిస్తే నాలుగేళ్లలో 26 శాతం వరకు లీజుల ద్వారా ఆదాయం పెరిగినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ, ఖజానాకు ఉపయుక్తంగా లేదన్నది నిర్వివాదాంశం. 2013-14లో రూ.838 కోట్లు మాత్రమే ఆదాయం రాగా, 2017-18 నాటికి రూ.2,500 కోట్లకు చేరుకున్నట్లు అధికారులు వివరిస్తున్నారు. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ వరకు తొలి తొమ్మిది నెలల్లో కేవలం రూ.1,600 కోట్లు మాత్రమే ఆదాయం లభించింది. ఆ లెక్కన చూస్తే ఏడాది ముగిసేసరికి ఆదాయం రెండు వేల కోట్లు రూపాయలు దాటుతుందే తప్ప గత సంవత్సరం అంత కూడా వుండదేమో!

సంక్షిప్తం

25న మూడు డ్వాక్రా సదస్సులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఈ నెల 25వ తేది రాష్ట్ర ప్రభుత్వం మూడు జిల్లాల్లో డ్వాక్రా సదస్సుల నిర్వహించనుంది. గుంటూరు, కడప, విశాఖపట్నం జిల్లాల్లో జరిగే ఈ మూడు సదస్సుల్లోనూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొననున్నారు. ఈ మేరకు సిఎం కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం నేలపాడు గ్రామంలో ఉదయం జరిగే సదస్సులో సిఎం పాల్గొంటారు. ఆ తరువాత హెలీకాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నానికి కడప చేరుకుంటారు. అక్కడ మునిసిపల్ గ్రౌండ్ లో జరిగే డ్వాక్రా సదస్సులో ప్రసంగిస్తారు. అనంతరం అక్కడ నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి సాయంత్రానికి విశాఖపట్నం చేరుకుంటారు. అక్కడ ఎయు ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించే డ్వాక్రా సదస్సులో పాల్గొంటారు. అదేరోజు రాత్రికి ఉండవల్లిలోని తన నివాసానికి చేరుకుంటారు.

కాపులకు మళ్లీ మోసం : అంబటి రాంబాబు

ఇబిసిలకు కల్పించిన రిజర్వేషన్లలో కాపులకు ఐదు శాతం ఇస్తామంటూ మరోసారి మోసం చేసేందుకు టిడిపి అధినేత చంద్రబాబు కుట్రపన్నుతున్నారని వైసిపి అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ఆరోపించారు. విజయవాడలోని వైసిపి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలనే నెరవేర్చని చంద్రబాబు ఇప్పుడు మళ్లీ కొత్తగా అనేక హామీలు ఇస్తూ జిమ్మిక్కులు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు మోసాలపై కాంగ్రెస్, జనసేన స్పందించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు తన అవసరాల కోసం ఎవరు కనబడితే వారితో పొత్తుకు సిద్ధపడుతున్నారన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

లక్ష్మణరావును గెలిపించుకోవాలి

టీచర్లకు యుటిఎఫ్ పిలుపు

ప్రజాశక్తి - గన్నవరం (విజయవాడ)

కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావును గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, పట్టభద్రులపై ఉందని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి పిలుపునిచ్చారు. కృష్ణా జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం రాత్రి యుటిఎఫ్ గన్నవరం, ఉంగుటూరు మండలాల విస్తృత సమావేశం జరిగింది. దీనికి ఆ సంఘం నాయకులు పి.ప్రసాదరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాబురెడ్డి మాట్లాడుతూ.. నిరుద్యోగ సమస్యలు, ఉపాధ్యాయుల సమస్యలపైనా ప్రభుత్వాన్ని నిలదీయడంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కీలక పాత్ర పోషించారని తెలిపారు. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కెఎస్.లక్ష్మణరావును గెలిపించుకోడానికి ఉపాధ్యాయులంతా కృషి చేయాలన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు మరీదు వరప్రసాద్, రాజబాబు, భగీరధి, శివప్రసాద్, శంకరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

9వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒంగోలులో బుధవారం 3కె రన్ నిర్వహించారు. స్థానిక ఎబిఎం జూనియర్ కళాశాల ప్రాంగణం వద్ద సంయుక్త కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు.



ఆధునిక క్షేత్రీయ ప్రయోగశాల ప్రారంభం

ప్రజాశక్తి- మాధవధార, విశాఖ

స్థానిక మాధవధార ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి జోనల్ కార్యాలయంలో నవీకరించిన క్షేత్రీయ ప్రయోగశాలను రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖా మంత్రి శిద్దా రాఘవరావు బుధవారం ప్రారంభించారు. అనంతరం మంత్రి గంటా శ్రీనివాసరావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రయోగశాలలో అత్యాధునిక పరికరాల ఏర్పాటుకు ప్రపంచబ్యాంకు రూ.20 కోట్ల సాయం అందించిందని తెలిపారు. ఆ నిధులతో రూ.15 కోట్ల వ్యయంతో వాటర్ టెస్టింగ్ ల్యాబ్‌ను, రూ.2.5 కోట్ల వ్యయంతో రెండు మొబైల్ టెస్టింగ్ ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు. జల, వాయు, పర్యావరణ చట్టాలను అమలు పరచే క్రమంలో ప్రయోగశాల ప్రాముఖ్యత ఎంతో ఉందని చెప్పారు. విశాఖపట్నం స్మార్ట్ సిటీ కావడంతో ఎన్నో పరిశ్రమలు తరలి వస్తున్నాయన్నారు. అయితే వాటి నుంచి వెలువడే కాలుష్యాన్ని నిర్ధారించేందుకు, అరికట్టేందుకు ప్రయోగశాల, సంచార ప్రయోగశాలలు దోహదపడతాయని తెలిపారు.

మూడేళ్లలో అన్ని గృహాలకూ

కృష్ణాలో 'మెఘ' గ్యాస్

పైప్‌లైన్‌ల ద్వారా సరఫరా

ఇప్పటికే జిల్లాలో వెయ్యి కనెక్షన్‌లు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

పైప్‌లైన్‌ల ద్వారా వంట గ్యాస్ సరఫరా ప్రక్రియ కృష్ణా జిల్లాలో ప్రారంభమైంది. మెఘ ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (మెయిల్) ఇప్పటికే పలు ప్రాంతాల్లో వెయ్యి కనెక్షన్‌లకు ఈ విధానంలో గ్యాస్ సరఫరా చేస్తోంది. జిల్లాలోని అన్ని ప్రాంతాలకూ పూర్తి స్థాయిలో గ్యాస్ సరఫరా చేయడానికి మెయిల్ ప్రణాళిక రూపొం దించింది. సాధారణ గ్యాస్‌తో పోల్చుకున్న పుడు ఈ పద్ధతిలో వినియోగదారులకు 40 శాతం వ్యయం ఆదా అవుతుందని మెయిల్ ప్రతినిధులు వివరిం చారు. విజయవాడ నగర పాలక సంస్థ మినహా జిల్లాలోని ప్రతి ఇంటికీ పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరాకు రాష్ట్ర ప్రభుత్వం 2017 డిసెంబర్‌లో మెయిల్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం ఐదు సంవత్సరాల్లో జిల్లాలోని ప్రతి ఇంటికీ పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేయాలి. దీనిలో భాగంగా ఆగిరిపల్లిలో రెండు గ్యాస్ బంకులు (శాటిలైట్ స్టేషన్)లను ఇప్పటికే వినియోగదారులకు అందు బాటులోకి తెచ్చింది. కంకిపాడు వరకూ గ్యాస్ పైప్ లైన్ నిర్మాణం పూర్తి చేసింది. నూజివీడు, ఆగిరిపల్లి, నున్న గన్నవరం ప్రాంతాల్లో కొన్ని గృహాలకు, వాణిజ్య సంస్థలకు పైప్‌లైన్ ద్వారా 1000 కనెక్షన్‌లకు గ్యాస్ సరఫరా చేస్తోంది. ఈ ప్రాంతంలో మరో 30 వేల గృహాలకు ఈ ఏడాది చివరకు పైప్ లైన్ ద్వారా గ్యాస్ సరఫరాకు ప్రణాళిక రూపొం దించింది. గుడివాడ, మచిలీపట్నం, అవనిగడ్డ, ముదినేపల్లి తదితర ప్రాంతాల్లో పైప్‌లైన్‌లను ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేసింది.



దోకిపర్రులో గ్యాస్ పైప్‌లైన్ ప్లాంట్ ఇన్‌సెట్లో ప్రారంభిస్తున్న మెయిల్ చైర్మన్ పిచ్చిరెడ్డి

దోకిపర్రులో కనెక్షన్లు

మెయిల్ చైర్మన్ పామిరెడ్డి పిచ్చిరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి తమ స్వగ్రామమైన గుడ్లవల్లేరు మండలం దోకిపర్రులో ఇంటింటికీ పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా కార్యక్రమాన్ని ఇటీవల ప్రారంభించారు. ఈ గ్రామంలో మొత్తం 1500 గృహాలకు గ్యాస్ సరఫరాకు అనువుగా 20 కిలోమీటర్ల మేర పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 125 గృహాలకు కనెక్షన్‌లిచ్చారు. 225 గృహాల వారు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. త్వరలోనే పూర్తిస్థాయిలో కనెక్షన్‌లు ఇవ్వనున్నారు. కంకిపాడు వరకూ ఏర్పాటు చేసిన పైప్‌లైన్ ద్వారా భారీ సిలెండర్‌లను నింపుతున్నారు. అక్కడ నుండి లారీల ద్వారా సిలెండర్‌లను తీసుకు వచ్చి దోకిపర్రులోని పైప్‌లైన్‌కు అనుసంధానం చేసి గ్యాస్ సరఫరా చేస్తోంది. అయితే త్వరలో ఈ పైప్‌లైన్‌ను దోకిపర్రు వరకూ తీసుకు రానున్నట్లు మెయిల్ ప్రతినిధులు చెబుతున్నారు.

డిపాజిట్ భారం కాకుండా..

పైప్‌లైన్ ద్వారా సరఫరా అయ్యే గ్యాస్ కనెక్షన్ తీసు కునేందుకు సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ. 4,500, రిజిస్ట్రేషన్ ఫీజు మరో రూ. 500 చెల్లించాలి. బిపిఎల్ కేట గిరిలో తెల్లకార్డు కలిగి ఉన్న వారికి మాత్రం డిపాజిట్‌లో రూ.2 వేల వరకూ రాయితీ కల్పించారు. రూ.3 వేలు చెల్లిస్తే సరిపోతుంది. అలాగే వినియోగదారులకు భారం కాకుండా నెలవారీ బిల్లుతో పాటు దశల వారీగా డిపాజిట్‌ను చెల్లించేందుకు వెసులుబాటు కల్పించారు.

ప్రమాద రహితం..పర్యావరణ హితం

మెయిల్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజ్‌కుమార్



పెట్రోలియం నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డు (పిఎన్‌జిఆర్‌బి) నిబంధనలకనుగుణంగా పైప్‌లైన్ ఏర్పాట్లు జరుగుతున్నాయనీ, ఇది పూర్తిగా ప్రమాదరహితం, పర్యావరణ సహితమని మెయిల్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజ్‌కుమార్ ప్రజాశక్తికి వివరించారు. పిఎన్‌జిఆర్‌బి సర్టిఫై చేసిన సంస్థల వద్దే పైప్‌లు, అవసరమైన పరికరాలు కొనుగోలు జరుగుతోంది. 5 అడుగుల లోతులో పైప్‌లైన్‌లను ఏర్పాటు చేస్తున్నాం. గృహాలతోపాటు, వ్యాపార , పారిశ్రామిక అవసరాలకు పిఎన్‌జి కనెక్షన్ కోరుతూ దరఖాస్తు చేశారు. ఎల్‌పిజితో పోల్చుకున్నప్పుడు 40 శాతం వ్యయం ఆదా అవుతుంది. వీటికి తోడు గ్యాస్ బుక్ చేయడం , సకాలంలో వస్తుందో రాదో అనే టెన్షన్, గ్యాస్ ఇంటికి చేర్చేందుకు కిరాయి సమస్యలుండవు. పిఎన్‌జి వినియోగాన్ని లెక్కించేందుకు కనెక్షన్ ఇచ్చే ప్రతి ప్రాంతంలోనూ మీటర్ ఏర్పాటు చేస్తాం. వినియోగాన్ని అనుసరించి రీడింగ్ ఉంటుంది. ఇప్పటికి రోజువారీ 14 వేల స్టాండర్డ్ క్యూబిక్ మీటర్లు (ఎస్‌సిఎం) వినియోగం జరుగుతోంది. వినియోగాన్ని లక్ష ఎస్‌సిఎం వరకు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం.. సబ్సిడీపై సరఫరా అయ్యే సిఎన్‌జి కన్నా కూడా పిఎన్‌జి తక్కువ ధరకే అందించడం జరుగుతోంది. ఒక క్యూబిక్ మీటరు పిఎన్‌జిని సగటున రూ.25లకు అందిస్తున్నాం. ఎల్‌పిజి కమర్షియల్, సబ్సిడీ గ్యాస్ వినియోగదారులు రూ. 46 వరకూ ఖర్చవుతుంది. సబ్సిడీ గ్యాస్‌కన్నా కూడా తక్కువ ధరకే అందించడం జరుగుతోందని రాజ్‌కుమార్ వివరించారు.

కాపుల సంక్షేమానికి

ప్రభుత్వం కట్టుబడి ఉంది : మంత్రి గంటా

5న చిట్టివలస జూట్ మిల్లుపై చర్చలు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

కాపులను బిసిల్లో చేర్చేందుకు టిడిపి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మానవ వనరుల శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రకటించిన అగ్రవర్ణ పేదల పది శాతం రిజర్వేషన్లలో ఐదు శాతం కాపులకు కేటాయించడం అభినందనీయమన్నారు. కాపుల సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్లు కేటాయించడం, కాపు విద్యార్థులకు విదేశీ చదువులకు అర్హులైనవారికి రూ.10 లక్షలు ఆర్థిక సాయం అందించడం, నిరుద్యోగ యువతకు రూ.3100 కోట్లు కేటాయించడం, కాపులను బీసీలలో చేర్చేందుకు మంజునాధ కమిషన్ ఏర్పాటు చేయడం, వంటి విషయాల్లో కాపు సంక్షేమానికి ముఖ్యమంత్రి కృషి చేశారని గుర్తు చేశారు. విశాఖలో కాపు సామాజికవర్గానికి రీజనల్ కాపు భవన్‌కు ఫిబ్రవరి 10వ తేదీలోగా శంకుస్థాపన చేస్తామని, భవనానికి రూ.5 కోట్లు మంజూరైందని తెలిపారు. చిట్టివలస జూట్ మిల్లు సమస్యపై ఈ నెల 5న మరోసారి అమరావతిలో కార్మిక సంఘాల నేతలతో చర్చలు జరుపుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, బిసి వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉదయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జగన్ హత్య కేసులో లోకేష్ హస్తం

వైసిపి నేత బొత్స సత్యనారాయణ ఆరోపణ

ప్రజాశక్తి- మద్దిలపాలెం, విశాఖ

ప్రతిపక్ష నాయకుడు జగన్మోహన్‌రెడ్డి హత్య కేసులో ముఖ్యమంత్రి తనయుడు లోకేష్, పోలీస్ ఉన్నతాధికారులకు భాగస్వామ్యం ఉందని వైసిపి సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. బుధవారం వైసిపి నగర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హత్యాయత్నం జరిగిన కొన్ని గంటల్లోనే డిజిపి ప్రెస్‌మీట్ పెట్టి హత్యాయత్నం ప్రచారం కోసమేనని చెప్పడం వెనుక పలు అనుమానాలు ఉన్నాయని వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకునిపై జరిగిన హత్యాయత్నాన్ని ముఖ్యమంత్రి ఖండించకపోవడం, సిట్ దర్యాప్తు వేయడం పలు అనుమానాలకు దారితీస్తుందని తెలిపారు. కోర్టు సూచనల ప్రకారం కేంద్రం ఎన్‌ఐఎ దర్యాప్తు వేసిందని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని పేర్కొన్నారు. వాళ్ల భాగస్వామ్యం లేకపోతే ఎన్‌ఐఎ దర్యాప్తును ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు.

సినీనటి భానుప్రియ ఇంట్లో బాలిక నిర్బంధం

సామర్లకోట పోలీసులకు బాలిక తల్లి ఫిర్యాదు

ప్రజాశక్తి - సామర్లకోట (తూర్పుగోదావరి)

ప్రముఖ సినీ నటి భానుప్రియ ఇంట్లో తమ కుమార్తె నిర్బంధంలో ఉందని బాధిత బాలిక తల్లి పెనుపాకల ప్రభావతి సామర్లకోట పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసింది. ఆమె కథనం మేరకు.. సామర్లకోట మండలం పంద్రవాడకు చెందిన పెనుపాకల ప్రభావతి కుమార్తె సంధ్య(15) చెన్నైలోని సినీనటి భానుప్రియ ఇంట్లో ఏడాది కాలంగా పనిచేస్తోంది. భానుప్రియ అన్న గోపాలకృష్ణ సంధ్యను లైంగికంగా వేధిస్తున్నాడు. ఈ విషయం ఆ బాలిక ఫోన్‌లో తన తల్లి ప్రభావతికి చెప్పింది. చెన్నై వెళ్లిన ఆమె తన కుమార్తెను పంపాలని కోరింది. భానుప్రియ అన్న 'మీ అమ్మాయిని ఎప్పుడో పంపించేశాము. నీ దిక్కున్న చోట చెప్పుకో' అని గెంటేశారు. దొంగతనం కేసు మోపి సంధ్యను ఇబ్బందులకు గురి చేస్తామని బెదిరించాడు. దీంతో బాలిక తల్లి ప్రభావతి కాకినాడ 1098 చైల్డ్ లైన్ సంస్థను ఆశ్రయించింది. ఆ సంస్థకు చెందిన ప్రతినిధి జి.విజయ్‌కుమార్ సాయంతో సామర్లకోట ఎస్ఐ శ్రీను నాయక్‌కు ఫిర్యాదు చేసింది. తమ కుమార్తెను వేధింపుల నుంచి కాపాడి తమకు అప్పగించాలని కోరింది.

గన్నవరం ఘటనలో ఓ యువకుడు మృతి

ప్రజాశక్తి - గన్నవరం

కృష్ణాజిల్లా గన్నవరం పోలీసు స్టేషన్ వద్ద ఎలుకల మందు తిన్న ఇద్దరు యువకుల్లో ఒకరు బుధవారం తెల్లవారుజామున చిన ఆవుటపల్లి ఆసుపత్రిలో మృతి చెందాడు. బుద్దవరం శివారు రాజీవ్‌కాలనీలో యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో ముద్దరబోయిన కోటేశ్వరరావు (18), రామాంజనేయులు, పవన్‌లపై పోలీసులు కేసు నమోదు చేయగా వారిలో మొదటి ఇద్దరూ ఎలుకల మందు తిని మంగళవారం ఆసుపత్రిలో చేరారు. కోటేశ్వరరావు పరిస్థితి విషమించడంతో మృతి చెందాడని పోలీసులు తెలిపారు. రామాంజనేయులు పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు చెప్పారన్నారు. కోటేశ్వరరావు మృతితో కాలనీలో గొడవలు జరుగుతాయనే అనుమానంతో సిఐ శ్రీధర్‌కుమార్ పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. ఫిర్యాదు చేసిన యువతి ఇంటి వద్ద పోలీసులు మోహరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

నౌహీరాకు బెయిల్ తిరస్కరణ

ప్రజాశక్తి-చిత్తూరు నగరం

నౌహీరా బెయిల్ పిటిషన్‌ను చిత్తూరు జిల్లా సెసెన్స్ కోర్టు జడ్జి రవీంద్రబాబు తిరస్కరించారు.

'సీమ'లో కృష్ణమ్మ పరుగులు

- హంద్రీనీవాకు జలహారతి
- బి.కొత్తకోట పరిసరాల్లో పండగ వాతావరణం
- 29 మదనపల్లికి...2కల్లా పుంగనూరుకు

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్

కల నెరవేరింది.. ఆలస్యంగానైనా కృష్ణాజలాల రాక అన్నదాతలు, ఆ ప్రాంత ప్రజల్లో పండగ వాతావరణం నెలకొల్పింది. ఓవైపు రాజకీయాలకతీతంగా ప్రాజెక్టు పరివాహక ప్రాంతమంతా వందలాదిగా జనం విచ్చేసి పసుపు, కుంకుమ చల్లి కృష్ణాజలాలకు రెండ్రోజులుగా స్వాగతం పలుకుతున్నారు. మంత్రులు, అధికారుల హంగామా అంతా.. ఇంతా... కాదు.. కరువుగడ్డ సస్య శ్యామలం కాబోతుందని, ఇదంతా తమ ఘనతేనని అధికార పార్టీ నేతలు సభలు పెట్టి, జలహారతులు ఇస్తున్నారు. ఇదంతా చంద్రబాబు ఘనతని, కృష్ణాజలాలు జిల్లాకు వచ్చిన రోజు చరిత్రలో నిలిచిపోతుందని కొనియాడుతున్నారు. పెద్దతిప్పసముద్రం చెరువుకు వెళ్లే కాల్వల గేట్లను ఎత్తేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. రెండ్రోజులుగా తన సంతోషానికి అవధుల్లేవని సిఎం స్పందించారు. బుధవారం బి.కొత్తకోట మండలంలోని చెరువుల్లోకి నీరు ప్రవేశించింది. 29కల్లా మదనపల్లికి, రెండో తేదీకల్లా పుంగనూరుకు ఈ నీరు చేరుకోనుంది. ఇది ప్రస్తుతం...

గతం... మూడు దశాబ్దాలుగా భూగర్భజలాలు అడుగంటి వెయ్యి అడుగుల లోతులో బోరు వేసినా నీరు పడని భయానకమైన పరిస్థితి. కనీసం తాగడానికి కూడా నీరు దొరకని దయనీయ స్థితుల్లో పొట్ట కూటి కోసం వలస బతుకులు.. బెంగళూరు, చెన్నై, తిరుపతి ప్రాంతాలకు వలసెళ్లి పండగలప్పుడు సొంతూరుకు వచ్చి పోయే యువతే ఈ ప్రాంతంలో కనిపిస్తుంది.. శివారు జిల్లా అయిన అనంతపురం నుంచి అక్కడి కరువుకు తట్టుకోలేక పశువులు, గొర్రెలు మేపుకునేందుకు కాపరులు ఇక్కడికి వస్తే, ఇక్కడి పేదలు తమ పొట్టకొట్టొద్దంటూ ఆకలి 'పోరాటాలు' సైతం చేశారు... చిత్తూరు జిల్లా పడమటి ప్రాంత రైతులకు హంద్రీనీవా జలాల రాక ఓ సుందర స్వప్నం..

టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ హంద్రీ నీవా ప్రాజెక్టుకు 1985లో శ్రీకారం చుట్టారు. కర్నూలు జిల్లాలోని నందికొట్కూరు మండలం మల్యాల గ్రామం వద్ద శ్రీశైలం ఉపరిభాగం నుంచి మొదటి ఎత్తిపోతల కేంద్రం ద్వారా ఇది మొదలవుతుంది. దాదాపు 565 కిలోమీటర్ల పొడవుతో చిత్తూరు జిల్లాలోని తిమ్మాపురం నుంచి ఉపకాలువ ద్వారా నీవా నది వరకూ దీనిని ప్రతిపాదించారు. హంద్రీనీవా రెండో దశలో మన జిల్లాకు నీళ్లు వస్తున్నాయి.


బి.కొత్తకోటకు చేరిన హంద్రీనీవా నీటికి స్వాగతం పలుకుతున్న స్థానికులు

మొదటిదశలో 14 శతకోటి ఘనపుటడుగుల నీటిని వినియోగించి కర్నూలు జిల్లాలో 80 వేల ఎకరాలు, అనంతపురం జిల్లాలో 1.18 ఎకరాలకు సాగునీరు అందించాలని నిర్ణయించారు. ఈ నీటిని 292 మీటర్ల ఎత్తుకు సరఫరా చేయనున్నారు. దీనికి 416.92 మెగావాట్ల విద్యుత్ అవసరం. రెండో దశలో 26 శతకోటి ఘనపుటడుగుల నీరు వినియోగించి అనంతపురం జిల్లాలో 2.27 లక్షల ఎకరాలకు, కడప జిల్లాలో 37,500 ఎకరాలకు, చిత్తూరు జిల్లాలో 1.40 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వనున్నారు. రెండు దశల్లోనూ దాదాపు 30 లక్షల మందికి తాగునీటిని అందించాలని రూపొందించారు. దీనికి 2016లో రూ.7 వేల కోట్లు సవరించిన అంచనాలతో పరిపాలనా అనుమతులిచ్చింది. ఈ జలాల వల్ల తంబళ్లపల్లి, మదనపల్లి, పీలేరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాలకు మేలు చూకూరనుంది.

చిత్తూరు జిల్లా పరిధిలో ప్రాజెక్టు స్వరూపం

ప్రాజెక్టు మొత్తం వ్యయం : రూ.3,137.46 కోట్లు
ఇప్పటికే చేసిన ఖర్చు : రూ.2713.06 కోట్లు
ఇంకా చేయాల్సిన వ్యయం : రూ.560.54 కోట్లు
జిల్లాలో సాగయ్యే ఆయకట్టు: 1,81,400 ఎకరాలు
పంపింగ్ స్టేషన్లకు వాడే విద్యుత్ : 634 మెగావాట్లు
మొత్తం పంపింగ్ స్టేషన్లు : 28

ప్రస్తుతం 150 క్యూసెక్కుల విడుదల

ఈ కృష్ణాజలాలు అనంతపురం జిల్లా జీడిపల్లి వద్ద గల జలాశయం నుంచి 22 కిలోమీటర్లు ప్రయాణించి ఇదే జిల్లాలోని కదిరి వద్ద గల చెర్లోపల్లి రిజర్వాయర్ చేరుతూ వచ్చాయి. 1.425 టిఎంసిల సామర్థ్యం ఉంది. ఇందులో 30 శాతం నీళ్లు నిండిన తర్వాత మూడ్రోజుల క్రితం 150 క్యూసెక్కుల నీటిని కిందికి వదిలారు. ఇవి చిత్తూరు జిల్లాకు ముఖద్వారంగా పిటిఎం వద్ద గల బొంతపల్లికి చేరుకుంది. ఇక్కడున్న చెరువు నిండిన తర్వాత కిందికి వదులుతామని అధికారులు చెబుతున్నారు. తొలుత వేసవి అవసరాలకు తగ్గట్లుగా నీటిని వదలనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వదిలిన నీటితో పుంగనూరు బ్రాంచి కాల్వకు జలకళ వచ్చింది. ప్రస్తుతానికి పెద్దతిప్పసముద్రం, మదనపల్లి, పుంగనూరు, పలమనేరు ప్రాంతాలకు ఈ నీటిని సరఫరా చేయనున్నారు. తాగునీటి అవసరాలకు, ఉద్యానవన పంటలకు వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

సంతోషంగా ఉంది



హంద్రీనీవా నీళ్లు రావడంతో నియోజకవర్గంలోని రైతులు సంతోషంగా ఉన్నారు. హంద్రీనీవా చెరువులు నిండితే రైతు రాజవుతాడు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది. నీటితో పంటలు సస్యశ్యామలం అవుతాయి.

-కూనపరెడ్డి, శెట్టిపల్లి గ్రామం, బి.కొత్తకోట

ఎన్నో ఏళ్ల కల సాకారం



పడమటి ప్రాంత రైతులకు ఎన్నో ఏళ్ల కల ఇప్పుడు సాకారమైంది. ఎన్‌టిఆర్ హయాంలో పునాదిరాయి పడింది. మళ్లీ అదే ప్రభుత్వ హయాంలో నీరు రావడం ఎంతో ఆనందంగా ఉంది.

-ప్రసాద్, బి.కొత్తకోట

వైసిపి గూటికి మంత్రి సోమిరెడ్డి బావ

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సోదరి భర్త కేతిరెడ్డి రామకోటారెడ్డి వైసిపిలో చేరారు. బుధవారం రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి హైదరాబాద్‌లో జగన్ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. తన ఇద్దరు కుమారులతో కలిసి పార్టీలో చేరారు. ప్రస్తుతం టిడిపి ఉపాధ్యక్షులుగా పని చేస్తున్నారు. సోమిరెడ్డి బీద సోదరులకే ప్రాధాన్యత ఇవ్వడంతో రామకోటిరెడ్డి కినుకు వహించారు. ఈ నేపథ్యంలో వైసిపి నేత ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేతిరెడ్డిని పార్టీలోకి ఆహ్వానించారు. రామకోటారెడ్డి చేరిక వల్ల పార్టీకి ఎటువంటి నష్టం లేదని, ఆయన ప్రభావం కావలిలో ఒక వార్డు స్థాయి మాత్రమే ఉంటుందని టిడిపి నేతలు అంటున్నారు.

మేనేజ్‌మెంట్‌కు తొత్తుగా ప్రభుత్వం : సిఐటియు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

చిట్టివలస జూట్ మిల్లు సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం ఆ యాజమాన్యానికి తొత్తుగా వ్యవహరిస్తుందని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు ఎద్దేవా చేశారు. బుధవారం సిఐటియు కార్యాలయంలో చిట్టివలస మిల్లు యూనియన్ గౌరవాధ్యక్షులు ఆర్ఎస్ఎన్.మూర్తి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నర్సిం గరావు మాట్లాడారు. ఈ నెల 22న అమరావతిలో మంత్రులు, జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సమక్షంలో జరిగిన సమావేశంలో యాజమాన్య వాదనలనే వినిపించడానికి మంత్రి పితాని సత్య నారాయణ ప్రయత్నం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. మిల్లు మూసేసిన పదేళ్ల కాలానికి 3 నెలల జీతం నష్టపరిహారాన్ని మూడు వాయిదాల్లో ఇచ్చి ఫైనల్ సెటిల్‌మెంట్ చేయాలని మంత్రి కోరారన్నారు. అప్రంటీస్ కార్మికులు 2150 మందికి ఎలాంటి సెటిల్‌మెంట్ చేయబోమనడం సరికాదన్నారు.

మావుళ్లమ్మ సన్నిధిలో గేయ రచయిత చంద్రబోస్

ప్రజాశక్తి-భీమవరం రూరల్(పశ్చిమగోదావరి)

ప్రముఖ సినీ గేయ రచయిత, గాయకుడు చంద్రబోస్ పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని శ్రీమావుళ్లమ్మ అమ్మవారిని బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధరరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సత్కరించి, అమ్మవారి ప్రతిమను అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబోస్ మాట్లాడుతూ మావుళ్లమ్మ అమ్మవారిని దర్శించుకోవడం తనకెంతో ఆనందంగా ఉందని చెప్పారు.

సంపాదకీయం

హ్యాకింగ్ రాజకీయం

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఇవిఎం)ల హ్యాకింగ్ విషయంలో వస్తున్న ఆరోపణలపై కేంద్రంలోని బిజెపి సర్కారు ప్రవర్తన ఆక్షేపణీయం. ఇవిఎంలపై కొంత కాలంగా అనుమానాలు ముసురుకొంటుండగా సైబర్ నిపుణుడిగా పేర్కొంటూ ఇవిఎంల హ్యాకింగ్‌పై రెండు రోజుల క్రితం సయ్యద్ షుజా వెల్లడించిన అంశాలు రాజకీయ దుమారానికి దారి తీశాయి. మన ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల వ్యవస్థకు ఉన్న ప్రాధాన్యత తెలిసిందే. ప్రజలు ఎవరికి ఓట్లు వేస్తే ఆ పార్టీ అధికారంలోకొస్తుంది. ఇప్పటి వరకు ప్రజల్లో అదే అభిప్రాయం ఉంది. అలాంటి వ్యవస్థలో కీలకమైన ఇవిఎంలపై ఆరోపణలొచ్చినప్పుడు బాధ్యతగల ప్రభుత్వం ఏదైనా వెంటనే దర్యాప్తునకు ఆదేశిస్తుంది. ఆరోపణల్లో నిగ్గు తేలుస్తుంది. అనుమానాలు సందేహాలను నివృత్తి చేస్తుంది. తప్పుడు ఆరోపణలని నిర్ధారణ అయితే ఆరోపణలు చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటుంది. కానీ బిజెపి సర్కారు అందుకు భిన్నంగా రాజకీయ విమర్శలకు దిగడం దారుణం. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఇవిఎంల ట్యాంపరింగ్ అసాధ్యమని ఎలాంటి విచారణ లేకుండానే క్లీన్ చిట్ ఇచ్చేశారు. మరో మంత్రి రవిశంకర్ ప్రసాద్ రంగంలోకి దిగి షుజా ప్రెస్ కాన్ఫరెన్స్ కాంగ్రెస్ ప్రాయోజిత కార్యక్రమంగా చెప్పుకొచ్చారు. మన దేశ ప్రజాస్వామ్యాన్ని అప్రదిష్ట పాల్జేసేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నిందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి ఖాయమని తెలుసుకున్న కాంగ్రెస్, విపక్షాలు ఇప్పటి నుంచే కారణాలు వెదుక్కుంటున్నాయని అర్థం పర్థం లేకుండా వాక్చాపల్యం ప్రదర్శించారు. సాధారణ ఎన్నికలకు మూడు నెలల ముందు ఇవిఎంలపై రాజకీయ రాద్ధాంతం సాగుతుండటం ప్రజల్లో గందరగోళానికి దారి తీస్తుంది.

ఇవిఎంల ట్యాంపరింగ్‌పై వెలువడుతున్న ఆరోపణలను సాదాసీదాగా పరిగణించలేం. అతిపెద్ద ప్రజాస్వామ్యం అని ఇంతకాలం కీర్తించబడ్డ మన దేశ పరువుకు సంబంధించినది. తాము ఓట్లేసిన పార్టీయే అధికారంలోకొస్తుందన్న ప్రజల నమ్మకానికి సంబంధించిన అంశం. ఇవిఎంల వాడకం 1996లో మొదలుకాగా అడపాదడపా వాటిపై ఆరోపణలొస్తూనే ఉన్నాయి. దేశ సర్వోన్నత న్యాయస్థానం ఇవిఎంలకు వివిప్యాట్‌లను అమర్చాలని పలు కేసుల విచారణ సమయంలో ఆదేశించింది. అప్పుడు ఓటరు ఏ పార్టీకి ఓటు వేశారో తెలుస్తుంది. ఆ పూర్వరంగంలోనే ఎన్నికల సంఘం వివిప్యాట్‌లను ప్రవేశపెట్టింది. కేవలం ఐదు శాతం ఇవిఎంలకు మాత్రమే వీటిని పెడుతున్నారు. అమర్చిన అన్ని వివిప్యాట్‌ల్లోని రసీదులనూ లెక్కించరు. ఒక్కో నియోజకవర్గంలో లాటరీ వేసి ఒక్క వివిప్యాట్‌లోని రసీదులనే లెక్కిస్తారు. దాని ఆధారంగా అంతా బాగానే ఉందని నిర్ధారిస్తారు. అన్ని ఇవిఎంలకూ వివిప్యాట్‌లను అమర్చాలని, వాటన్నింటిలోని రసీదులనూ లెక్కించాలన్న డిమాండ్ ముందుకురాగా అది ఖర్చుతో కూడుకున్నదని బిజెపి సర్కారు వాదిస్తోంది. వాస్తవానికి బిజెపి హయాంలో చోటు చేసుకున్న రాఫెల్, బ్యాంక్‌ల కుంభకోణాలతో పోలిస్తే వివిప్యాట్‌లకు అయ్యే ఖర్చు సముద్రంలో నీటి బొట్టంత కూడా కాదు. పైగా ప్రజాస్వామ్యానికి కట్టుబడ్డ ప్రభుత్వం ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం కలిగించేందుకు ఎంతైనా ఖర్చు చేయాలి. ఆ దృష్టి మోడీ సర్కారుకు కరువైంది. ఇవిఎంల ట్యాంపరింగ్‌పై మాట్లాడేవారు దాన్ని నిరూపించాలనడం బిజెపి ప్రభుత్వ 'అతి' తెలివికి పరాకాష్ట. బాధ్యతారాహిత్యం. ఎక్కడైనా ఫిర్యాదుదారు నేరాన్ని నిరూపిస్తాడా? లేక దర్యాప్తు సంస్థలా? ఈ మాత్రపు ఇంగిత జ్ఞానాన్ని సైతం మంత్రులు కోల్పోతున్నారు.

సరిగ్గా పార్లమెంట్ ఎన్నికలకు మూడు నెలల ముందు ఇవిఎంలతో సహా అన్ని ఎలక్ట్రానిక్ సమాచార సాధనాలూ కేంద్ర నిఘా సంస్థల గుప్పెట్లోకి వచ్చేలా మోడీ సర్కారు దుర్మార్గపూరిత ఉత్తర్వులు జారీ చేసింది. దాంతో వివిధ పార్టీలకు చెందిన సమాచారం, ఆయా ప్రాంతాల ప్రజల మనోభావాలు, ఇవిఎంలలో నిక్షిప్తమైన కోడ్‌లు అన్నీ ప్రభుత్వ వశమవుతాయి. అలాంటప్పుడు ఇవిఎంలను ట్యాంపరింగ్ చేయడం అధికారంలో ఉన్న వారికి అసాధ్యమా? ఇవిఎంలపై వస్తున్న అనుమానాలను కేంద్రం ఇచ్చిన ఈ ఉత్తర్వులు మరింత పలచనే తప్ప నివారించేవి కావు. సదరు ఉత్తర్వులను కేంద్రం ఉపసంహరించుకోకుండా ప్రజల్లో సందేహాలు తొలగుతాయా? ఇవిఎంలపై ప్రజల్లో, పార్టీల్లో నెలకొన్న అనుమానాలు, సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనా, ఎన్నికల సంఘంపై తప్పకుండా ఉంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకునే విషయంలో ఎవ్వరికీ భిన్నాభిప్రాయం ఉండదు. వచ్చిన ఆరోపణలను, అనుమానాలను త్వరితగతిన నివృత్తి చేయకపోతే ప్రజల్లో నమ్మకం పోతుంది. ఇవిఎంలపై వస్తున్న ఆరోపణల నిగ్గు తేల్చేందుకు బిజెపి సర్కారు ముందుకొస్తుందా? లేదా? అన్నది తేల్చాలి. అలా కాకుండా ఎదురుదాడితో తప్పించుకోజూస్తే కుదరదు.

ఇది విషయం



చిట్టితల్లీ...
నీ పాల బుగ్గలపై గడ్డకట్టిన
కన్నీటి చారికల్ని శాశ్వతంగా తుడిచేసేందుకు
మేము ఎన్నెన్ని నిప్పుల సముద్రాలైనా
ఎదురీదుతాము
ఈ శిశు హంతకుల అంతంకై
ఈ నేలన ఎంత రక్తాన్నయినా ధారపోస్తాము

- విమల

విశ్లేషణ

రక్షణరంగ ఉద్యోగుల మూడు రోజుల సమ్మె

బి చంద్రయ్య

రక్షణరంగం ప్రైవేటీకరణను నిరసిస్తూ, నూతన పెన్షన్ విధానం రద్దు కోసం మూడు ఫెడరేషన్లు (ఎఐడిఇఎఫ్, బిపిఎంఎస్, ఐఎన్‌డిడబ్ల్యుఎఫ్) ఇచ్చిన పిలుపు మేరకు లక్షలాది మంది సివిలియన్ ఉద్యోగులు జనవరి 23,24,25న దేశవ్యాప్తంగా సమ్మెలో పాల్గొంటున్నారు.

ఏ దేశానికైనా ఆ దేశ రక్షణ అతి ముఖ్యం. అందుచేతనే ప్రపంచ దేశాలన్నిటిలోనూ తమవైన సొంత రక్షణ విధానాలు వున్నాయి. అత్యధిక మిలటరీ సామర్థ్యం కల్గిన దేశాలలో భారత్ మూడో స్థానంలో ఉన్నది. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ దేశీయ పరిజ్ఞానంతో పూర్తి సామర్థ్యం కలిగి ఉన్నట్టయితే దేశాన్ని సురక్షితంగా కాపాడతాయి. రక్షణ రంగంపై పెట్టే ఖర్చులో భారతదేశం ప్రపంచంలో 5వ స్థానంలో ఉంది. 2015లో భారతదేశ జీడీపీలో 2.4038 శాతం రక్షణ రంగంలో ఖర్చు చేసింది. ఈ రంగంలో ఉపయోగించే టెక్నాలజీ చాలా క్లిష్టమైనది. బ్రిటీష్ వారు దేశం నుండి వెళ్ళాక, భారతదేశం స్వంత రక్షణ సామర్థ్యం గురించి మొదటి పారిశ్రామిక తీర్మానంలో దేశ సార్వభౌమత్వం, స్వావలంబన గురించి తీర్మానం చేసింది. ఆ తర్వాత రక్షణ, రైల్వే, రవాణా, అటామిక్ ఎనర్జీ తదితర రంగాల్లో ప్రభుత్వ ఆధీనంలోనే అభివృద్ధి చేయాలని తీర్మానించారు.

మోడీ అధికారంలోకి రాగానే రక్షణ శాఖలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 100 శాతం అనుమతిస్తూ రక్షణ, శాఖలో డిపిపిపి అనే కొత్త పాలసీ ప్రవేశపెట్టారు. ఈ పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ పాలసీ డిఆర్‌డిఓలో వేలాది మంది అనుభవం, సామర్థ్యం కలిగిన శాస్త్రవేత్తలు, టెక్నీషియన్లు ఉన్నారు. అయినా ఈ ప్రభుత్వం టెక్నాలజీ పరిశోధనలు ఎల్‌ఎన్‌టి, మహేంద్ర లాంటి కంపెనీలకు కట్టపెట్టింది.

2000లో డిఆర్‌డిఓలో 35000 మంది పని చేసేవారు. ప్రస్తుతం వారి సంఖ్య 24000కు తగ్గింది. డిఆర్‌డిఓలో 28 శాతం మాత్రమే శాశ్వత ఉద్యోగులు పని చేస్తున్నారు. హైదరాబాద్‌లో డిఆర్‌డిఎల్, డిఎల్‌ఆర్‌ఎల్, డియంఆర్‌ఎల్, ఆర్‌సిఐ, అనురాగ్ మొదలయిన డిఆర్‌డిఓ ల్యాబ్స్‌లో సుమారు 5000 మంది శాస్త్రవేత్తలు, ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరితో పాటు సుమారు 5000 మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు అతి తక్కువ జీతాలు, పి.ఎఫ్, ఇయస్ఐ లేకుండా పనిచేస్తున్నారు. ప్రభుత్వం విధానాల మూలంగా ఇంత ప్రతిష్టాత్మక రంగాన్ని భవిష్యత్తులో పూర్తిగా ప్రైవేటుపరం చేయాలని చూస్తున్నది.

లాభాల కోసం ఏ పనికైనా పెట్టుబడిదారులు తెగబడతారన్నది జగమెరిగిన సత్యం. వీరు తయారు చేసిన ఆయుధాలు లాభాల కోసం ఎవరికైనా అమ్ముకుంటారు. ఇప్పటికే ఉగ్రవాదులు, నక్సలైట్లు, సంఘ వ్యతిరేక శక్తుల చేతిలో ఆయుధాలు చూస్తున్నాం. రేపు అమెరికాలో లాగ స్కూల్ పిల్లల సంచులలో పెన్నులకు బదులు గన్నులు చూడాల్సి వస్తుంది. పెట్టుబడిదారులకు లాభాలు రావాలంటే వారు తయారు చేసే ఆయుధాలు అమ్ముడు పోవాలి. దానికి యుద్ధాలు కావాలి. ఆ యుద్ధాలను అమెరికా ఏ రకంగా సృష్టించిందో అన్న విషయం ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, లిబియా, సిరియా, ఆఫ్రికా ఖండంలోని అనేక దేశాలను చూస్తే అర్థం అవుతుంది. మన పక్కనున్న పాకిస్తాన్‌కు ఆయుధాలు అమ్మడంతో పాటు ఉగ్రవాద మూకలను ఏ విధంగా మన దేశం పైకి ఎగదోస్తుందో నిత్యం చూస్తున్నాం.



లాభాల కోసం ఏ పనికైనా పెట్టుబడిదారులు తెగబడతారన్నది జగమెరిగిన సత్యం. వీరు తయారు చేసిన ఆయుధాలు లాభాల కోసం ఎవరికైనా అమ్ముకుంటారు. పెట్టుబడిదారులకు లాభాలు రావాలంటే వారు తయారు చేసే ఆయుధాలు అమ్ముడు పోవాలి. దానికి యుద్ధాలు కావాలి. ఆ యుద్ధాలను అమెరికా ఏ రకంగా సృష్టించిందో అన్న విషయం ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, లిబియా, సిరియా, ఆఫ్రికా ఖండంలోని అనేక దేశాలను చూస్తే అర్థం అవుతుంది.

ప్రైవేటు కంపెనీలు అద్భుతంగా పని చేస్తాయని ప్రభుత్వ నేతలు ఊదరగొడుతుంటారు. ఇదే నిజమైతే దేశవ్యాప్తంగా 5 లక్షల పైబడిన భారత, ప్రైవేటు కంపెనీలు ఎందుకు మూతపడ్డాయో చెప్పాలి. విజయ్‌మాల్యా వంటి వారు ఎందుకు బ్యాంక్‌లకు కోట్లాది రూపాయల సొమ్ము ఎగనామం పెట్టారో సమాధానవ ఇవ్వాలి. రక్షణ రంగం అనగానే రహస్యం అని ప్రభుత్వం చెబుతోంది. ఈ రహస్యం మాటున వేల కోట్ల ప్రజా ధనానికి జవాబుదారీతనం లేకుండా పోయింది. తాజాగా రాఫెల్ కుంభ కోణాన్ని చూస్తున్నాం.

ప్రభుత్వ ఆధీనంలోని ఇస్రో ఒకసారి 103 ఉపగ్రహాలను అంతరిక్షంలోనికి పంపి ప్రపంచానికి మన సత్తా చాటింది. అటువంటి సత్తా మన దేశంలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు, డిఆర్‌డిఓలకి ఉన్నది. కావలసిందల్లా వాటికి తగిన నిధులిలిచ్చి వాటి పరిశోధనలకు అడ్డు పడకుండా ప్రభుత్వం వుండాలి. మన డాక్‌యార్డులు ఎక్కడో తయారై వచ్చిన యుద్ధ నౌకలను ఎటువంటి శిక్షణ ఇవ్వకపోయిన రిపేర్లు చేసి తమ నైపుణ్యాన్ని నిరూపించుకున్నారు. మన రక్షణ రంగంలో శాస్త్రవేత్తలు, మేధావులు, అధికారులకు, సుశిక్షితమైన కార్మిక వర్గానికి కొదువలేదు. వీరి నైపుణ్యాన్ని ఉపయోగించుకుంటే ప్రపంచంలోనే తిరుగులేని అజేయశక్తిగా మన రక్షణరంగాన్ని నిలబెడతారు. దేశరక్షణను కంటికి రెప్పలా కాపాడుతారు.

కోర్-నాన్ కోర్ పేరు. గోకో మోడల్ పేరున కొత్త పాలసీ తీసుకువచ్చి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలలో వర్క్ లోడ్ తగ్గించారు. దానివల్ల కార్మికులకు నష్టం జరుగుతున్నది. స్టేషన్ వర్క్‌షాపులు మూసివేశారు. ఆర్మిబేస్ వర్క్‌షాప్ మూసేస్తున్నారు. అన్ని డిఫెన్స్ డిపార్టుమెంట్లలో క్యాజువల్, కాంట్రాక్టు వర్కర్లను నింపుతున్నారు.

2004 తర్వాత ఉద్యోగంలో చేరిన వారికి పెన్షన్ లేకుండా ప్రతినెల జీతంలో 10 శాతం కత్తిరిస్తున్నారు. 1972 నుంచి అమలులో ఉన్న ఒక సామాజిక భద్రత వృద్ధాప్యంలో ఆసరాగా ఉండే వ్యవస్థను రద్దు చేశారు. 2004 తర్వాత ఉద్యోగంలో చేరి రిటైర్ అవుతున్న వారికి వేయి నుంచి రెండు వేల పెన్షన్ మాత్రమే వస్తున్నది. రక్షణ శాఖలో 4 లక్షల సివిల్ ఉద్యోగులకు నాయకత్వం వహిస్తున్న మూడు ఫెడరేషన్లు, ఎఐడిఇఎఫ్, ఐఎన్‌డిడబ్ల్యుఎఫ్, బిపిఎంఎస్ కలిసి దేశవ్యాప్తంగా నిన్నటి నుంచి (జనవరి 23, 24, 25 తేదీలలో) మూడు రోజుల సమ్మెకు దిగాయి. గతేడాది నుంచి మూడు ఫెడరేషన్లు సంయుక్తంగా కేంద్ర ప్రభుత్వానికి ఎన్నో మార్లు మెమోరాండాలు, వివిధ రకాల నిరసనలు తెలిపినా ప్రభుత్వం ఖాతరు చేయలేదు. పైగా ఇటీవల పార్లమెంట్‌లో రక్షణ శాఖ సహాయ మంత్రి రక్షణ శాఖలను ఎప్పుడెప్పుడు మూసివేసి కార్పొరేట్ శక్తులకు ధారపోసేది పార్లమెంట్ సాక్షిగా ప్రకటించారు.

అందువల్ల అనివార్యంగా మూడు ఫెడరేషన్లు సమ్మెలోకి వెళ్లాల్సిన పరిస్థితి ప్రభుత్వమే కల్పించింది. కాబట్టి దేశరక్షణ కోరుతూ నూతన పెన్షన్ విధానం రద్దు కోసం నిర్వహిస్తున్న సమ్మెకు ప్రజలందరూ మద్దతు తెలపాలని విజ్ఞప్తి.

(రచయిత సెల్ : 9705069310)

కామెంట్

మహుల్ లో 'జీవన్ బచావో ఆందోళన్'

మహుల్ ప్రాంతం మనుషులు జీవించడానికి అనువైనది కాదని మహారాష్ట్ర కాలుష్య నివారణ బోర్డు 2015లో తేల్చి చెప్పింది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కూడా ఇదే మాట చెప్పింది. అయినప్పటికీ ముంబైలోని తన్సా లేక్ పైప్‌లైన్ పరిసరాల నుంచి 5,700 కుటుంబాలను మహుల్ కు తరలించిన తీరు పేదల పట్ల ఏలికలు ఎంత కిరాతకంగా వ్యవహరిస్తున్నారో తెలియచేస్తోంది. అంతేగాక వారికి పేదల పట్ల ఎంత తీవ్రమైన నిర్లక్ష్యం ఉందో కూడా రుజువు చేస్తోంది. పేదల విషయంలో ఎలాంటి బాధ్యత ప్రభుత్వం తీసుకోవడం లేదనడానికి ఇదే నిదర్శనం. దశాబ్ద కాలంగా నివసిస్తున్న చోటి నుంచి 30,000 మందిని 'గ్యాస్ చాంబర్' అని భావించే చోటకు, 'విషపూరిత నరకానికి' తరలిస్తున్నారు. ఇది రాజకీయ ప్రయోజనాలకు చిహ్నం. వీరికి బలవంతంగా 'పునరావసం' కల్పిస్తున్నారు. పునరావాసం కల్పించే చోట వారికి ఎలాంటి మౌలిక వసతులూ ఉండడం లేదు. ఇలా తరలిపోయే వారందరూ ముందే దుర్భర జీవితం గడుపుతున్న వారు. అరకొర జీవనోపాధి ఉన్న వారు. అయితే ఇలా తరలింపునకు గురైన వారు మారు మాట్లాడకుండా తరలిపోకపోవడం సంతోషకరమైన విషయం. తమ దుస్థితిని అధికారుల దృష్టికి తీసుకురావడానికి ఆ నిర్భాగ్యులు అనేక పద్ధతులు అనుసరిస్తున్నారు.

వివిధ ప్రాజెక్టుల దుష్ప్రభావానికి లోనైన వారు దాదాపు 30 లక్షల మంది ఉన్నారు. వీరికి ఇంకా పునరావాసం కల్పించవలసే ఉంది. తన్సా పైప్ లైన్ కు 10 మీటర్ల దూరంలో ఉండడం భద్రతకు ముప్పు కనక అక్కడ మురికివాడల్లో ఉండే వారిని, వారి గుడిసెలను తొలగించాలని మహుల్ కేసులో బొంబాయి హైకోర్టు 2009లో ఆదేశించింది. నివాసం ఉంటున్న 16,717 గుడిసెల్లో 7,674 గుడిసెల్లోని వారు పునరావాసానికి అర్హులని నిర్ణయించారు. దీనికి ఆ గుడిసెవాసులు నిరసన వ్యక్తం చేశారు. ప్రస్తుత మంత్రివర్గంలో సభ్యుడైన ఒకరితో పాటు రాజకీయ నాయకులు తమ బాధలను పట్టించుకుంటామని హామీ ఇచ్చినట్టు వారు తెలియజేశారు. కానీ బలవంతంగా వారి గుడిసెలను తొలగించినందువల్ల వారు మహుల్ కు తరలిపోవలసి వచ్చింది. ఏడేసి అంతస్తులున్న 72 భవనాల్లోకి వారిని తరలించారు. అక్కడ బతుకు దుర్భరంగా ఉంది. మౌలిక సదుపాయాలు, ఇతర వసతులు ఏమీ లేవు. అంతమంది ఒకే చోట ఉన్నప్పుడు ఉండవలసిన ఏ సదుపాయమూ లేదు. ఈ భవనాలు రెండు భారీ చమురు శుద్ధి కేంద్రాల, ఒక విద్యుదుత్పాదన కేంద్రం, ఒక రసాయన-ఎరువుల ఉత్పత్తి కేంద్రం, ఇతర భారీ పరిశ్రమల మధ్యలో ఉన్నాయి.

కొంత మంది మహుల్ ప్రాంత ప్రజలు, తన్సా పైప్ లైన్ ప్రభావానికి లోనయ్యే వారు ఒక పిటిషన్ దాఖలు చేసినప్పుడు వారికి మరో చోట నెల రోజుల్లోగా పునరావాసం కల్పించాలని బొంబాయి హైకోర్టు 2018 ఆగస్టులో ఆదేశించింది. ఈ అంశంపై గృహ నిర్మాణ శాఖ మంత్రి వారిని కుర్లా ప్రాజెక్టు ఉన్న చోటికి తరలిస్తామని హామీ ఇచ్చారు. కాని ముఖ్యమంత్రి మాత్రం ఈ విషయం కోర్టు పరిశీలనలో ఉంది కనక ఆ విషయంపై నిర్ణయం తీసుకోలేమని చెప్పారు. ఇది రెండు నాల్కల ధోరణికి నిదర్శనం.

ఇక్కడ ఉండే వారికి ఆరోగ్య విద్యా సదుపాయాలు దగ్గరలో అందుబాటులో లేవు. వాటికయ్యే ఖర్చు కూడా వారు భరించే పరిస్థితి లేదు. అక్కడ నివసించే వారికి చర్మం దద్దుర్లు ఎక్కడం, ఊపిరితిత్తుల సమస్యలు, క్షయ వంటివి పీడిస్తున్నాయి. శారీరకంగా వారు అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోంది. తమకు సోకుతున్న అనేక రుగ్మతలకు అక్కడి కాలుష్యమే కారణమని ఒక ప్రభుత్వ ఆసుపత్రి నిర్వహించిన సర్వే ఫలితాలను కూడా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన వారు ఉటంకించారు. దీనికి తోడు వారికి సరఫరా చేసే నీరు కలుషితమైంది. డ్రైనేజీ సదుపాయం దాదాపు లేనట్టే. ఇక్కడ నివాసం ఉంటున్న తర్వాత జబ్బులతో మరణిస్తున్న వారు పెరిగిపోయారని సమాచార హక్కు చట్టం కింద దాఖలైన కేసుల్లో వెల్లడించిన సమాచారం రుజువు చేసింది.



ఇక్కడ నివసించే వారు మీడియాతోనో, అధికారులతోనో మాట్లాడితే మృత్యువునే ప్రస్తావిస్తుంటారు. మరణించడానికే తమను అక్కడికి తరలించారంటారు. తమ ఆందోళనను 'జీవన్ బచావో ఆందోళన్' అంటారు. రాజ్యం దృష్టిలో తాము సజీవంగా లేనట్టే లెక్క అంటారు.

అందుకే ఇక్కడ నివసించే వారు మీడియాతోనో, అధికారులతోనో మాట్లాడితే మృత్యువునే ప్రస్తావిస్తుంటారు. మరణించడానికే తమను అక్కడికి తరలించారంటారు. తమ ఆందోళనను 'జీవన్ బచావో ఆందోళన్' అంటారు. రాజ్యం దృష్టిలో తాము సజీవంగా లేనట్టే లెక్క అంటారు.

ఒక ప్రభుత్వం తర్వాత మరో ప్రభుత్వం ముంబైని 'అంతర్జాతీయ స్థాయి నగరం'గా రూపుదిద్దుతామని వాగ్దానాలు చేశాయి. కానీ ఈ ఊహాజనిత 'అంతర్జాతీయ స్థాయి నగరం' వారి పాలిట పగబట్టినట్టే ఉంది. అక్కడ జరుగుతున్న మౌలిక వసతుల కల్పన గురించి ఎంత చెప్పినా, ముబై రాజకీయంగా చైతన్యవంతమైన నగరం అని ఊదరగొట్టినా, ఆ నగరానికి శ్రామికులే దన్ను అని చెప్పినా వాస్తవం ఈ వాదనకు పూర్తి విరుద్ధంగా ఉంది. ప్రజా రవాణాను పనిగట్టుకుని బలహీనపరుస్తున్నందువల్ల ప్రజలు నగరం పొలిమేరలకు తరలి పోవలసి వస్తోంది. దీన్నిబట్టి ప్రభుత్వం ఇచ్చే సందేశం ఏమిటో స్పష్టం అవుతూనే ఉంది. ఈ పరిణామాన్ని అంగీకరించకపోతే అడ్డు తొలగండి, కిమ్మనకుండా కడతేరండి అన్నదే ఆ సందేశం. ఎగుడు దిగుడుగా ఉన్న ఈ పరిణామాన్ని మహుల్ వాసులు తప్ప ఇతర ప్రాంతాలవారెవరూ గొంతెత్తకపోవడం దురదృష్టకరం.

ప్రభుత్వ పట్టణాభివృద్ధి పథకాలు, పేదలకు, అల్పాదాయ వర్గాలకు కల్పిస్తున్న గృహవసతి ఎంత అధ్వానంగా ఉందో మహుల్ పునరావాస ప్రాంతాలు రుజువు చేస్తున్నాయి. అవి ఏ మూలకూ సరిపోవడం లేదు. నగర నిర్మాణంలో నగరంలో నివసించే అత్యధిక ప్రజల తోడ్పాటును ఖాతరు చేయడం లేదు. ఆ నగర ఆర్థిక వ్యవస్థలో వీరి వాటాను అసలే పరిగణించడం లేదు. అయితే మహుల్ వాసుల స్ఫూర్తి మాత్రం ప్రశంసనీయమైంది.

('ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ' సంపాదకీయం)

అంబేద్కరే ఆమెకు స్ఫూర్తి


బెందాళం క్రిష్ణారావు

మహిళల జీవితాల్లో వెలుగులు నింపాలన్న ఆకాంక్షతో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ హిందూ కోడ్ బిల్లుకు రూపకల్పన చేశారు. అయితే అప్పటి ప్రభుత్వం ఆ బిల్లును ఆమోదించకపోవడంతో తన కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేశారాయన. అటువంటి ఆయన కృషి వృధా కాలేదని ఈశ్వరీబాయి లాంటి వారు రుజువు చేస్తుంటారు. సామాజిక న్యాయం కోసం, మహిళల అభ్యుదయం కోసం, మానవ హక్కుల కోసం కృషి చేసిన దళిత బహుజన నాయకురాలు ఈశ్వరీబాయి. ఇది ఆమె శత జయంతి సంవత్సరం.

భల్లెపు బలరామ స్వామి-రాములమ్మ దంపతులకు 1918 డిసెంబర్ 1న నిజామాబాద్‌లో ఈశ్వరీబాయి జన్మించారు. ఆమె ప్రాథమిక విద్య మిషన్ పాఠశాలలో సాగింది. కీస్ హైస్కూలులో ఉన్నత విద్యనభ్యసించారు. 13వ ఏట మహారాష్ట్రలోని పూణెకు చెందిన డాక్టర్ జె.లక్ష్మీనారాయణతో వివాహమైంది. చిన్నప్పటి నుంచే విశాల భావాలు, స్వతంత్ర వ్యక్తిత్వం, స్వావలంబన వంటి అభ్యుదయ భావాలున్న ఆమె విద్యాధికురాలయ్యాక సికింద్రాబాద్‌లోని ఒక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేశారు. ఆ తర్వాత కొన్నాళ్లకు పౌరసరఫరాల శాఖలో ఉద్యోగం వచ్చింది.

ప్రభుత్వోద్యోగంలో ఉన్నా చుట్టూ సమాజంలో కన్పించే అసమానతలు ఆమెను కుదురుగా ఉండనివ్వలేదు. సమాజ పరిస్థితులను నిశితంగా అధ్యయనం చేసిన ఆమె పేదరికం, దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తున్న ప్రజలను చూసి చలించి పోయేవారు. కుల దురహంకారులు, ఫ్యూడల్ వర్గాల పెత్తనం కింద నలిగిపోతున్న వారి బాధలనెన్నింటినో ఆమె ప్రత్యక్షంగా చూశారు. పీడిత వర్గాల తరపున న్యాయం కోసం నిలబడాలనే దృఢ సంకల్పం, అంకిత భావంతో సేవ చేయాలనే తపన ఆమెను ప్రజా జీవితంలోకి తీసుకొచ్చింది.

1942 జూన్‌లో నాగ్‌పూర్‌లో జరిగిన అఖిల భారత దళిత కులాల సభకు హైదరాబాద్ రాష్ట్ర ప్రతినిధిగా ఈశ్వరీబాయి హాజరయ్యారు. ఆ సందర్భంలోనే ఆమె మొట్టమొదటిసారిగా అంబేద్కర్‌ను కలుసుకున్నారు. అదే సదస్సులో 'అఖిల భారత ఎస్సీ ఫెడరేషన్'ను ఆయన స్థాపించారు. ఈశ్వరీబాయి ఆ సంస్థ కార్యకలాపాల్లో క్రియాశీలకంగా పాల్గొన్నారు. ఆ తరవాత ఎస్సీ ఫెడరేషన్ స్థానంలో ఆయన అనుయాయులు 1957 ఎన్నికలకు ముందు 'రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పిఐ)' అనే రాజకీయ పార్టీని స్థాపించారు. ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్ శాఖకు ఈశ్వరీబాయి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అంబేద్కర్ రాజ్యాంగబద్ధంగా అందించిన హక్కులు, ఆయన ఉపన్యాసాలు ఆమెను ప్రభావితం చేశాయి. కొన్ని సామాజిక సంస్థల సహకారంతో సికింద్రాబాద్ చిలకలగూడలో గీతా విద్యాలయాన్ని ప్రారంభించారు. ఆ ప్రాంతంలో మహిళలను సమీకరించి, వారు స్వీయ గౌరవంతో తమ కాళ్లపై తాము నిలబడేలా వెన్నుదన్నుగా నిలిచారు.



ఈశ్వరీబాయి శత జయంతి సంవత్సర ముగింపు సందర్భంగా

స్వాతంత్ర్యానంతరం హైదరాబాద్ సంస్థానాన్ని భారత ప్రభుత్వంలో కలిపిన తర్వాత హైదరాబాద్-సికింద్రాబాద్ నగరాలను కలిపి కార్పొరేషన్‌గా మార్చారు. 1951లో జరిగిన ఎన్నికల్లో చిలకలగూడ (సీతాఫల్ మండి) వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఈశ్వరీబాయి పోటీ చేసి గెలుపొందారు. ముక్కుసూటితనం, నిజాయితీ ఆమెకు మంచి గుర్తింపునిచ్చాయి. ఆనాడు అధికార పార్టీలో చేరాలని ఎన్నో ఒత్తిళ్లు వచ్చినా ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా అంబేద్కర్ ఆశయ సాధన కోసం, ఆయన స్థాపించిన పార్టీలోనే అఖిల భారత స్థాయిలో సారథ్యం వహిస్తూ కొనసాగారు. ప్రజలకు పారిశుధ్యం, ఆరోగ్యం, కార్మికుల శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమించారు.

1967 ఆంధ్రప్రదేశ్ శాసనసభకు జరిగిన ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా నిజామాబాద్ జిల్లా ఎల్లారెడ్డి శాసనసభకు పోటీ చేసి గెలుపొందారు. అంబేద్కర్ రాజకీయ వారసురాలిగా తెలంగాణ ప్రజాపార్టీ మద్దతు ఇవ్వడంతో కాంగ్రెస్ అభ్యర్థిపై విజయం సాధించారు. అదే నియోజక వర్గంలో 1972 శాసనసభ ఎన్నికల్లో కూడా రెండో సారి గెలుపొంది తనదైన ముద్ర వేశారు. ఆనాటి ప్రతిపక్ష నాయకులైన పుచ్చలపల్లి సుందరయ్య, తరిమెల నాగిరెడ్డి, వావిలాల గోపాల కృష్ణయ్య, గౌతు లచ్చన్న తదితరుల పక్కన కూర్చొని ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేవారు. దళితులపై జరిగే అకృత్యాలను ఆమె ఎట్టి పరిస్థితుల్లోనూ సహించలేదు. అది తరతరాల నుంచీ దళితులపై కొనసాగుతున్న అణచివేతకు, అన్యాయాలకు, అత్యాచారాలకు ప్రేరణగా ఉన్న మనువాద వ్యవస్థకు వ్యతిరేకంగా ఎత్తిన పిడికిలి.


1956లో హైదరాబాద్ రాష్ట్రాన్ని, ఆంధ్ర రాష్ట్రాన్ని కలుపుతూ ఆంధ్రప్రదేశ్ ఏర్పాటైనప్పుడు ఏర్పడిన తెలంగాణ ప్రజా సమితిలో కార్యనిర్వాహక సభ్యురాలిగా ఆ ఉద్యమంలో ముఖ్యమైన పాత్ర నిర్వహించారు. ఈ సందర్భంలో జైలు జీవితాన్ని కూడా గడిపారు. తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, ఇంగ్లీష భాషల్లో ప్రావీణ్యం ఉన్న ఈశ్వరీబాయి మంచి వక్త. నిశిత విమర్శనా దృక్పథం కలిగిన నాయకురాలు. తన కుమార్తె గీతారెడ్డిని ఉన్నత విద్యావంతురాలిగా తీర్చిదిద్దారు. దళిత నేతగా మహోన్నత వ్యక్తిత్వాన్ని సొంతం చేసుకున్న ఈశ్వరీబాయి 1991 ఫిబ్రవరి 24న తుదిశ్వాస విడిచారు. ఆమె జీవితం ఎవరికైనా నిరంతర స్ఫూర్తిమంతం.

సందర్భం

బాలికలకు భరోసా!

వాసిలి సురేష్

బాలికలకు సరైన విద్య అందించడం ద్వారానే మహిళల పురోభివృద్ధి సాధ్యమవుతుంది. బాలికల విద్యా ప్రమాణాలు ఎక్కడైతే పెరుగుతాయో ఆయా సమాజాలలో మహిళల హోదా, గౌరవం మెరుగుపడుతుంది. అయితే మన దేశంలో గర్భస్థ శిశువు నుంచే బాలికలకు కష్టాలు ప్రారంభమౌతున్నాయి. ఆడపిల్ల అని తెలియగానే భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారు. పిండ దశలోనే వారిని చిదిమేస్తున్నారు. చదువుకోవాలన్నా, ఉద్యోగాలు చేయాలన్నా అడుగడుగునా అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. వరకట్నం పేరుతో గృహ హింసలకు గురిచేస్తూ, హత్యలు సైతం చేస్తున్నారు. పురాణ, ఇతిహాసాలు, వేదాల నుండే 'న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి' అని సామాజిక కట్టుబాట్లు పెట్టి స్త్రీని వంటింటికి, పడకింటికే పరిమితం చేశారు. వారి ఎదుగుదలకి అడుగడుగునా ఆటంకాలుగా నిలిచారు. భారతీయ సమాజంలో వేళ్లూనికొని వున్న పురుషస్వామ్య సంస్కృతి మహిళల అణచివేతకు కారణం అవుతోంది. వీటన్నింటికి విద్య లేకపోవడం కీలక కారణం. బాలికలకు విద్య, వైద్య, పోషకాహారం, న్యాయం, సంరక్షణ వంటి కనీస హక్కులు అందడం లేదు. కనీసం వాటి గురించి అవగాహనే వుండడం లేదు. బాల్య వివాహాలు, బాలికలపై అమానుషంగా లైంగిక దాడులు దేశ ప్రతిష్టను దెబ్బతీస్తున్నాయి. దేశంలో ఇప్పటికీ పేద కుటుంబాల్లో సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనంతో తల్లిదండ్రుల వలసలు జరుగుతున్నాయి. దీంతో ఇంటిపని కారణంగా బాలికలు బడి మానేస్తున్నారు. ఇప్పటికీ ఆడపిల్ల చదువులకు పెట్టుబడి పెట్టడం అనవసరమైన ఖర్చు అనే వివక్షాపూరిత ధోరణి ఉంటోంది. ఈ ధోరణే వారి చదువుకు, ఎదుగుదలకు ఆటంకంగా మారింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఆడపిల్ల చదువు అంతంతమాత్రంగానే ఉంది. ప్రాథమిక పాఠశాలల్లో బాలికల హాజరు శాతం బాలురతో సమానంగా ఉన్నప్పటికీ ఉన్నత విద్య చేరే నాటికి 10 నుంచి 30 శాతం మంది మాత్రమే మిగులుతున్నారు. దీనికి కారణం కుటుంబ అవసరాల కోసం, ఆర్థిక అవసరాల కోసం వారిని చదువులకు దూరం చేయడమే!



నేడు జాతీయ బాలికా దినోత్సవం

చిన్నతనంలోనే పెళ్ళిళ్ల చేయడం, తల్లిదండ్రులు తమ సంతానంలో ఆడ, మగ వివక్ష పాటించడం, బాల కార్మికులుగా మార్చడం, చదువుపై ఆసక్తి ఉన్నా పేదరికం వల్ల ఉన్నత విద్య పొందలేకపోవడం, పాఠశాలల్లో సరైన మల, మూత్రశాల వసతులు లేకపోవడం, సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడం. విద్యాసంస్థలలో చదువు కొనసాగిస్తున్న వారికి భద్రత కరువు. ఆడపిల్లలపై అఘాయిత్యాలు, పైశాచిక దాడులు పెరిగిపోవడం వంటివన్నీ వారిని చదువులకు దూరం చేస్తున్నాయి.

'ఆడపిల్లలకు రక్షణ కల్పించాలి. ఆత్మవిశ్వాసంతో పెరిగేలా చూడాలి. లింగ వివక్ష లేని సమాజం తీసుకురావాలి' వంటి లక్ష్యాలతో 2008లో భారత ప్రభుత్వం జాతీయ బాలికా దినోత్సవాన్ని ప్రారంభించింది. ఈ సందర్భంగా బాలికల విద్య, ఆరోగ్యం, పోషకాహారం, బాల్య వివాహాల నియంత్రణ, అక్రమ రవాణా, మొదలైన అంశాలపై అవగాహన కల్పించాలని నిర్ణయించింది. అయితే బాలికలకంటూ ఒకరోజు జరపడం కాదు, వారి నిజమైన అభివృద్ధి జరిగేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. అందుకుగాను బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలి. ఆడపిల్లలకు అన్ని రంగాలలో సమాన అవకాశాలు కల్పించాలి. స్త్రీల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ప్రాధాన్యత ఇచ్చి వారి భద్రతకు భరోసా ఇవ్వాలి. సమాజంలో బాలికలు ఎదుర్కొనే సమస్యల గురించి ప్రజల్లో అవగాహన పెంచాలి. లింగ వివక్ష, విద్యలో అసమానత, పోషకాహార లోపం, అనారోగ్య సమస్యలు, బాల్య వివాహాల నివారణ, అక్రమ రవాణా మొదలైన అంశాల మీద అవగాహనా కార్యక్రమాలు ఏర్పరచాలి. సమాజంలో మహిళల పట్ల గౌరవం, హోదా పెంచేలా కార్యక్రమాలు చేపట్టాలి. వారి సాధారణ జీవితంలో ఎదుర్కొనే రకరకాలైన వివక్షలను, దోపిడీని తొలగించాలి. శాస్త్ర, సాంకేతిక, పారిశ్రామిక, రాజకీయ, క్రీడారంగాల్లో కీలకపాత్ర పోషించేలా స్త్రీలకు మరిన్ని అవకాశాలు కల్గించాలి. ఆర్థిక స్వేచ్ఛ, ఉపాధి కల్పన కోసం బాలికల నైపుణ్యాలను మెరుగుపరచాలి.

పంక్చరైన బతుకులు



బాల్యంలో ప్రతి ఒక్కరికీ సైకిల్‌తో ఎన్నో అనుభూతులు పెనవేసుకుని ఉంటాయి. అది ఇంట్లో ఉందంటే ఒకప్పుడు గొప్పగా భావించేవారు. చిన్నప్పుడు దీనిని నేర్చుకోవడం, తొక్కడం అంటే ఏనుగు ఎక్కినంత సంబరం. ఆదివారం వస్తే చాలు చక్రాల మధ్యన రంగురంగుల ప్లాస్టిక్ పూలు, సీటుకు మెత్తని స్పాంజి కవరు, హ్యాండిల్ బార్‌కు రబ్బరు నగిషీలూ, ట్రింగ్ ట్రింగ్‌మని మోగే బెల్లు, మధ్యన రాడ్డుకు ప్లాస్టిక్ కవరుతో అలంకరించడమంటే పిల్లలకెంతో సరదా. ఇక సైకిలు రిపేరు షాపు ఓనరంటే పెద్ద కంపెనీకి యజమానిలా ఫీలయ్యేవాడు. ఆ రోజుల్లో సైకిల్ రిపేర్ షాపు అంటే అంత గొప్ప మరీ. ఆధునిక యుగంలో పెరిగిన శాస్త్ర పరిజ్ఞానంతో సైకిల్‌కు భిన్నంగా ద్విచక్ర వాహనాలు రావడంతో సైకిల్ రిపేరింగ్‌పై ఆధారపడిన జీవితాలూ నెమ్మదిగా చతికిల పడ్డాయి. అలా ఆదరణ కోల్పోయిన ఓ సూరిబాబు బతుకు కథ ఇది!





ఒకప్పుడు సైకిలు పేదోడి వాహనం. వేగంగా ఎక్కడికి వెళ్లాలన్నా సైకిల్‌నే వాడేవారు. పిల్లలు బడికి, కూలీలు ముఠాపనికి, రైతులు పొలానికి ఆరేడు కిలోమీటర్లైనా అవలీలగా తొక్కుకుంటూ వెళ్లేవారు. అంతేకాదు అప్పట్లో పెళ్లిలో అల్లుడికి సైకిల్‌ని బహుమతిగా ఇచ్చేవారంటే ఎంతో గొప్పగా చెప్పుకునేవారు. అంత ప్రాధాన్యత ఉండేది ఈ విశిష్ట వాహనానికి. ఇక వాటిని రిపేరు చేసేవాళ్లకైతే ఎంతో విలువుండేది. రాను రాను ఇదో ఫిట్‌నెస్ పరికరంగా మారిపోయింది. ఆ సైకిల్స్‌ను కూడా ఎలక్ట్రికల్‌వే కొంటున్నారు. దాంతో ప్రస్తుతం సైకిల్ రిపేరు చేసేవారి పరిస్థితి ఎంత దయనీయంగా తయారైందో కండ్రికలో నివసిస్తూ, విజయవాడలోని అరండల్ పేటలో షాపును నడిపే సూరిబాబు జీవితమే అద్దం పడుతుంది.

అప్పటికీ ఇప్పటికీ ఎంత తేడానో..

సూరిబాబుకు ప్రస్తుతం 55 సంవత్సరాలు ఉంటాయి. ఆయన చిన్నప్పుడు సైకిలున్న వ్యక్తి అంటే మహా గొప్పట! 30 ఏళ్ల కిందట వరకూ సైకిళ్లకు విపరీతమైన క్రేజ్ ఉండేది. అప్పట్లో ప్రతి వీధిలో ఐదారు సైకిల్ రిపేరు షాపులుండేవి. ప్రతి షాపులో



చిన్నపిల్లల సైకిళ్లు కనీసం 10 నుంచి 20 దాకా ఉండేవి. వాటిని గంటల లెక్కన అద్దెకు ఇచ్చేవారు. అమ్మ స్కూల్లో తినుబండరాలు తినమని ఇచ్చిన డబ్బులను వారం రోజులు కూడబెట్టుకుని మరీ సైకిల్ అద్దెకు తీసుకుని తొక్కేవారు. యజమానికైతే వ్యాపారం మూడుపువ్వులూ ఆరుకాయల్లా కళకళలాడుతూ ఉండేది. అలాంటి అవకాశం ఉన్నందువల్లే పిల్లలందరికీ సైకిల్ తొక్కడం వచ్చేది. కానీ ఈ తరం చాలామంది దిగువ మధ్యతరగతి పిల్లలకు సైకిల్ తొక్కడమే రాదు. దానికి కారణం లేకపోలేదు. ప్రస్తుతం సైకిల్‌ను అద్దెకు ఇచ్చే షాపులు కనుమరుగయ్యాయి. కొనాలంటే ఒక్కో సైకిల్ సుమారు ఐదు వేల రూపాయల పైమాటే. అంత డబ్బుపెట్టి పిల్లలకు కొనిచ్చే స్థోమత తల్లిదండ్రులకు లేదు. దానికితోడు స్కూళ్ళు దూరంగా ఉండటంతోపాటు, ట్రాఫిక్‌లో ఒంటరిగా పిల్లలను పంపే సాహసం తల్లిదండ్రులు చేయలేకపోతున్నారు. అప్పట్లో సైకిల్ రిపేరు షాపులకు రిమ్‌ల బెండింగ్, సైకిల్ త్రూ, సైకిలు పెయింటింగ్‌తో పాటు మరికొన్ని మరమ్మతుల కోసం వచ్చేవారు. ప్రస్తుతం కార్మికులు కూడా దాదాపు ద్విచక్ర వాహనాలనే ఉపయోగిస్తున్నారు. లగేజీలకు ఉపయోగించే రిక్షాలు ఎక్కడోగానీ కనబడటం లేదు. ఇక సైకిళ్ల విషయానికి వస్తే 9,10వ తరగతి పిల్లలు మాత్రమే ఉపయోగిస్తున్నారు. ఎందుకంటే చిన్నవయస్సు పిల్లలు ద్విచక్ర వాహనాలు వాడటానికి వీలు లేదు కాబట్టే. ప్రస్తుతం ఆ పిల్లలే మా జీవనాధారం అంటున్నాడు సూరిబాబు. వాళ్లు కూడా పంక్చర్, ట్యూబ్‌లలో గాలి కొట్టించుకోవడానికి మాత్రమే ఆయనను ఆశ్రయిస్తారట! ప్రస్తుతం ఆ ప్రాంతం మొత్తానికిగాను అతని షాపు ఒక్కటే ఉంది. అందుకే సూరిబాబు కోసం పిల్లలు వెతుక్కుంటూ వస్తారట! అలా వచ్చినా కూడా రోజుకు నాలుగైదు పంక్చర్లు వచ్చేసరికి ఎక్కువంటాడాయన. రెండు టైర్లకు పంక్చర్ వేస్తే రూ.20 నుంచి 30, ట్యూబ్‌లకు గాలి కొడితే రూ.5 తీసుకుంటాడు. రోజుకు వంద నుంచి నూటాయాభై లోపే ఆదాయం ఉంటుంది.

అప్పట్లో షాపే ఆదుకుంది

'మాది నిరుపేద కుటుంబం. నాన్న చిన్నప్పుడే చనిపోయాడు. నేను ఐదవ తరగతికి వచ్చేటప్పటికి అమ్మకు కుటుంబ పోషణ భారమైంది. ఆ సమయంలో నేను, అన్నలు అమ్మకు సాయంగా పనికి వెళ్లాలని నిర్ణయించుకున్నాం. కానీ అంత చిన్న వయస్సులో మాకు పని ఎవరిస్తారు? అందుకే మా ఇంటికి దగ్గరలోని సైకిల్ షాపులో పనికి కుదిరా. ఆ షాపు యజమాని నెలకు రూ.15 ఇచ్చేవాడు. అలా ఆయన దగ్గర ఐదేళ్లు పనిచేశా. తర్వాత అరండల్ పేటలో సొంతంగా నేనే సైకిల్ రిపేరుషాపు పెట్టుకున్నా. అందులో వచ్చే ఆదాయంతోనే అప్పట్లో చిన్న ఇల్లు కొనుక్కున్నా. అప్పటి నుంచి ఇక్కడే షాపును నడుపుతూ వస్తున్నా. మా కుటుంబం పీకల్లోతు కష్టాల్లో ఉన్నప్పుడు ఈ షాపే మమ్మల్ని ఆదుకుంది. తర్వాత నాకు పెళ్ళైంది. మా పెద్దోడిని డిగ్రీ, చిన్నోడిని ఇంటర్ వరకూ ఎలాంటి ఇబ్బందీ లేకుండా చదివించగలిగా. రానురాను సైకిళ్లు కొనేవారే లేకపోవడంతో నా వ్యాపారమూ అంతంత మాత్రమే అయ్యింది. మళ్లీ మా కుటుంబం మునుపటి స్థితికి వచ్చింది. పదేళ్ల క్రితం అమ్మకు కిడ్నీలో సమస్య వచ్చింది. ఆమెకు ఆపరేషన్ చేయాలన్నారు డాక్టర్లు. అంత డబ్బు నా దగ్గర లేదు. మందులు కొనిచ్చే స్థోమతా లేదు.

నా భార్య రాత్రింబగళ్లూ మిషన్ కుట్టి సంపాదించిన డబ్బంతా అమ్మ మందులకే వాడేవాళ్లం. కానీ అమ్మను ఎక్కువకాలం కాపాడుకోలేకపోయాం. ప్రస్తుతం నా భార్య అనారోగ్య సమస్యలతో సతమతమౌతోంది. పేగులో రాళ్లు ఉన్నాయని, వెన్నుపూస అరిగిందని డాక్టర్లు చెప్పారు. ఆపరేషన్ చేయించడానికి నా దగ్గర చిల్లిగవ్వ లేదు. ఆరోగ్యశ్రీ చెల్లదన్నారు. అందుకే సిఎం రిలీఫ్ ఫండ్‌కు అప్లై చేశాం. అదైనా వస్తుందో రాదో తెలియదు. ప్రస్తుతం ఆమె ఒక గాజుబొమ్మ. పిల్లలకొచ్చే ఆదాయంతో వాళ్ల జీవనమే కనాకష్టంగా ఉంది. అందుకే మా వైద్య ఖర్చుల వల్ల వాళ్లు అప్పుల్లో కూరుకుపోవడం మాకిష్టం లేదు. ఈ పరిస్థితుల్లో నాకు వచ్చే ఈ అరకొర సంపాదనతోనే ఆమెను బతికించుకొనే ప్రయత్నం చేస్తున్నా' అంటూ కన్నీళ్ల పర్యంతమయ్యాడు సూరిబాబు.

బ్యాంకు రుణాలివ్వాలి



మమ్మల్ని కార్మికులుగా గుర్తించాలి. ప్రభుత్వం మాకు చిరువ్యాపారుల కిందనైనా బ్యాంకు రుణాలు అందించాలని కోరుకుంటున్నాం.

- సూరిబాబు
సైకిలు రిపేరు షాపు యజమాని

వస్తువులు దొరకడం లేదు

సైకిల్‌కు అవసరమయ్యే ట్యూబ్‌లు, టైర్లు, రిమ్ములు మాత్రమే షాపుల్లో దొరుకుతున్నాయి. లైట్లు, క్యారేజ్ స్ప్రింగ్‌లు, క్లెచ్‌లులాంటి చిన్న వస్తువులు అసలు దొరకడం లేదు. అవి దొరికితే నిమిషాల్లో అయ్యేపని ప్రస్తుతం చాలా సమయం తీసుకోవడంతోపాటు వంద రూపాయల వరకూ ఖర్చువుతుంది. అంటే వీల్‌ను మార్చాల్సి వస్తోంది. సైకిల్ వాడకపోవడానికి ఇదీ ఒక కారణం. ఇలా ఇబ్బందులు పడాల్సి వస్తుందనే తన తోటి రిపేరు షాపు యజమానులు రంగులు వేయడం, ఆటో నడిపే పనిని నేర్చుకుని వెళ్లారంటున్నాడు సూరిబాబు. తను మాత్రం ఈ వృత్తిని వదిలేయడం ఇష్టంలేక ఉండిపోయానంటున్నాడు. నా మనవళ్లు, మనవరాళ్ల కోసం రెండు సైకిళ్లను సిద్ధం చేసి ఇస్తానంటూ మెరిసే కళ్లతో చెప్పాడు సూరిబాబు.





సంపూర్ణ ఆరోగ్యానికి సైకిల్ సవారీ తోడ్పడుతుంది. అంతేకాదు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుంది. మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికే కాకుండా, ప్రకృతిని కాపాడినవాళ్లమూ అవుతాం. ఈ క్రమంలో ఇలా సైకిల్ రిపేరింగ్‌పై ఆధారపడి జీవిస్తున్న వీరి బతుకుల్లో వెలుగులు నింపుదాం.

- స్వర్ణలత నూకరాజు

తొక్కలూ తినేయండి

ఫలాలు, దుంపలు, కూరగాయల్లో తొక్కను తీసేసి తినటం అలవాటయ్యింది నేడు. దీనికి కారణం పరిశుభ్రత ఒకటైతే, రసాయన ఎరువుల వాడకంతో పండిస్తున్న పంటలూ మరో కారణం. అయితే ఈ ఆహారపదార్థాలను వండే ముందు ఉప్పుతో కడిగితే రసాయనాల అవశేషాలను తొలగించవచ్చు. కానీ పైనున్న తొక్కను తొలగించి తినడం వల్ల ఆరోగ్యానికి అందవలసిన కొన్ని ప్రయోజనాలను దూరం చేసుకున్నట్లే. నిజానికి తొక్కల్లో చాలా పోషక పదార్థాలు ఉంటాయి. వాటిని వివిధ రూపాల్లో ఆహారంలో భాగంగా చేసుకోవచ్చు.

- నోటికి ఏ రుచీ సహించనప్పుడు నిమ్మకాయ, చింతకాయ పచ్చళ్లు తినాలనిపిస్తుంది. రుచికంటే వీటికుండే వాసనే దానికి సగం కారణం. నిమ్మ, నారింజ చెక్కులో ఉండే మోనోటెర్‌పాన్స్ నూనెలు ప్రత్యేక వాసనలని వెదజల్లుతాయి. వీటికి చర్మ, కాలేయ, గర్భాశయ, ఊపిరితిత్తుల క్యాన్సర్లని నివారించే శక్తి ఉంది. పచ్చళ్ల రూపంలో ఇప్పటికే వీటిని తింటున్నాం. పచ్చళ్లు వద్దనుకునే వాళ్లు నిమ్మతొక్కలతో చేసిన టీని స్వీకరించవచ్చు. కేకులు, సలాడ్లలో లెమన్ పీల్ పొడిని చల్లుకున్నా రుచిగానే ఉంటుంది. పదార్థాలను ఉడికించేటప్పుడు, మఫిన్స్, బిస్కట్లలో కూడా ఈ పౌడర్‌ని వాడుతుంటారు.
- పుచ్చకాయ ముక్కలు అంటే ఎర్రని గుజ్జే అనుకుంటాం. కానీ అడుగున ఉండే తెల్లని పదార్థంలో పోషకాలు పుష్కలం. దాన్లో సిట్రులిన్ అనే పోషక



పదార్థం ఉంటుంది. వ్యాధి నిరోధక శక్తిని పెంచే అమినోయాసిడ్లు, విటమిన్-సి, విటమిన్-ఎ, థయామిన్, రైబోఫ్లేవిన్... రక్తహీనత రాకుండా చూసే ఇనుము, మెగ్నీషియమ్, ఎముకల బలానికి తోడ్పడే క్యాల్షియం ఉంటాయి. పోషకాలు అపారం కాబట్టి జ్యూస్ తయారు చేసేప్పుడు కాస్త లోతుగా కట్ చేయడం వల్ల తెలుపు రంగు పదార్థాన్నీ మిక్సీలో వేయొచ్చు.

- ఎర్రెర్రని దానిమ్మ గింజల్లో కంటే దాని పొట్టులో రెండు రెట్లు ఎక్కువగా శక్తివంతమైన పోషకాలుంటాయి. కానీ దానిని తినడం మనవల్ల అయ్యే పనికాదుగా. అందుకే దానిని ఎండబెట్టి పొడి చేసుకొని టీ చేసుకోవచ్చు.
- తీపి గుమ్మడి పులుసు పెట్టినప్పుడు చెక్కు తీయడం ఎందుకు? దానిలో ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా చేసే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు అధికం.
- బంగాళదుంపలపై ఉండే పొరలో విటమిన్-సి, బి6, పొటాషియమ్, మాంగనీస్ పోషకాలు ఉంటాయి. అందుకే ఆలూతో చేసే వంటల్లో సాధ్యమైనంత వరకూ పొట్టు తీయకుండా ఉంటే సరిపోతుంది. ★



మీకోసం

జుట్టు పొడిగా కనిపిస్తుంటే కలబంద గుజ్జు లేదా పెరుగును తలకు పట్టించి అరగంట తర్వాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేస్తే ఫలితం కనిపిస్తుంది.

జీవన సౌరభం

నీ కష్టాన్ని చూసి నవ్వినా వారిని పట్టించుకోవద్దు. నీవు మాత్రం ఇతరుల కష్టాన్ని చూసి నవ్వకు.

నోటి దుర్వాసనకు చెక్ పెట్టేద్దాం..!

నోటి నుంచి దుర్వాసనా, చిగుళ్ల సమస్యలున్నప్పుడు వైద్యులు మౌత్‌వాష్ వాడాలని సూచిస్తుంటారు. వాటిని ఇంట్లో ఉండే పదార్థాలతోనే తయారుచేస్తే బాగుంటుంది కదూ! అయితే అదెలాగో చూసేద్దాం.

ఉప్పుతో : ఉప్పు నీళ్లు నోటిని ఆరోగ్యంగా ఉంచే సహజసిద్ధ మౌత్‌వాష్. కప్పు గోరువెచ్చని నీళ్లలో పెద్ద చెంచా ఉప్పు కలపాలి. రోజుకు మూడుసార్లు ఈ నోటితో పుక్కిలిస్తే చిగుళ్లకు సంబంధించిన సమస్యలు రాకుండా ఉంటాయి. ముఖ్యంగా భోజనం చేసిన తరువాత ఇలా చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.



వెనిగర్‌తో : కప్పు ఉప్పునీళ్లలో రెండు చెంచాల వెనిగర్ కలపాలి. ఈ నీటిని ఓ సీసాలోకి తీసుకోవాలి. దీన్ని ఫ్రిజ్‌లో ఉంచుకుంటే వారం పాటు నిల్వ ఉంటుంది. చిన్న మూతలో ఈ నీటిని తీసుకుని, అవసరమైనప్పుడు పుక్కిలించి ఉమ్మేస్తే సరిపోతుంది. కుదిరితే యాపిల్‌సిడార్ వెనిగర్ వాడితే మంచిది.

దాల్చిన చెక్కతో : కప్పు చల్లటి నీళ్లలో పది చుక్కల లవంగనూనె, లేదంటే చెంచా దాల్చినచెక్క పొడి కలపాలి. ఇది మిగతా వాటితో పోలిస్తే ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. లవంగం, దాల్చినచెక్కలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు నోటిలో ఉండే బ్యాక్టీరియాను చంపి, నోటి దుర్వాసన తగ్గిస్తాయి.

పుదీనాతో : కప్పు నీళ్లలో రెండు చెంచాల వంటసోడా, గుప్పెడు పుదీనా ఆకులు వేయాలి. అందుబాటులో ఉంటే రెండు చుక్కల టీట్రీనూనె కలుపుకుంటే మంచిది. ఈ మిశ్రమాన్ని ఓ సీసాలో భద్రపరుచుకుంటే సరిపోతుంది. దీన్ని వాడాలనుకున్నప్పుడు సీసాను ఒకటికి రెండుసార్లు కుదుపడం తప్పనిసరి. లేదంటే వంటసోడా అడుగునే ఉండిపోతుంది. ★

పక్షులను కాపాడే పనిలో ప్రాణం వదిలింది!

పక్షులంటే ఆమెకు ప్రాణం. వాటిని కాపాడే పనిలోనే ఆమె ప్రాణం వదలడం ఎంతో విషాదకరం. కొన్ని రోజుల కిందట జరిగిన ఈ ఘటన పూర్వపరాలు తెలుసుకోవాలంటే అలా గుజరాత్ వెళ్లాలి.

తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతిని ఎంత ఘనంగా జరుపుకుంటారో.. గుజరాత్‌లో ఉత్తరాయణ్ పండగను అలా చేసుకుంటారు. ఈ పండక్కి పెద్దఎత్తున పతంగులు (గాలిపటాలు) ఎగరేస్తుంటారు. అయితే, ఆ పతంగులకు కట్టే మాంజా (దారం) చుట్టుకుని ఏటా వేలాది పక్షులతో పాటు, కొంతమంది మనుషులూ ప్రాణాలు కోల్పోతున్నారు. అందుకే, ఎక్కువమంది పండగ సంబరాలు చేసుకుంటుంటే, కొందరు మాత్రం పక్షులను కాపాడే పనిలో ఉంటారు. అలాంటి వారిలో అహ్మదాబాద్‌కు చెందిన యువతి రాహిలా ఒకరు. అనేక పక్షులను రక్షించిన ఆ అమ్మాయి, అదే మాంజా ఆమె మెడకు చుట్టుకోవడంతో చనిపోయింది. ఈ ఘటన ఎంతోమంది హృదయాలను కదిలించింది. ఉత్తరాయణ్ పండగ సందర్భంగా ఈ నెల14న పక్షులను కాపాడేందుకు గుజరాత్ అటవీశాఖ గాంధీనగర్‌లో ఓ కార్యక్రమం చేపట్టింది. అందులో రాహిలా పాల్గొన్నారు. కాళ్లకు, రెక్కలకు మాంజా చుట్టుకుని కింద పడిపోయిన అనేక పావురాలను, పిచ్చుకలను కాపాడారు. అనంతరం అక్కడి నుంచి ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో ఒక్కసారిగా ఓ పదునైన మాంజా వచ్చి ఆమె మెడకు చుట్టుకుంది. దాంతో ఆమె మెడ ఒక్కసారిగా కోసుకుపోయింది. హుటాహుటిన స్థానికులు సమీపంలోని ఆస్పత్రికి తరలించినా.. ఫలితం దక్కలేదు. పక్షులంటే రాహిలాకు ఎంతో ప్రేమ ఉండేదని, పతంగుల కారణంగా మూగజీవాల ప్రాణాలు కోల్పోతుండటం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తుండేదని ఆమె కుటుంబసభ్యులు, స్నేహితులు మీడియాకు చెప్పారు.



ఏటా ఉత్తరాయణ్ సందర్భంగా రెండురోజుల పాటు ఎగరేసే పతంగులకు కొందరు అత్యంత ప్రమాదకరమైన గాజు లేదా లోహంతో తయారుచేసిన మాంజా వాడుతున్నారు. అది సాధారణ దారం కంటే ఎంతో గట్టిగా ఉంటుంది. ప్రత్యర్థుల పతంగుల దారాన్ని కత్తిరించేందుకు అలాంటి పదునైన మాంజా వాడుతుంటారు. ఆ మాంజా వల్లే పక్షులతో పాటు, మనుషులూ చనిపోతున్నారు.

పక్షులను కాపాడేందుకు ఏటా జనవరిలో గుజరాత్ రాష్ట్ర అటవీ శాఖతో పాటు, పలు స్వచ్ఛంద సంస్థలు కూడా పనిచేస్తున్నాయి.



పావురాలు, పిచ్చుకలు, కాకులతో పాటు శీతాకాలంలో ఇతర దేశాల నుంచి వలస వచ్చే ఎన్నో అరుదైన పక్షులూ మాంజా బారిన పడుతున్నాయని జీవ్ దయ చారిటీ ట్రస్ట్ నిర్వాహకులు షెర్విన్ చెబుతున్నారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం, ఈసారి పతంగుల కారణంగా గుజరాత్‌లో ముగ్గురు మరణించారు.

- హరిత కంద్‌పాల్
(బిబిసి సౌజన్యంతో)

సెన్సెక్స్ ⬇ 336
36,108

నిఫ్టీ ⬇ 91
10,831

రూపాయి ⬆ 12 పై
అమెరికా డాలరుకు రూ. 71.32

హెచ్‌డిఎఫ్‌సి విస్తరణ..

గృహ రుణాల ఫైనాన్స్ కంపెనీ హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్ కడపలో ఏర్పాటు చేసిన నూతన కార్యాలయాన్ని ఆ సంస్థ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల రీజినల్ బిజినెస్ హెడ్ రాజన్ టండన్ ప్రారంభించారు. ఇది కడప, రాజంపేట, జమ్మలమడుగు, బద్వేల్, ప్రొద్దుటూరు తదితర పరిసర ప్రాంతాలకు అందుబాటులో ఉంటుందని రాజన్ తెలిపారు. దీంతో ఎపిలో తమ ఆఫీసులు 13కు చేరాయని పేర్కొన్నారు.



రెండు రోజుల్లో లక్ష కోట్లు ఫట్

ఐటిసి సూచీ 4.16% పతనం

ముంబయి : క్రితం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఐటిసి లిమిటెడ్ ఫలితాలు మదుపర్లను నిరుత్సాహపర్చాయి. దీంతో అమ్మకాల ఒత్తిడితో బుధవారం సెన్సెక్స్, నిఫ్టీలు భారీగా నష్టపోయాయి. అదే విధంగా అంతర్జాతీయంగా చైనాపై అమెరికా కుట్రపూరితంగా చేస్తున్న వాణిజ్య కట్టడి అంశాలు.. ప్రపంచ వృద్ధి రేటుపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయనే విశ్లేషణలు అంతర్జాతీయ మార్కెట్లను ఒత్తిగికి గురి చేశాయి. ఈ నేపథ్యంలో బిఎస్ఇ సెన్సెక్స్ 336 పాయింట్లు లేదా 0.92 శాతం పతనమై 36,108కి దిగజారింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 91 పాయింట్లు లేదా 0.84 శాతం కోల్పోయి 10,832 వద్ద ముగిసింది. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.28 శాతం, 0.16 శాతం చొప్పున నష్టపోయాయి. వరుసగా రెండు రోజుల నష్టాల వల్ల బిఎస్ఇలో మదుపరి విలువ రూ.1.10 లక్షలు హరించుకుపోయింది. సోమవారం బిఎస్ఇలో లిస్టెడ్ కంపెనీల విలువ రూ.1,43,15,583.11 కోట్లుగా ఉండగా.. బుధవారం ముగింపు సమయంలో ఇది 1,42,04,842.87 కోట్లకు దిగజారింది. బుధవారం ఒక్క రోజే మదుపర్లు రూ.74,199 కోట్లు నష్టపోయారు. ప్రముఖ ఎఫ్ఎంసిజి కంపెనీ ఐటిసి లిమిటెడ్ 4.16 శాతం క్షీణించి 277.70 వద్ద ముగిసింది. దీంతో మార్కెట్లపై మరింత ఒత్తిడి చోటు చేసుకుంది.

ప్రిజమ్ క్రాప్ సైన్సెస్‌కు బ్రాండ్స్ అండ్ లీడర్స్ అవార్డు

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో



అవార్డుతో ప్రిజమ్ క్రాప్ సైన్సెస్ ఎండి యుగంధర్ రావు. ఆ సంస్థ ప్రతినిధులు.

వ్యవసాయ ఉత్పత్తుల సరఫరా, తయారీ రంగంలో ఉన్న ప్రిసమ్ క్రాప్ సైన్సెస్ ప్రయివేటు లిమిటెడ్‌కు ప్రతిష్టాత్మక అవార్డు దక్కింది. సింగపూర్‌లో జరిగిన అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆసియాస్ గ్రేటెస్ట్ బ్రాండ్స్ అండ్ లీడర్స్ 2018 మూడవ ఎడిషన్ మాన్యుఫాక్చరింగ్-అగ్రి ఇన్‌పుట్స్ విభాగంలో ఆసియన్ గ్రేటెస్ట్ బ్రాండ్స్ అండ్ లీడర్స్ 2018 అవార్డును అందుకున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది. ప్రైస్ వాటర్ హౌస్ వాటర్ కూపర్స్ పలు బ్రాండ్లను అత్యంత జాగ్రత్తగా పరిశీలించిన మీదట ఈ అవార్డుకు తమను ఎంపిక చేశారని ప్రిజమ్ క్రాప్ సైన్సెస్ మేనేజింగ్ డైరెక్టర్ గుజ్జా యుగంధర్ రావు బుధవారం హైదరాబాద్‌లో మీడియాకు తెలిపారు. తాము ఆర్గానిక్ ఉత్పత్తులు, మొక్కలు వృద్ధి చెందేందుకు తోడ్పటే పోషకాలు, సముద్రపు పాచి సారం, ప్రోటీన్ హైడ్రోలిజేట్ మిక్చర్స్, రసాయన ఎరువుల ఫార్ములేషన్‌ను అందిస్తామన్నారు. చైనా, బ్రిటన్ కేంద్రంగా పని చేస్తున్న పలు కంపెనీలతో భాగస్వామ్యమై 100 శాతం ఆర్గానిక్ ఉత్పత్తులను, పెస్ట్‌మేనేజ్‌మెంట్ ఉత్పత్తులను తయారు చేస్తున్నామన్నారు. తాము తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్, చత్తీస్‌ఘడ్, ఒడిషా, పశ్చిమ బెంగాల్, బీహార్, ఉత్తర ప్రదేశ్‌లో విక్రయాలు కలిగి ఉన్నామన్నారు.

మళ్లీ స్తబ్ధతలోకి పారిశ్రామికోత్పత్తి

- 2019 డిమాండ్‌లో పతనం
- చమురు ధరల ఎఫెక్ట్
- పెరుగుతున్న వాణిజ్య లోటు
- డిఅండ్‌బి రిపోర్టు

న్యూఢిల్లీ : దేశంలో పారిశ్రామిక ఉత్పత్తి కార్యకలాపాలు మళ్లీ స్తబ్దతలోకి నెట్టబడుతున్నాయని ఓ రిపోర్టులో వెల్లడయ్యింది. అతి స్వల్ప కాలంలోనే దేశీయ డిమాండ్ స్తబ్దతలో పడనుందని విశ్లేషించింది. అంతర్జాతీయ బలహీన ఆర్థిక అంశాలు, 2019 లోకసభ సాధారణ ఎన్నికల నేపథ్యంలో వ్యాపారాల్లో అనిశ్చితి తదితర అంశాలు పారిశ్రామికోత్పత్తిపై ప్రతికూల ప్రభావం చూపనున్నాయని డిఅండ్‌బి విశ్లేషించింది. ఎంచుకున్న లక్ష్యానికి కంటే పన్ను వసూళ్లలో తగ్గుదల చోటుచేసుకోవడం ద్వారా ప్రభుత్వ పెట్టుబడులు పడిపోనున్నాయని, దీంతో పారిశ్రామిక ఉత్పత్తిపై ప్రభావం పడనుందని డూన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ (డిఅండ్‌బి) పేర్కొంది. 2018 డిసెంబర్‌లో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపి)



వృద్ధి 1.5-2 శాతానికి పడిపోనుందని అంచనా వేసింది. ఇంతక్రితం నవంబర్‌లో ఐఐపి 0.5 శాతానికి పరిమితమై 17 మాసాల కనిష్ట స్థాయికి పతనమైనట్లు గత వారం కేంద్ర గణంకాల శాఖ ఒక రిపోర్టులో వెల్లడించిన విషయం తెలిసిందే. ముఖ్యంగా తయారీ రంగంలోని కన్సూమర్, కాపిటల్ గూడ్స్ రంగాలు డిమాండ్ లేక తీవ్ర ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. 2017 నవంబర్‌లో ఐఐపి ఏకంగా 8.5శాతం వృద్ధిని కనబర్చింది.

అనుకోని సంఘటనలు, అనానుకూల అంశాల వల్ల 2018-19లో ఆర్థిక వృద్ధి పడిపోనుందని డిఅండ్‌బి లీడ్ ఎకనామిస్టు అరుణ్ సింగ్ విశ్లేషించారు. త్వరలో ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్ ఆర్థిక వ్యవస్థకు కీలకం కానుందని పేర్కొన్నారు. ఎన్నికల ఏడాది కావడంతో జనరంజమైన బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉందన్నారు. గ్రామీణ, ఎంఎస్ఎంఇ రంగాలు, ఉపాధి కల్పనపై దృష్టి సారించే అవకాశం ఉందన్నారు. కార్మికులు, భూ చట్టాలకు ప్రోత్సాహం ఇవ్వడం ద్వారా వ్యవస్థకు మద్దతు లభించే అవకాశం ఉందన్నారు. అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ పడిపోవడం, చమురు ధరలు పెరగడం వల్ల వాణిజ్య లోటు పెరుగుతుందని డిఅండ్‌బి ఆందోళన వ్యక్తం చేసింది. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో స్వల్ప కాలంలో దేశీయ కరెన్సీ ఒత్తిడికి గురి కావచ్చని పేర్కొంది. అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగిస్తే.. రూపాయికి మద్దతు లభించవచ్చని తెలిపింది. ప్రస్తుత ఏడాది జనవరిలో అమెరికా డాలర్‌తో రూపాయి విలువ 70.6-70.8 మధ్య కొనసాగే అవకాశం ఉందని అంచనా వేసింది.

ఇండిగో క్యూ3 లాభాల్లో 75% పతనం

న్యూఢిల్లీ : ఇండిగో మాతృసంస్థ ఇంటర్ గ్లోబ్ ఏవియేషన్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికం ఆర్థిక ఫలితాలను బుధవారం ప్రకటించింది. 2018-19 అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 75 శాతం పతనంతో రూ.190.9 కోట్ల లాభాలు నమోదు చేసింది. 2017-18 ఇదే క్యూ3లో రూ.762 కోట్ల లాభాలు సాధించింది. క్రితం క్యూ3లో సంస్థ మొత్తం ఆదాయం 28 శాతం పెరిగి రూ.8,229.4 కోట్లకు చేరింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.6,409 కోట్ల ఆదాయం నమోదయ్యింది. అధిక ఇంధన ధరలు, డాలర్‌తో రూపాయి మారకం విలువ పడిపోవడం కంపెనీ లాభదాయకతను దెబ్బతీసిందని ఇండిగో సహ వ్యవస్థాపకులు, మధ్యంతర సిఇఒ రాహుల్ బాటియా పేర్కొన్నారు. బుధవారం బిఎస్ఇలో ఇండిగో షేర్ 0.89శాతం తగ్గి 1,107.95 వద్ద ముగిసింది.

టాటా నుంచి ఎస్‌యువి హారియర్

ముంబయి : టాటామోటార్స్ మార్కెట్లోకి ఎస్‌యువి సెగ్మెంట్‌లో కొత్త 'హారియర్'ను విడుదల చేసింది. సంస్థ ప్రతిష్ఠాత్మకమైన ల్యాండ్‌రోవర్ ఓమెగా ఆర్క్ ప్లాట్‌ఫామ్‌పై నిర్మించిన ఈ కారును టాటా మోటార్స్ ఎండి గుంటెర్ బుట్చేక్, టాటా మోటార్స్ ప్రెసిడెంట్ మయాంక్ ఫరేక్‌లు బుధవారం దీనిని ఆవిష్కరించారు. 2018-19 ఆర్థిక సంవత్స రంలో కంపెనీ మార్కెట్లోకి విడుదల చేసిన నాలుగో కారు హారియర్ కావడం విశేషం. నాలుగు సిలెండర్ల 2.0లీటర్ టర్బోఛార్జ్‌డ్ డీజిల్ ఇంజిన్‌తో దీన్ని అందుబాటులోకి తెచ్చింది.. ఈ ఇంజిన్ 350 ఎన్ఎం టార్క్‌ను 138 బిహెచ్‌పి శక్తిని విడుదల చేస్తుంది. దీనిలో 6స్పీడ్ మ్యాన్యు వల్ గేర్‌బాక్స్‌ను అమర్చింది. ఇందులో మొత్తం ఎకో, సిటీ, స్పోర్ట్స్ అనే డ్రైవింగ్ మోడ్‌లను అమర్చింది. ఇది ఎక్స్ఇ, ఎక్స్ఎం, ఎక్స్‌టి, ఎక్స్‌జెడ్ నాలుగు వేరి యంట్లలో లభిస్తుంది. ముంబయి ఎక్స్ షోరూం వద్ద వారియర్ ధరను రూ.12.69 లక్షల నుంచి రూ.16.25లక్షలుగా నిర్ణయించింది.



హారియర్‌ను మార్కెట్లోకి విడుదల చేస్తున్న టాటా మోటార్స్ ఎండి గుంటెర్ బుట్చేక్, ప్రెసిడెంట్ మయాంక్ ఫరేక్.

మారుతి నుంచి కొత్త వేగనార్

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీదారు మారుతి సుజుకి బుధవారం దేశ మార్కెట్లోకి మూడో జనరేషన్ వేగనార్‌ను విడుదల చేసింది. 2019 ఎడిషన్‌తో ముందుకు వచ్చిన ఈ వాహన ధరను ఢిల్లీ ఎక్స్‌షోరూం వద్ద రూ.4.19-5.19 లక్షలుగా నిర్ణయించింది. ఆరు రంగుల్లో ఈ కారు లభ్యమవుతుంది. ఇది వరకు 1.0 లీటర్ పెట్రోల్ ఇంజిన్‌తో విక్రయించగా.. ప్రస్తుతం 1.2 లీటర్ ఇంజిన్‌ను అమర్చారు. కొత్త వేగనార్ లీటర్‌కు 21.5 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని ఆ కంపెనీ పేర్కొంది. కొన్ని వేరియంట్లకు ఎజిఎస్ ఆటోమాటిక్ గేర్‌బాక్స్ కూడా ఉంటుంది.

అలాగే డ్రైవర్ వైపు ఎయిర్‌బ్యాగ్, ఎలక్ట్రానిక్ బ్రేక్‌ఫోర్స్ డిస్ట్రిబ్యూషన్(ఇబిడి)తోపాటు యాంటిలాక్ బార్కింగ్ సిస్టమ్, సీటు బెల్టు గుర్తుచేసే విధానం, వేగాన్ని హెచ్చరించే విధానం, ప్రత్యేకమైన పార్కింగ్ సెన్సార్లు కొత్త వేగనార్‌లో ఉన్నాయి. ఏడాది కాలంలో వేగనార్‌లో 22 లక్షల యూనిట్లను విక్రయించామని ఎంఎస్ఐఎల్ చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ (సిఇఒ), ఎండి కెనిచి అయుకవ పేర్కొన్నారు కొత్త వేగనార్‌ను ఆకర్షణీయ డిజైన్‌తో అందుబాటులోకి తెచ్చామన్నారు. కొత్త కారు కోసం తాము, తమ భాగస్వాములు కలిసి రూ.670 కోట్ల పెట్టుబడి పెట్టామన్నారు.



హైదరాబాద్‌లో నూతన వాగనార్‌ను కొనుగోలుదారుకు అందిస్తున్న వరుణ్ మోటార్స్ ఛైర్మన్ వి ప్రభూ కిశోర్, ఇడి ఆర్‌సి రాజు, ఎంఎస్ఐఎల్ రీజినల్ మేనేజర్ అనింద్య దత్త.

వర్తమానాంశాలు : అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ పోటీ పరీక్షల ప్రత్యేకం

పర్వతారోహకుడు సత్యరూప్ ఏ ఘనతను సాధించాడు?



ఎ.ఉమామహేశ్వరరావు
సబ్జెక్టు నిపుణులు, తెనాలి.
సెల్ : 9985288150

గాంధీ శాంతి బహుమతి విజేతలు

గాంధీ శాంతి బహుమతుల విజేతల పేర్లను 2015 నుంచి 2018 వరకూ కేంద్రం జనవరి 16న ప్రకటించింది. వివరాలు.. 2015 ఏడాది విజేతగా కన్యాకుమారికి చెందిన వివేకానంద కేంద్రను ఎంపిక చేశారు. పాకీ పని చేసే వారికి విముక్తి కల్పించినందుకు సులభ్ ఇంటర్నేషనల్‌కు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందిస్తున్నందుకు అక్షయపాత్ర ఫౌండేషన్‌కు కలిపి 2016 ఏడాదికి గాంధీ శాంతి అవార్డును ప్రకటించారు. 2017 ఏడాదికి ఏకై అభియాన్ ట్రస్టీను, 2018కి కుష్టు వ్యాధి నిర్మూలన కోసం డబ్ల్యూహెచ్‌వో సౌహార్ద్ర రాయబారిగా ఉన్న యోహీ ససకవాకు అవార్డులను ప్రకటించారు. ఈ బహుమతి కింద కోటి రూపాయలతో పాటు ప్రశంసాపత్రం ఇస్తారు. చివరిగా 2014లో ఈ పురస్కారాన్ని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు ప్రదానం చేశారు.



'గోల్డెన్ గ్లోబ్' అవార్డులు



కాలిఫోర్నియాలో 76వ 'గోల్డెన్ గ్లోబ్ అవార్డుల వేడుక జనవరి 6న జరిగింది. ఈ సందర్భంగా ప్రదానం చేసిన అవార్డుల వివరాలు.. ఉత్తమ చిత్రం (మ్యూజికల్, కామెడీ): గ్రీన్ బుక్, ఉత్తమ చిత్రం (డ్రామా): బోహేమియన్ రాప్సోడీ, ఉత్తమ దర్శకుడు: ఆల్ఫోనో క్యారోన్, ఉత్తమ నటి (మ్యూజికల్, కామెడీ): ఒలీవియా కోల్మన్, ఉత్తమ నటి (డ్రామా): గ్లెన్ క్లోజ్ (ది వైఫ్), ఉత్తమ నటుడు (మ్యూజికల్, కామెడీ) : క్రిస్టియన్ బేల్, ఉత్తమ సహాయనటుడు: మహర్షలా అలీ, ఉత్తమ సహాయ నటి: రెజీనా కింగ్, ఉత్తమ టీవీ సిరీస్: ది అసాసినేషన్ ఆఫ్ గియాన్నీ వరాచీ, ఉత్తమ విదేశీ చిత్రం: రోమా, ఉత్తమ యానిమేటెడ్ చిత్రం: స్పైడర్ మ్యాన్ ఇంటూ ది స్పైడర్ వర్స్.

కుంభమేళా ప్రారంభం




ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్ (అలహాబాద్)లో త్రివేణీ, సంగమం వద్ద 'అర్ధ కుంభమేళా' జనవరి 15న ప్రారంభమైంది. మార్చి 4వ తేదీ వరకూ జరిగే ఈ ఉత్సవంలో 12 కోట్ల మంది పాల్గొంటారని అంచనా. ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రూ.4,200 కోట్లను కేటాయించింది. కుంభమేళా సందర్భంగా గంగా - యమున నదీ తీరాన 32 వేల హెక్టార్లలో ఏర్పాటు చేసిన కుంభనగరి ప్రపంచంలోనే అతిపెద్ద తాత్కాలిక నగరంగా రికార్డుకెక్కింది.

ఈబీసీ రిజర్వేషన్ చట్టం అమలు


ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాల పేదలకు (ఈబీసీ) 10 శాతం రిజర్వేషన్లు కల్పించే 124వ రాజ్యాంగ సవరణ చట్టం జనవరి 14 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ మేరకు కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బిల్లుకు జనవరి 12న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోద ముద్ర వేశారు. దీంతో ఈ బిల్లు చట్టంగా మారింది. జనరల్ కేటగిరీలో ఆర్థికంగా వెనకబడిన ప్రజల అభివృద్ధికి ప్రత్యేక నిబంధనలు చేరుస్తూ రాజ్యాంగంలోని 15వ, 16వ నిబంధనల్ని సవరించి, ఈ చట్టం రూపొందించారు. ఈ చట్టాన్ని అమలు చేసిన తొలి రాష్ట్రంగా గుజరాత్ నిలిచింది.

సత్యరూప్ ఘనత



ఏడు ఖండాల్లోని ఎత్తయిన శిఖరాలను, అగ్ని పర్వత శిఖ రాగ్రాలను అత్యంత చిన్న వయసు (35 ఏళ్ల 262 రోజుల వయసు)లో అధిరోహించిన వాడిగా భారత పర్వతారోహకుడు సత్యరూప్ సిద్ధాంత ఘనత సాధించారు. అంతకు ముందు ఈ రికార్డు ఆస్ట్రేలియాకు చెందిన డానియెల్ బుల్ (36 ఏళ్ల 15 రోజులు) పేరు మీద ఉండేది. జనవరి 16న -40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్ద అంటార్కిటికాలోని మౌంట్ సిడ్లీ శిఖరాన్ని అధిరోహించడం ద్వారా సత్యరూప్ రికార్డును తిరగరాశాడు. అదేవిధంగా ఏడు ఖండాల్లోని ఎత్తయిన శిఖరాలు, అగ్నిపర్వత శిఖరాగ్రాల అధిరోహణ పూర్తి చేసిన తొలి భారతీయుడు సత్యరూప్. కోల్‌కతాకు చెందిన సత్యరూప్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్నారు.

వెనెజులా అధ్యక్షుడిగా నికోలస్ మదురో



వెనెజులా అధ్యక్షుడిగా నికోలస్ మదురో రెండోసారి బాధ్యతలు చేపట్టారు. ఆ దేశ రాజధాని కారకస్‌లో జనవరి 10న జరిగిన కార్యక్రమంలో మదురో ప్రమాణస్వీకారం చేశారు. వెనెజులా అధ్యక్ష ఎన్నికల్లో ప్రతిపక్ష నాయకులు నిషేధానికి గురవడం, కొన్ని పార్టీలు పోటీకి దూరం కావడంతో ఎన్నికల్లో గెలిచినట్లు మదురో మే నెల్లో ప్రకటించారు.

ఐబా ర్యాంకింగ్‌లో మేరీకోమ్‌కు అగ్రస్థానం



అంతర్జాతీయ బాక్సింగ్ సంఘం (ఐబా) జనవరి 10న విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో భారత మహిళా బాక్సర్ మేరీకోమ్ అగ్రస్థానంలో నిలిచింది. మేరీ 48 కేజీల కేటగిరీలో 1700 పాయింట్లు సాధించి, మొదటిస్థానం దక్కించుకుంది. గతేడాది నవంబర్‌లో మేరీకోమ్ ఆరోసారి ప్రపంచ చాంపియన్ షిప్‌ను గెలుచుకుంది.


పీబీఎల్ విజేత బెంగళూరు

ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ నాలుగో సీజన్ (పీబీఎల్-4)లో బెంగళూరు రాప్టర్స్ విజేతగా నిలిచింది. బెంగళూరులో జనవరి 13న జరిగిన ఫైనల్లో ముంబై రాకెట్స్ పై విజయం సాధించింది. విజేతగా నిలిచిన రాప్టర్స్‌కు రూ.3 కోట్ల ప్రైజ్ మనీ లభించింది.

హాప్‌మన్ కప్

అంతర్జాతీయ మిక్స్‌డ్ టెన్నిస్ టోర్నమెంట్ హాప్‌మన్ కప్‌లో రోజర్ ఫెడరర్ - బెలిండా బెన్సిచ్ (స్విట్జర్లాండ్) జట్టు విజేతగా నిలిచింది. జనవరి 5న పెర్త్‌లో జరిగిన ఫైనల్లో అలెగ్జాండర్ జ్వెరెవ్-ఏంజెలిక్ కెర్బర్ (జర్మనీ) జట్టును ఓడించారు. ఈ విజయంతో మూడుసార్లు హాప్‌మన్ టైటిల్ గెలిచిన తొలి ఆటగాడిగా ఫెడరర్ రికార్డు సృష్టించాడు.

12 ఏళ్లకే గ్రాండ్ మాస్టర్



తమిళనాడు కుర్రాడు డి.గుకేశ్ 12 ఏళ్ల 7 నెలల 17 రోజుల వయసులోనే గ్రాండ్ మాస్టర్ (జీఎం) హోదా సాధించాడు. తద్వారా ఈ ఘనత సాధించిన అతిచిన్న భారతీయ గ్రాండ్ మాస్టర్‌గా కొత్త చరిత్ర సృష్టించాడు. గతంలో ప్రజ్ఞానంద గతేడాది జూన్‌లో సాధించిన రికార్డు (12 ఏళ్ల 10 నెలల వయసులో)ను అధిగమించాడు.

వారణాసిలో ప్రవాసీ భారతీయ దివస్

ప్రవాసీ భారతీయ్ దివస్ - 2019ని ప్రధాని మోడీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసి నియోజకవర్గంలో జనవరి 21 - 24 మధ్య నిర్వహించనున్నట్లు విదేశీ వ్యవహారాలశాఖ సహాయ మంత్రి వీకే సింగ్ జనవరి 11న తెలిపారు. 1915 జనవరి 9న మహాత్మాగాంధీ భారత్‌కు తిరిగి వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని, ఏటా అదే రోజున 'ప్రవాసీ భారతీయ దివస్'ను నిర్వహించడం ఆనవాయితీ. అయితే - కుంభమేళా, గణతంత్ర దినోత్సవాల్లో ఎన్ఆర్ఐలు పాల్గొనేందుకు వీలుగా ఈసారి తేదీల్లో మార్పు చేశారు.

జపాన్‌తో ద్వైపాక్షిక స్వాప్ ఏర్పాటు

జపాన్‌తో 15 బిలియన్ డాలర్ల మేర ద్వైపాక్షిక స్వాప్ ఏర్పాటు ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ జనవరి 10న ఆమోదం తెలిపింది. దీంతో స్వాప్ ఏర్పాటుకు బ్యాంక్ ఆఫ్ జపాన్‌తో ఆర్‌బీఐ ఒప్పందం చేసుకునేందుకు అధికారం కల్పించినట్లయ్యింది. ఈ ఒప్పందం కారణంగా కరెన్సీ పరంగా స్థిరత్వం ఏర్పడి, భారత కంపెనీలు విదేశీ నిధులను సులభంగా పొందే అవకాశాలు మెరుగుపడనున్నాయి.

గురువు గోవింద్ సింగ్ స్మారక నాణెం

సిక్కుల 10వ గురువు గోవింద్ సింగ్ 350వ జయంతి వేడుకల సందర్భంగా ఢిల్లీలో జనవరి 13న జరిగిన కార్యక్రమంలో రూ.350 విలువైన వెండి స్మారక నాణేన్ని ప్రధాని నరేంద్ర మోడీ విడుదల చేశారు.

డీడీ సైన్స్, ఇండియా సైన్స్ ఛానళ్ల ప్రారంభం

కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ, దూరదర్శన్‌లు డీడీ సైన్స్, ఇండియా సైన్స్ ఛానళ్లను అందుబాటులోకి తెచ్చాయి. కేంద్రమంత్రి హర్షవర్ధన్ జనవరి 15న వీటి ప్రసారాలను ప్రారంభించారు. 'డీడీ సైన్స్' ప్రస్తుతం దూరదర్శన్ నేషనల్ ఛానల్‌లో గంటపాటు ప్రసారాలు అందిస్తుంది. భవిష్యత్తులో దీన్ని పూర్తిస్థాయి ఛానల్‌గా అభివృద్ధి చేస్తారు. 'ఇండియా సైన్స్' మాత్రం ఇంటర్నెట్ ఆధార ఛానల్. వీటి ప్రసారాలు రోజంతా ఉంటాయి.


జపాన్ కురువృద్ధుడి కన్నుమూత

ప్రపంచంలోనే ఎక్కువ వయస్సున్న వ్యక్తిగా గిన్నిస్ రికార్డు సొంతం చేసుకున్న జపాన్ వాసి మెజాజో నొనాకా కన్నుమూశారు. ఉత్తర జపాన్‌లోని హొక్కైదో దీవిలో తన సొంత నివాసంలోనే ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. 113 ఏళ్ల మెజాజోది సహజ మరణమేనని కుటుంబ సభ్యులు తెలిపారు. 1905, జులై 25న మెజాజో జన్మించారు. గతేడాది 112 ఏళ్ల 259 రోజులు పూర్తి చేసుకొని, గిన్నిస్ రికార్డు దక్కించుకున్నారు.

ఊబకాయ 'అణువులు' గుర్తింపు

ఊబకాయానికి కారణమయ్యే అణువుల సమూహాన్ని పరిశోధకులు కనుగొన్నారు. అధిక బరువు పెరుగుదలలో మెదడులోని హైపోథాలమస్ పాత్రపై అధ్యయనం చేసిన యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జి, చిల్డ్రన్స్ హాస్పిటల్ లాస్‌ఏంజెలిస్ పరిశోధకులు ఈ అణువులను గుర్తించారు. శరీరంలో పోషకాలు తగ్గినపుడు ఆహారం తీసుకోవాలని సంకేతాలు పంపడంలో హైపోథాలమస్ కీలకం. ఈ సంకేతాలను హైపోథాలమస్‌లోని సెమాఫోరిన్స్ అనే అణువులు నియంత్రిస్తాయని పరిశోధకులు గుర్తించారు. వాటి పనితీరులో మార్పులు వచ్చినపుడు ఊబకాయం వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు.

వ్యాధులను వేగంగా గుర్తించే ఎంజైమ్ టెస్ట్!



శరీరంలోని వ్యాధులను, బ్యాక్టీరియా వల్ల వచ్చే అంటు రోగాలను తక్కువ ఖర్చుతోనే కచ్చితత్వంతో గుర్తించే ఎంజైమ్ టెస్ట్‌ను బ్రిటన్‌లోని క్వీన్స్ యూనివర్సిటీ పరిశోధకులు అభివృద్ధి చేశారు. మనుషులు, జంతువులు, ఆహార ఉత్పత్తుల్లో ప్రొటీసెస్‌గా పిలిచే ఎంజైమ్ మార్కర్లను ఈ పరీక్ష ద్వారా గుర్తించవచ్చు. సూక్ష్మజీవుల అభివృద్ధి, వ్యాధుల పురోగతిలో ప్రొటీసెస్ కీలకపాత్ర పోషిస్తుంది. ప్రస్తుతం ఈ ఎంజైమ్‌లను గుర్తించే పద్ధతి చాలా ఖర్చుతో కూడుకున్నది. పైగా ఎక్కువ సమయం తీసుకుంటుంది. అయితే తక్కువ ఖర్చుతో 90 నిమిషాల్లోనే ఫలితాన్నిచ్చే నానోసెన్సర్‌ను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. దీని సాయంతో రోగకారక ఎంజైమ్‌లను గుర్తించవచ్చు.

★

ట్రాక్టర్‌తో తొక్కించి చంపేశాడు

ప్రజాశక్తి- పొదిలి (ప్రకాశం)

భూ వివాదంలో సొంత బంధువునే (వరుసకు సోదరుడు) ట్రాక్టర్‌తో తొక్కించి చంపేశాడు ఓ వ్యక్తి. అడ్డొచ్చిన మరొకరు కూడా గాయపడ్డారు. ఈ ఘటన ప్రకాశం జిల్లా పొదిలి మండలం, ఏలూరులో బుధవారం జరిగింది. ఎస్ఐ టి శ్రీరాం కథనం ప్రకారం ఏలూరుకు చెందిన చిన్నపరెడ్డి రమణారెడ్డి(41), శ్రీనివాసరెడ్డి చీమకుర్తి మండలంలోని పాటిమీదపాలెంలో నివాసం ఉంటున్నారు. వారి దాయాదులు.. చిన్నపురెడ్డి సుబ్బారెడ్డి, ఆయన కుమారులు సుబ్బరామిరెడ్డి, బ్రహ్మారెడ్డి. రెండు కుటుంబాల మధ్య భూ వివాదం నడుస్తోంది. బుధవారం సుబ్బరామిరెడ్డి ఏలూరులోని పొలంలో ట్రాక్టర్‌తో కందిపంటను దున్నుతున్నాడు. అడ్డుకునేందుకు రమణారెడ్డి, శ్రీనివాస రెడ్డి ప్రయత్నించారు. దీంతో సుబ్బరామిరెడ్డి రమణారెడ్డిని ట్రాక్టర్‌తో తొక్కించేశాడు. నిలువరించేందుకు శ్రీనివాస రెడ్డి ప్రయత్నించారు. ఇద్దర్నీ ఆస్పత్రికి తరలిస్తుండగా రమణారెడ్డి మార్గమధ్యలో చనిపోయాడు. శ్రీనివాస రెడ్డిని మెరుగైన వైద్యం కోసం ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

తూర్పుగోదావరి జిల్లా విజన్ కార్యాచరణ ప్రణాళికను విడుదల చేస్తున్న ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప



అభివృద్ధిలో అగ్రగామి తూర్పుగోదావరి

ఉపముఖ్యమంత్రి చినరాజప్ప

ప్రజాశక్తి- కాకినాడ

వనరుల సద్వినియోగం ద్వారా తూర్పుగోదావరి జిల్లా అభివృద్ధిలో అగ్రగామిగా ఉందని, భవిష్యత్తులో అన్ని రంగాల్లోనూ గణనీయమైన ప్రగతిని సాధిస్తుందని ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్లోని ప్రజావాణి హాలులో 2019–24 జిల్లా విజన్ కార్యాచరణ ప్రణాళికను ఆయన బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంతో పాటు పారిశ్రామిక రంగంలోనూ జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. 2024 నాటికి వివిధ రంగాల్లో సాధించే ప్రగతిని ఈ ప్రణాళికలో రూపొందించామని పేర్కొన్నారు. జలవనరుల సద్వినియోగం, ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా వ్యవసాయ దిగుబడులను పెంచే చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా మెట్ట ప్రాంతం సస్యశ్యామలమైందన్నారు. పాడిపరిశ్రమ, మత్స్యశాఖ, ఉద్యానవన రంగాల్లో మరింత ప్రగతిని సాధించేందుకు అవసరమైన లక్ష్యాలను ఈ ప్రణాళికలో పొందుపరిచామన్నారు. విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు, ఆయిల్, సహజ వాయువుల వినియోగం ద్వారా భవిష్యత్తులో మరింత ప్రగతిని సాధించొచ్చన్నారు. సర్వీస్ సెక్టార్‌లో పర్యాటక అభివృద్ధిలో భాగంగా కోస్తా తీరప్రాంతం, ఏజెన్సీలో వనరుల సద్వినియోగం జరగాలన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రోడ్ల విస్తరణ విస్తృతస్థాయిలో జరుగుతుందన్నారు. దీని ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడి ఆయా ప్రాంతాల అభివృద్ధికి దోహద పడుతుందని వివరించారు.

ఎమ్మెల్యే మాణిక్యాలరావు దీక్ష భగ్నం

ఉద్యమాలంటే చంద్రబాబుకు వణుకు : మాణిక్యాలరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం, కొవ్వూరు రూరల్

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే పైడికొండల మాణిక్యాలరావు చేపట్టిన దీక్షను మంగళవారం రాత్రి పోలీసులు భగ్నం చేసి ఆస్పత్రికి తరలించారు. బుధవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో విలేకర్ల సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉద్యమాలంటే వెన్నులో వణుకు పుడుతుందన్నారు. హామీలు అమలు చేయాలని దీక్ష చేస్తుంటే కుట్రపూరితంగా భగ్నం చేశారని చెప్పారు. బీరు బాటిల్‌కి, మిల్క్ బాటిల్‌కి తేడా తెలియని ఎక్సైజ్ శాఖ మంత్రి జవహర్‌కు దీక్షను గురించి విమర్శించే హక్కు లేదన్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే దీక్షను భగ్నం చేసినందుకు నిరసనగా బిజెపి ఆధ్వర్యాన బుధవారం తాడేపల్లిగూడెంలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. బంద్‌కు పాక్షిక స్పందన లభించింది.

ఎమ్మెల్సీ సోము వీర్రాజు నిర్బంధం

ఎమ్మెల్యే పైడికొండల దీక్షను భగ్నం చేసిన విషయం తెలుసుకొని పరామర్శించేందుకు వెళ్తున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజును కొవ్వూరు సమీపంలోని గామన్ వంతెనమీద పోలీసులు అడ్డుకొని నిర్బంధించారు. అనంతరం ఆయన వెనుదిరిగారు.

కార్మిక, ఉద్యోగ పోరాటాలు మోడీకి పట్టవా?

ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

ప్రజాశక్తి -కలెక్టరేట్, విశాఖ

కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలపై కోట్లాది మంది పోరాటాలు చేస్తున్నా మోడీ ప్రభుత్వంలో ఎటువంటి మార్పు రాకపోవడం దుర్మార్గమని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు పేర్కొన్నారు. డాబాగార్డెన్స్‌లోని విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక చర్యలను నిరసిస్తూ ఈ నెల 8, 9 తేదీల్లో దేశవ్యాప్తంగా సుమారు 25 కోట్ల మంది కార్మికులు సమ్మె చేశారని, ఆ సమ్మె కారణంగా ప్రభుత్వానికి రూ.35 వేల కోట్ల మేర నష్టం వచ్చిందని తెలిపారు. ఉత్పత్తి, సంపద సృష్టించే కార్మికులు సమ్మె చేస్తే ఎలా ఉంటుందో మోడీకి తెలిసిందన్నారు. అయినప్పటికీ ఆయన వైఖరిలో మార్పు రాకపోగా మరింతగా కార్మిక వ్యతిరేకతను ప్రదర్శిస్తున్నారని విమర్శించారు.

ప్రజ్ఞ

జవాబులు

1.జార్ఖండ్, ఉత్తర ప్రదేశ్
2. 7.7శాతం
3.గుజరాత్
4.పాలస్తీనా
5.తమిళనాడు

టిడిపి పాలనలో అసమానతలే..

- సిపిఎం, సిపిఐ, జనసేన సదస్సులో వక్తల విమర్శ

ప్రజాశక్తి-అద్దంకి (ప్రకాశం)

టిడిపి పాలనలో పేదరికం, నిరుద్యోగం, అసమానతలు పెరిగాయని వక్తలు విమర్శించారు. అద్దంకిలోని బంగ్లారోడ్డులో సిపిఎం, సిపిఐ, జనసేన ఆధ్వర్యంలో బుధవారం ప్రజాభేరి సభ జరిగింది. సిపిఎం అద్దంకి ప్రాంతీయ కార్యదర్శి సిహెచ్ గంగయ్య అధ్యక్షతన జరిగిన సభలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సాగర్ జలాలు సక్రమంగా విడుదల చేయకపోవడంతో రైతులు తీవ్ర-నష్టాలపాలయ్యారన్నారు. కౌలు రైతులు 60 నుండి 70 శాతం వరకు ఉండగా వారికి ప్రభుత్వం నుండి రుణాలు, గుర్తింపు కార్డులు అందించలేదనీ, వారిని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ప్రజా సమస్యలను వదిలివేసి వారి సొంత ప్రయోజనాల కోసమే కేంద్ర ప్రభుత్వానికి వైసిపి అంటకాగుతోందన్నారు. ఈ రెండు పార్టీల విధానాలకు ప్రత్యామ్నాయంగా ముందుకొస్తున్నామనీ, ఆదరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ



అభివాదం చేస్తున్న సిపిఎం, సిపిఐ, జనసేన నాయకులు

సభ్యులు పిజె.చంద్రశేఖర్ మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నేరవేర్చలేదన్నారు. వైసిపి నాయకుడు లక్షల కోట్లు దోచుకొని 16 నెలలు జైలులో ఉండి ఇప్పుడు బెయిల్‌పై బయట ఉండి ప్రతిపక్షపాత్ర పోషించకుండా ప్రజాసమస్యలను గాలికి వదిలి పాదయాత్రలు, నిద్రయాత్రలు పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. జనసేన పార్టీ నాయకులు చీకటి వంశీదీప్ మాట్లాడుతూ ప్రధాన ప్రతిపక్షం ప్రజా సమస్యలను గాలికి వదిలి ముఖ్యమంత్రి పీఠంపై దృష్టిపెట్టిందనీ, అవినీతిని నిర్మూలిస్తామని చెప్తున్న జగన్ తాను చేసిన అవినీతి గురించి ఎందుకు మాట్లాడటం లేదని విమర్శించారు.

కనీస వేతనాలివ్వాలని లారీ కార్మికుల ర్యాలీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కనీసవేతనం రూ.18 వేలు ఇవ్వాలని కోరుతూ పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంరూరల్ మండలం నవాబ్‌పాలెం ఏరియా లారీ వర్కర్స్, డ్రైవర్లు, క్లీనర్లు బుధవారం ర్యాలీ నిర్వహించారు. వారం రోజులుగా సమ్మె చేస్తున్నా యాజమాన్యాలు పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ నవాబ్‌పాలెం బ్రిడ్జి సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు కర్రి నాగేశ్వరరావు మాట్లాడారు. వారంరోజులుగా సమ్మె చేస్తున్నా యాజమాన్యం స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని లారీ కార్మికులకు వేతన ఒప్పందం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాత్రింబవళ్లు పనిచేస్తున్నా కనీస వేతనాలు అమలు జరపకపోవడం దారుణమని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ లారీ యజమానులు సమస్యలను పరిష్కరించకుండా కార్మికులపై ప్రత్యక్ష దాడులకు దిగుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు విన్నవించామన్నారు. లారీ యజమానులు సమ్మెను విరమింపజేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రాధాను కలిసిన టిడిపి నేతలు

ఎంఎల్‌సి ఇస్తామని ప్రతిపాదన? - సెంట్రల్ సీటు కోరిన రాధా?

ప్రజాశక్తి - విజయవాడ సిటీ ప్రతినిధి

వైసిపికి వంగవీటి రాధా రాజీనామా చేసిన తర్వాత బెజవాడలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. ఆయన అడుగులు టిడిపివైపు పడుతున్నాయి. బుధవారం సాయంత్రం టిడిపి ఎంఎల్‌సిలు తొండెపు జనార్ధన్, బచ్చుల అర్జునుడు గవర్నరుపేటలోని ఆయన నివాసంలో కలిశారు. దాదాపు గంటకు పైగానే చర్చలు జరిపారు. ఈ చర్చల్లో రాధాను టిడిపిలోకి రావాలని ఆహ్వానించడంతో పాటుగా, పార్టీ అధినేత చంద్రబాబుతో మాట్లాడి ఎంఎల్‌సి ఇప్పిస్తామని చెప్పినట్లు సమాచారం. రాధా మాత్రం తనకు సెంట్రల్ సీటు కావాలని పట్టుబట్టినట్లు తెలిసింది. దీనికి బచ్చుల సరే అన్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. రాధా ఈ నెల 25న చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరాలని నిర్ణయించుకున్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. దీనికి భారీగానే జనసమీకరణ చేయడానికి ఏర్పాట్లు సాగుతున్నాయి. సెంట్రల్ సీటు రాధాకు కేటాయిస్తే ప్రస్తుతం ఎంఎల్ఏగా ఉన్న బొండాకు గడ్డు పరిస్థితి వచ్చినట్లేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

రెండో రోజుకు 104 ఉద్యోగుల సమ్మె

- న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్రవ్యాప్తంగా సంచార చికిత్స ఉద్యోగులను(104) క్రమబద్ధీకరించాలని సిబ్బంది చేపట్టిన సమ్మె బుధవారానికి రెండోరోజుకు చేరుకుంది. పలు సంఘాల నాయకులు వీరి సమ్మెకు మద్దతు ప్రకటించారు. జిఒ 151 ప్రకారం వేతనాలు చెల్లించాలని, కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఉద్యోగులు హెచ్చరించారు.

విజయవాడలో జరిగిన ధర్నాలో సిఐటియు నాయకులు ఎ.వి.నాగేశ్వరరావు మాట్లాడారు. 13 జిల్లాల్లో చంద్రన్న సంచార చికిత్స ఉద్యోగులకు ప్రభుత్వం 2018 మేలో ఇచ్చిన హామీ ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి వి.ఆర్.ఫణికుమార్, కోశాధికారి కెవిఎన్.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. విజయనగరం జిల్లాలో రెండో రోజూ కొనసాగింది. సమ్మెలో భాగంగా కలెక్టరేట్ వద్ద దీక్ష చేపట్టారు. దీక్షా శిబిరాన్ని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.శ్రీనివాస ప్రారంభించారు. వారి పోరాటానికి మద్దతు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలోనూ 104 ఉద్యోగుల సమ్మె కొనసాగింది. జిల్లా, వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం అవరణలో ఏర్పాటు చేసిన సమ్మె శిబిరం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. ఆనంతరం అక్కడి ఎన్‌టిఆర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. సమ్మెపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు, 104 యూనియన్ గౌరవ అధ్యక్షులు కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద 104 ఉద్యోగులు చేపట్టారు. బుధవారం సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వీరలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా



విజయవాడలో మాట్లాడుతన్న సిఐటియు నాయకులు ఎ.వి. నాగేశ్వరరావు

ఆమె మాట్లాడుతూ ఉద్యోగుల డిమాండ్లు న్యాయమైనవని అన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా పరిషత్ వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో సమ్మె రెండోరోజు కొనసాగింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ 104 ఉద్యోగులు ఏలూరు కలెక్టరేట్ వద్ద నుంచి జిల్లా పరిషత్ కార్యాలయం మీదుగా ఫైర్ స్టేషన్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించి, అక్కడ ధర్నా చేశారు. గుంటూరు జిల్లాలో ఉద్యోగులంతా సమ్మెలో పాల్గొంటున్న నేపథ్యంలో 24 వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా సమ్మె శిబిరం నుండి పాతగుంటూరులోని బిఆర్ స్టేడియం వద్ద ఎన్‌టిఆర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, పి.విజయ్ మాట్లాడారు. ఒంగోలు కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. అద్దంకి బస్టాండ్ సెంటర్‌లోని యన్‌టిఆర్ విగ్రహానికి 104 ఉద్యోగులు వినతిపత్రం సమర్పించారు. ముందుగా కలెక్టరేట్ ధర్నా శిబిరం నుండి అద్దంకి బస్టాండ్ వరకు ఉద్యోగులు ప్రదర్శన నిర్వహించారు. నెల్లూరు కలెక్టరేట్ వద్ద సమ్మె రెండో రోజుకు చేరింది. ఉద్యోగులు కలెక్టరేట్ నుంచి విఆర్‌సి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించబోమని నాయకులు తెలిపారు. కర్నూలులో సమ్మె రెండోరోజుకు చేరింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా 104 ఉద్యోగుల శ్రమను దోచుకుంటున్నారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్‌దేశాయ్ విమర్శించారు. అనంతపురం జిల్లాలో 104 ఉద్యోగుల సమ్మె రెండోరోజు కొనసాగింది. చిత్తూరు జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి ఎదుట 104 ఉద్యోగులు ధర్నా చేపట్టారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చైతన్య మాట్లాడుతూ చంద్రన్న సంచార వైద్యసేవలో పని చేస్తున్న 104 ఉద్యోగులకు కనీస వేతనం నెలకు రూ.18 వేలు ఇవ్వాలన్నారు.

ఉద్యోగాలు కల్పించని రిజర్వేషన్లు ఎవరి కోసం?

దళిత శోషణ్ ముక్తి మంచ్ జాతీయ కన్వీనర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అరకులోయ (విశాఖపట్నం)

'రోజురోజుకు నిరుద్యోగ సమస్య పెరిగిపోతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళీ పోస్టులను, బ్యాక్‌ల్యాగ్ పోస్టులను భర్తీ చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయి. ఉద్యోగాలు కల్పించని రిజర్వేషన్లు ఎవరి కోసం?' అని దళిత శోషణ్ ముక్తి మంచ్ జాతీయ కన్వీనర్ వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. భారతదేశంలో రిజర్వేషన్ల అమలు - సుప్రీంకోర్టు తీర్పు అన్న అంశాలపై అరకులోయ గిరిజన భవన్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయులతో బుధవారం సాయంత్రం జరిగిన చర్చావేదికలో శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారతదేశంలో సామాజిక వెనుకబాటుతనం, అంటరానితనానికి అనుగుణంగా రాజ్యాంగంలో రిజర్వేషన్లు కల్పించబడ్డాయని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సక్రమంగా అమలు చేయకుండా నిరుద్యోగ సమస్యను మరింత పెంచుతుందని విమర్శించారు. ఒకవైపు రిజర్వేషన్ల అమలు కోసం దళిత, గిరిజనులు పోరాటం చేస్తుంటే, ఈ రిజర్వేషన్లను ఇంకెంత కాలం కొనసాగించాలని, వాటిని రద్దు చేయాలని కొన్ని రాష్ట్రాల్లో అగ్రకులాల వారు గందరగోళం సృష్టిస్తున్నారని తెలిపారు. పాలక పార్టీలు గిరిజనులను తెగల వారీగా విభజించే ప్రయత్నం చేస్తున్నాయని, అది ఎంతమాత్రమూ సమంజసం కాదని హితవు పలికారు. యుటిఎఫ్ నాయకులు మహేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు చిట్టిబాబు, రఘునాథ్ పాల్గొన్నారు.



మంత్రి సుజయకృష్ణ పిఎకి వినతిపత్రం అందజేస్తున్న జ్యూట్ కార్మికులు

ఆకలి కేకలకు సమాధానం చెప్పాల్సిందే

మంత్రి ఇంటికి జూట్ మిల్లు కార్మికుల రాయబారం

ప్రజాశక్తి- బొబ్బిలి (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా బొబ్బిలిలోని శ్రీలక్ష్మీ శ్రీనివాస జూట్ మిల్లు కార్మికుల ఆకలి కేకలకు మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు సమాధానం చెప్పాలని లాకౌట్ వ్యతిరేక ఐక్య పోరాట కమిటీ డిమాండ్ చేసింది. బొబ్బిలోని గాంధీ విగ్రహం నుంచి మంత్రి ఇంటి వరకూ జ్యూట్ కార్మికులు బుధవారం ర్యాలీగా వెళ్లి ఆయన పిఎకు రాయబార పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా (పార్వతీపురం) ప్రధాన కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడారు. 2015 జనవరి 23న మిల్లు లాకౌట్ పడడంతో 2,300 మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని తెలిపారు. వారిలో 18 మంది కార్మికులు మరణించడంతో వారి కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. కార్మికులకు గ్రాట్యూటీ, పిఎఫ్, ఇఎస్ఐ, బోనస్ సుమారు రూ.పది కోట్లు యాజమాన్యం బకాయి పడిందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి మంత్రి చొరవ చూపాలని కోరారు. లేకుంటే వచ్చేనెల ఒకటో తేదీ నుంచి దశల వారీ ఉద్యమం చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, ఇఫ్టూ, రైతు సంక్షేమ సంఘం, కళాసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రతి జిల్లాలో ఇవిఎంల పరిశీలన చేపట్టాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి దఫా పరిశీలన చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి గోపాలకష్ణ ద్వివేది కలెక్టర్లకు సూచించారు. బుధవారం విజయవాడ రాష్ట్ర ఎన్నికల కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలకష్ణ మాట్లాడుతూ ఇవిఎంల వెరిఫికేషన్ రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో పక్కాగా జరపాలన్నారు. ఓటర్ల జాబితాలో తప్పొప్పులుంటే గుర్తించి సరి చేయాలని సూచించారు. ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు.కర్నూలు జిల్లా కలెక్టరు ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో 11 ప్రాంతాల్లో ఆర్ఒ పోస్టులు ఖాళీగా వున్నాయని, భర్తీకి ప్రతిపాదనలు ఎన్నికల కార్యాలయానికి పంపామని చెప్పారు.

ఎసిబి వలలో సోంపేట విఆర్ఒ

ప్రజాశక్తి- సోంపేట (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం జింకిభద్ర, బారువా రెవెన్యూ పరిధిలోని విఆర్ఒ జి.కృష్ణదాస్ అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) వలలో చిక్కుకున్నాడు. ఎసిబి డిఎస్పి రాజేంద్ర కథనం ప్రకారం... సోంపేటకు చెందిన తూముల వినోద్‌కృష్ణ తన తండ్రి నుంచి సంక్రమించిన 3.04 ఎకరాల భూమిని మ్యూటేషన్ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. గతంలో పనిచేసిన ఇద్దరు విఆర్ఒలు ఆయన వద్ద నుంచి రూ.15 వేలు చొప్పున రూ.30 వేలు లంచం తీసుకున్నారు. మరలా ఈ నెల 4న వినోద్‌కృష్ణ దరఖాస్తు చేసుకుని, విఆర్ఒను కలిశారు. ఆయన కూడా రూ.15 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో, విసుగు చెందిన వినోద్‌కృష్ణ ఎసిబి అధికారులను ఆశ్రయించారు. ఎసిబి డిఎస్పి రాజేంద్ర ఇచ్చిన నగదును తీసుకుని తహశీల్దార్ కార్యాలయంలోని సర్వేయర్ గదికి వెళ్లి విఆర్ఒకు అందజేశారు. అదే సమయంలో ఎసిబి అధికారులు దాడి చేసి విఆర్ఒ నుంచి ఆ నగదును స్వాధీనం చేసుకున్నారు. విఆర్ఒను అరెస్టు చేశారు.

భూమి కోసం భుక్తి కోసం...

- కడప కలెక్టరేట్ వద్ద వంటవార్పు
- జిల్లా వ్యాప్తంగా భారీగా తరలొచ్చిన పేదలు

ప్రజాశక్తి - కడప సిటీ ప్రతినిధి

తలదాచుకోవడానికి సెంటు స్థలం, బతకుదెరువు కోసం ఎకరా సాగునేలను ఇవ్వాలంటూ పేదలు పెట్టుకున్న కన్నీటి మొర ప్రభుత్వానికి వినిపించడం లేదు. బతుకు పోరాటం దుర్భరమై బాధల సుడిగుండంలో ఇక బతకడం సాధ్యం కాదు పోరాటమే శరణ్యమంటూ పేదల దండు కదిలింది. అధికారులు సమస్యలపై స్పందించేంత వరకు కదిలేది లేదన్న రీతిలో పేదలు తమ మకాంను ఏకంగా కలెక్టరేట్ వద్దకు మార్చేశారు. వేల ఎకరాల ప్రభుత్వ స్థలాలను కబ్జాదారుల చెర నుంచి విడిపించి పేదలు సాగుచేస్తున్న భూములను పేదలకే అప్పగించాలని కోరుతూ బుధవారం భూ సాధన కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. పిల్లా పాపలతో మహిళలు, తట్టబుట్టా సర్దుకొని ఉదయం



కలెక్టరేట్ వద్ద వంటావార్పు చేస్తున్న పేదలు

తొమ్మిది గంటలకే కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకున్నారు. వృద్ధులు, బాలింతలు, గర్భిణులు సైతం పాల్గొన్నారు. మొదటి రోజు నిర్వహించిన ఈ పోరాటం పలువురిని ఆకర్షించింది. కార్యక్రమంలో భూ సాధన కమిటీ జిల్లా కన్వీనర్ బి.నారాయణ మాట్లాడుతూ జిల్లాలో వేల ఎకరాల ప్రభుత్వ భూములు పెద్దలకు కట్టబెడుతున్నారని, పేదలకు సెంటు భూమి ఇవ్వడానికి ప్రభుత్వానికి చేతులు రావడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే ఇళ్ళు, సాగుభూమి లేని పేదలకు వాటిని పంపిణీ చేయాలని లేదంటే భవిష్యత్తు పోరాటాలు తీవ్రతరం చేస్తామని చెప్పారు.

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, అన్వేష్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, సిఐటియు కార్యదర్శి శివకుమార్ ప్రసంగించారు.

హంద్రీనీవా నీరిచ్చి ఆదుకోండి : సిపిఎం

చిలమత్తూరు: హంద్రీనీవా నీటి కోసం అనంతపురం జిల్లా చిలమత్తూరు మండలంలో చేపట్టిన సిపిఎం పాదయాత్ర బుధవారం మూడో రోజుకు చేరుకుంది. కొడికొండలో మొదలైన యాత్ర మొరుసనపల్లి, దోరనాళ్లపల్లి, గ్రామాల మీదుగా సాగింది. పాదయాత్రలో పాల్గొన్న రాంభూపాల్, నాయకులు ఆయా గ్రామాల్లో ప్రజలు, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. అన్ని చెరువులను హంద్రీనీవా నీటితో నింపాలన్నారు. సేకరించిన భూములను తిరిగి రైతులకు ఇచ్చేయాలని డిమాండ్ చేశారు.

వికలాంగుల హక్కుల సాధన కోసం 31న చలో విజయవాడ

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

వికలాంగుల హక్కుల సాధన కోసం జనవరి 31న విజయవాడ ధర్నా చౌక్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వికలాంగులకు నెలకు పింఛన్ కాకుండా గౌరవ వేతనంగా ప్రతి నెలా రూ.5 వేలు ఇవ్వాలని, రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు మల్లికార్జునరావు, కృష్ణా జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, విజయవాడ నగర అధ్యక్షులు తిరుపతిరావు, మహిళా అధ్యక్షురాలు సుజాత, నాయకులు స్టీఫెన్, పాల్గొన్నారు.

గుజరాత్ అల్లర్ల కేసు దోషులకు సుప్రీం బెయిల్

న్యూఢిల్లీ : గుజరాత్ అల్లర్లకు సంబంధించిన నరోదా పాటియా కేసులో నలుగురు దోషులకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. వారిని దోషులుగా నిర్ణయించడంపై సుప్రీం సందేహాలు వ్యక్తం చేసింది. గృహ దహనాలు, అల్లర్లకు పాల్పడినందుకు ఉమేష్‌భాయి, రాజ్‌కుమార్, హర్షద్, ప్రకాష్‌భాయి రాథోడ్‌లకు పదేళ్ళ జైలు శిక్ష విధించారు. గుజరాత్ హైకోర్టు వీరిని దోషులుగా నిర్ధారిం చింది. అయితే, 'వారిని దోషులగా పేర్కొంటూ జారీ చేసిన ఉత్తర్వుల పై చర్చ జరగాల్సి వుంది.' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. 2002 ఫిబ్రవరి 28న అహ్మదాబాద్ సమీపంలోని నరోదా పాటియాలో అల్లరి మూక 97 మంది ముస్లింలను ఊచకోత కోసింది. గోద్రా రైలు ఊచకోత ఘటన నేపథ్యంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. గతేడాది జూన్‌లో గుజరాత్ హైకోర్టు వీరికి పదేళ్ళ కఠిన కారాగార శిక్ష విధించింది.

ప్రదర్శన | నేతాజీ సుభాస్ చంద్రబోస్ 122వ జన్మదినోత్సవం సందర్భంగా కలకత్తాలో ప్రదర్శన జరుపుతున్న వామపక్షాలు



అజ్ఞాత వర్గాల నుంచే 50 శాతానికి పైగా నిధులు

జాతీయపార్టీలకు అందిన నిధులు, విరాళాలపై విశ్లేషణ

న్యూఢిల్లీ : జాతీయ పార్టీలు 2017–18 ఆర్థిక సంవత్సరంలో అందుకున్న నిధుల్లో 50శాతానికి పైగా నిధులు అజ్ఞాత వర్గాల నుండి అందుకున్నవేనని ఎన్నికల పర్యవేక్షణ సంస్థ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) పేర్కొంది. ఎన్నికల కమిషన్ వద్ద వున్న ఆరు జాతీయ పార్టీల ఐటి రిటర్న్స్, విరాళాల ప్రకటనలపై విశ్లేషించిన అనంతరం వాటి వివరాలను ఎడిఆర్ బుధవారం విడుదల చేసింది. బిజెపి, కాంగ్రెస్, సిపిఐ, బిఎస్‌పి, టిఎంసి, ఎన్‌సిపిల మొత్తం ఆదాయం రు.1293.05కోట్లు అని నివేదిక పేర్కొంది. ఇందులో 689.44కోట్లు అజ్ఞాత వర్గాల నుండి వచ్చిందేనని, ఇది, మొత్తంలో 53 శాతంగా వుందని పేర్కొంది. ఇందులో ఒక్క బిజెపిదే రు.553.38కోట్లు వరకు వుందని తెలిపింది. అంటే జాతీయ పార్టీల మొత్తం ఆదాయంలో ఇది 80 శాతంగా వుంది. వివిధ రాజకీయ పార్టీలకు అజ్ఞాత వర్గాల ద్వారా వచ్చిన ఈ 689.44 కోట్లలో ఎన్నికల బాండ్ల ద్వారా వచ్చిన ఆదాయం రు.215 కోట్లు లేదా 31శాతమని నివేదిక పేర్కొంది. స్వచ్ఛందంగా ఇచ్చే విరాళాల ద్వారా అందిన మొత్తం రు.354.22 కోట్లు లేదా 51శాతంపై మాటే. ఆస్తుల అమ్మకాలు, ప్రచురణల ద్వారా వచ్చే ఆదాయం, సభ్యత రుసుము, బ్యాంక్ వడ్డీ, పార్టీ లెవీ ద్వారా వచ్చే మొత్తం రు.136.48 కోట్లుగా వుంది. రు.20వేల కన్నా తక్కువ మొత్తంలో అందిన విరాళాల మొత్తం కేవలం రు.16.80 లక్షలుగా వుందని ఆ నివేదిక పేర్కొంది.

తల్లకిందులు కానున్న యుపి ఫలితాలు

వెల్లడించిన ఇండియా టుడే సర్వే

న్యూఢిల్లీ: కేంద్రంలో అధికారానికి రావటంలో బిజెపికి మార్గాన్ని సుగమం చేసిన యుపిలో రానున్న పార్లమెంటు ఎన్నికలలో 2014 ఫలితాలు తల్లకిందులు కానున్నాయని ఇండియా టుడే, కార్వి సంస్థలు నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. యుపిలో బిజెపి 55 నుండి 65కు పైగా స్థానాలను కోల్పోతుందని, ఎస్‌పి, బిఎస్‌పి, ఆర్‌ఎల్‌డిలు 58కి పైగా స్థానాలు గెలవనున్నాయని సర్వే స్పష్టం చేసింది. ఈ మూడు పార్టీల కూటమి, కాంగ్రెస్ కలిసి 75 స్థానాలు గెలుస్తాయని,బిజెపి అప్నాదళ్ కూటమి 5–18 స్థానాలకే పరిమితమౌతుందని చెప్పింది. 2014 ఎన్నికలలో బిజెపి, అప్నాదళ్ కూటమి 80లో 73 స్థానాలు గెలుచుకున్నాయి. బిజెపి ఓట్లు 43.5 శాతం నుండి 36 శాతానికి పడిపోతాయని, ఎస్‌పి, బిఎస్‌పి, ఆర్‌ఎల్‌డిల ఓట్లు 46 శాతానికి పెరుగుతాయని సర్వే స్పష్టం చేసింది.

బిజెపిని ఓడించేందుకు ఎస్‌పి, బిఎస్‌పి కూటమికి సహకరిస్తాం : రాహుల్ వ్యాఖ్య



న్యూఢిల్లీ : సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేష్ యాదవ్, బిఎస్‌పి అధినేత మాయా వతిలతో తమకు శతృత్వం లేదని, బిజెపిని ఓడించే లక్ష్యంతో వారు ముందుకు వస్తే అందుకు తాము సిద్ధమేనని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. తమ లక్ష్యం బిజెపిని ఓడించడమేనని అమేథీలో పర్యటన సందర్భం గా బుధవారం రాహుల్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ యుపి తూర్పు ప్రాంత ఇన్‌ఛార్జ్‌గా ప్రధాన కార్యదర్శి హోదాలో ప్రియాంక గాంధీని పార్టీ నియమించిన నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు ప్రాదాన్యతను సంతరించుకు న్నాయి. రాష్ట్రాల లోని ప్రాంతీయ పార్టీలకు కాంగ్రెస్ వెన్నుదన్నుగా నిలుస్తుందని పునరుద్ఘాటిం చారు. అయితే గుజరాత్‌లో మాత్రం అది సాధ్యంకాదని అన్నారు. ఇటీవల ఎస్‌పి, బిఎస్‌పిలు యుపిలో కూటమిగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో కాంగ్రెస్‌ను దూరంగా పెట్టినట్లైంది. ఈ పరిస్థితుల్లో ఆపార్టీలకు రాహుల్ స్నేహహస్తం అందించడం విశేషం. యుపిలో కాంగ్రెస్ లేకుండానే ఎస్‌పి, బిఎస్‌పిలు కూటమిని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

పౌరసత్వ బిల్లుకు వ్యతిరేకంగా మిజోలో నిరసన ఆందోళన

ఐజ్వాల్ : జాతీయ పౌరసత్వ నమోదు (సవరణ) బిల్లుకు వ్యతిరేకంగా మిజోరంలో బుధవారం వేలాది మంది నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ల దిష్టి బొమ్మలను తగలబెట్టారు. ఐజ్వాల్‌తో పాటు రాష్ట్రంలోని మరో 50 ప్రాంతా లలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. ప్ల కార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మోడీ, రాజ్‌నాథ్ సింగ్‌లు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీసుకువస్తున్న బిల్లు మిజోల ఉనికికి ప్రమాదం కలిగిస్తుందన్నారు. పౌరసత్వ బిల్లును నిరసిస్తూ ఈ నెల 8న దాదాపు 11 గంటల రాష్ట్ర బంద్‌ను మిజో జిల్లాయ్ పవల్ సంస్థ (ఎంజడిపి)తో పాటు మిజో స్టూడెంట్స్ ఫెడరేషన్ నిర్వహించాయి. ఈ బిల్లు ఆమోదం పొందితే మిజోలు సొంత భూభాగంపైనే పరాయివారవుతారని ఎంజడ్‌పి అధ్యక్షుడు వ్యాఖ్యానించారు. ఈ బిల్లు ఈ నెల 8న లోక్‌సభలో ఆమోదం పొందిన సంగతి తెలిసిందే.

ఎస్‌బిఐకీ చోక్సీ 'టోపీ'

- తొలిసారి వెల్లడించిన ప్రభుత్వ రంగ బ్యాంకు
- రూ.405 కోట్ల రుణం చెల్లించాలని నోటీసులు



ముంబయి : ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ)కు కూడా చోక్సి రూ. 405 కోట్లకు ఎగనామం పెట్టినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. తమ వద్ద 405 కోట్ల రూపాయలు రుణం తీసుకొని దేశం నుండి పారిపోయి సంవత్సరం గడుస్తుండగా ఇంతకాలం మౌనంగా ఉన్న ఎస్‌బిఐ ఇపుడు నోరుమెదపటం గమనార్హం. మెహుల్ చోక్సి, అతని కుటుంబం, అతని సంస్థలు రూ 405 కోట్ల రుణం చెల్లించాలని ఎస్‌బిఐ బుధవారం నోటీసు జారీ చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

మెహుల్ చోక్సీ తమకు బాకీ ఉన్నాడని ఎస్‌బిఐ వెల్లడించడం ఇదే మొదటిసారి. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను రూ13,500 కోట్ల మేరకు మోసం కేసులో మెహుల్ చోక్సీ ప్రధాన నిందితుడుగా ఉన్న విషయం తెలిసిందే. చోక్సీ తన భారత పౌరసత్వాన్ని వదులుకున్న రెండు రోజుల అనంతరం ఎన్‌బిఐ రుణం గురించి వెలుగులోకి రావడం గమనార్హం.

'ముంబయి, రాయ్‌గఢ్, నాసిక్, హైదరాబాద్‌ల్లో చోక్సి, అతని కుటుంబం, అతని సంస్థలకు చెందిన ఆస్తులపై ఇచ్చిన రుణాన్ని వెంటనే చెల్లించాలి' అని ఎస్‌బిఐ బుధవారం పత్రికలకు విడుదల చేసిన నోటీసులో పేర్కొంది. మహారాష్ట్ర, తెలంగాణలోనూ అనేక నివాస, వాణిజ్య సముదాయాలు చోక్సీ కుటుంబం పేర ఉన్నాయని నోటీసులో తెలిపింది. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్ 2002 చట్టం కింద చోక్సికి గతంలో తెలిపిన చిరుమానాకు డిసెంబరు 31, 2018న నోటీసులు ఇచ్చామని, కానీ ఆ నోటీసులు తిరిగి వచ్చాయని ఎస్‌బిఐ తెలిపింది. 'వర్కింగ్ క్యాపిటల్ ఫెసిలిటీ' పేరుతో ఈ రుణాన్ని ఇచ్చినట్లు బ్యాంక్ తెలిపింది. రుణం కోసం పైన పేర్కొన్న వివిధ ఆస్తులను తాకట్టు పెట్టారని తెలిపింది.

కాగా, 2018 ఫిబ్రవరిలో ఎస్‌బిఐ చైర్మన్ రజనీష్ కుమార్ మాట్లాడుతూ 'చోక్సీ పిఎన్‌బిని రూ. 1,360 కోట్ల మేరకు మోసం చేసిన కేసులో తమ బ్యాంకుకు ఎలాంటి ప్రత్యక్ష సంబంధం లేదని' చెప్పారు.ఇప్పటి వరకూ కూడా చోక్సి తమకు రూ 405 కోట్ల రుణం ఎగవేశాడని ఎస్‌బిఐ వెల్లడించక పోవడం గమనార్హం.

రిపబ్లిక్ డే పెరేడ్‌లో స్థానం దక్కని సిఐఎస్‌ఎఫ్

న్యూఢిల్లీ : గణతంత్ర దినోత్సవ వేడుకలలో జరిగే మార్చ్‌లో పాల్గొనేందుకు కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సిఐఎస్‌ఎఫ్) శకటానికి అనుమతి లభించలేదు. మూడు పారామిలటరీ దళాలు మాత్రమే పాల్గొనాలని అందుకే సిఐఎస్‌ఎఫ్‌కు రక్షణశాఖ అనుమతినివ్వలేదని హోం మంత్రిత్వ శాఖ పేర్కొంది. నిర్ణీత సమయానికికంటే ఆలస్యంగా తమకు దరఖాస్తు చేసుకున్నందునే అనుమతి వ్వలేకపోయామని తెలిపింది. ఈ ఏడాది సిఐఎస్‌ఎఫ్ గోల్డెన్ జూబ్లి (50) జరుపుకుంటున్న సంగతి తెలిసిందే. రక్షణ శాఖ తమ అభ్యర్థనపై నెలరోజుల అనంతరం సమాధానమిచ్చిందని, దీంతో గోల్డెన్ జూబ్లి ఇయర్ సందర్భంగా తాము మరో అభ్యర్థన చేసేందుకు అవకాశం లేదని సిఐఎస్‌ఎఫ్ పేర్కొంది. పారామిలటరీ దళాలు, సహాయక దళాలు రెండూ ఒకే కేటగిరీ కిందకు వస్తాయని, ఈ క్రమంలో సిఐఎస్‌ఎఫ్‌కూ అవకాశం వస్తుందని, అయితే రక్షణ శాఖ అనుమతినివ్వలేదని సిఐఎస్‌ఎఫ్ ప్రతినిధి పేర్కొన్నారు. కాగా, ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీ పోలీస్, అస్సాం రైఫిల్స్, రాపిడ్ యాక్షన్ ఫోర్స్‌లు తమ ప్రదర్శనను నిర్వహిస్తున్నాయి. సిఐఎస్‌ఎఫ్ 2017లో జరిగిన రిపబ్లిక్ డే ఉత్సవాల్లో పాల్గొంది.

నోట్ల రద్దుతో కళ తప్పిన 'ఉద్యోగ మేళా'

30 శాతం ఉద్యోగులతోనే ప్రభుత్వ శాఖలు



న్యూఢిల్లీ : ప్రధాని మోడీ అనాలోచితంగా తీసుకున్న నోట్ల రద్దు నిర్ణయం ఢిల్లీ ప్రభుత్వం నిర్వహించే మెగా జాబ్ మేళాపై కూడా పడింది. 2017 నుంచి ఈ జాబ్ మేళాలో పాల్గొనే సంస్థల సంఖ్య, ఉద్యోగాలకు ఎంపికయ్యే అభ్యర్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఈ విషయాన్ని ఢిల్లీ రాష్ట్ర ఉపాధి కల్పనా శాఖ మంత్రి గోపాల్ రాయ్ తెలిపారు. అలాగే తమ ప్రభుత్వంలోని వివిధ ప్రభుత్వ విభాగాలు కేవలం 20–30 శాతం సిబ్బందితోనే పని చేస్తున్నాయని, దీనికి కారణం తమ ప్రభుత్వానికి ఉద్యోగుల నియామకానికి సంబంధించిన అధికారం లేకపోవడమేనని మంత్రి చెప్పారు.. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాల కల్పనకు కేంద్రం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రెండు రోజుల పాటు ఇక్కడ నిర్వహించిన జాబ్ మేళాలో 79 సంస్థలు పాల్గొన్నాయి. 14 వేల మంది అభ్యర్థులను పరిశీలించి కేవలం 5 వేల మందిని తుది జాబితాకు ఎంపిక చేశాయి.

గత ఏడాదిలో ఈ జాబ్‌మేళాలో 89 కంపెనీలు పాల్గొని, 6 వేల మందిని తుది జాబితాకు ఎంపిక చేసుకున్నాయి. 2017లో 92 కంపెనీలు 9 వేల మంది అభ్యర్థులను తుది జాబితాకు ఎంపిక చేశాయి. నోట్లరద్దుతో వ్యాపారం దివాళా తీయడంతోనే ఈ సంఖ్య తగ్గిందని మంత్రి పేర్కొన్నారు.

త్రిపురలో మత స్వేచ్ఛపై దాడి

మతతత్వ శక్తుల అరాచకాలపై సిపిఎం విమర్శలు

న్యూఢిల్లీ : త్రిపురలో మత స్వేచ్ఛపై ఆర్‌ఎస్‌ఎస్ దాడులు చేయడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండించింది. రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత నుంచి ఆర్‌ఎస్‌ఎస్ సంస్థలు హిందూ జగరణ్ మంచ్, భజరంగ్ దళ్, హిందూ సురక్షా సమితి.. మొదలైన సంస్థలు మత స్వేచ్ఛపై దాడికి దిగుతున్నాయని సిపిఎం తెలిపింది. ముఖ్యంగా ముస్లింల మత విశ్వాసాలు, నమ్మకాలపై దాడులకు పాల్పడుతున్నాయని విమర్శించింది. ఉనకోటి జిల్లాలో 23 కుటుంబాలకు చెందిన 98 మందిని బలవంతంగా మతం మార్చడాన్ని తీవ్రంగా ఖండించింది. వీరంతా ఓరంగ్, ముండా సామాజిక వర్గానికి చెందినవారని, తేయాకు తోటల్లో పని చేస్తుంటారని తెలిపింది. వీరందరినీ 'ఘర్ వాపసీ' పేరుతో బలవంతంగా హిందూ జాగరణ్ మంచ్ మత మార్పిడి చేయిందని తెలిపింది. ఈ సంఘటనను గణ ముక్తి పరిషద్ వంటి ప్రగతిశీల సంస్థలు తీవ్రంగా ఖండించాయి. ఈ సంఘటనపై పూర్తి విచారణ చేయించాలని, మత స్వేచ్ఛపై ఇలాంటి దాడులు జరగకుండా చూడాలని డిమాండ్ చేశాయి.

ఎయిర్ ఇండియా మాజీ సిఎండిపై సిబిఐ కేసు



న్యూఢిల్లీ : ఎయిరిండియా మాజీ ఛైర్మన్– మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి) అరవింద్ జాదవ్, ఇతరులపై సిబిఐ బుధవారం కేసు నమోదు చేసింది. అనుచిత లబ్ధి పొందేందుకు నిబంధనలు ఉల్లంఘించారని, అక్రమ నియామకాలు చేపట్టారని ఆరోపిస్తూ సిబిఐ ఈ కేసు నమోదు చేసింది. జాదవ్‌తో పాటు మాజీ జనరల్ మేనేజర్ (మెడికల్ సర్వీసెస్) ఎల్‌పి నఖ్వా, కెప్టెన్ ఎ.కథ్‌పాలియా, కెప్టెన్ అమితాబ్ సింగ్, కెప్టెన్ రోహిత్ భాసిన్‌లపై సిబిఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. కెప్టెన్ ఎ.కథ్‌పాలియా, కెప్టెన్ అమితాబ్ సింగ్, కెప్టెన్ రోహిత్ భాసిన్‌లతో పాటు కొంత మంది జనరల్ మేనేజర్‌లకు ప్రయోజనాలు చేకూర్చే లా జాదవ్, ఇతర అధికారులు నియామకాలు చేపట్టారని ఎఫ్ఐఆర్‌లో సిబిఐ ఆరోపించింది. ఈ కేసు ప్రాథమిక విచారణను 2018 ఏప్రిల్‌లోనే ప్రారంభించారు. బుధవారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

జయలలితను దోషిగా ప్రకటించలేం : మద్రాస్ హైకోర్టు

చెన్నై : అక్రమాస్తుల కేసులో తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలితను దోషిగా నిర్ధారించలేమని మద్రాస్ హైకోర్టు బుధవారం వెల్లడించింది. జయలలితకు మెమోరియల్ నిర్మిచడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసింది. జస్టిస్ ఎం.సత్యన్నారాయనన్, పి. రాజమాణిక్యమ్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. ప్రభుత్వ ఖజానా నుండి మెమోరియల్ నిర్మాణాన్ని చేపట్టకుండా రాష్ట్ర ప్రభుత్వానికి దిశా నిర్దేశం చేయాలని కోరుతూ 'దేశీయ మక్కల్ శక్తి కచ్చి' అధ్యక్షుడు ఎంఎల్ రవి పిటిషన్ దాఖలు చేశారు. అక్రమాస్తుల కేసులో జయలలిత దోషిగా ఉన్నారని, ఆమె మెమోరియల్ కోసం ఖర్చుచేసిన మొత్తాన్ని వెనక్కు తీసుకోవాలని పిటిషనర్ కోరారు. కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఈ బెంచ్ పరిశీలించింది. అనంతరం ఆమెను దోషిగా పరిగణించడం సాధ్యం కాదని పేర్కొంది.

హిమాచల్ ప్రదేశ్‌లో భారీ వర్షాలు, మంచు

స్తంభించిన ట్రాఫిక్

సిమ్లా : హిమాచల్ ప్రదేశ్‌లో మంగళవారం కురిసిన భారీ వర్షాలు, మంచు కారణంగా బుధవారం రోడ్డు రవాణాకు తీవ్ర అంతరాయం కలిగింది. రాష్ట్రంలో జాతీయ రోడ్లతో పాటు లింక్ రోడ్లు కూడా జలమయమయ్యాయి. వందలాది మంది ప్రయాణీకులు గమ్యస్థానం చేరలేక వివిధ ప్రాంతాలలో చిక్కుకుపోయారు. ముఖ్యంగా సిమ్లాలో వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. పఠాన్ కోట్–చాంబా జాతీయ రహదారి బాగా దెబ్బతిన్నది. కిన్నూర్ జిల్లాతో ఇతర ప్రాంతాలకు అనుసంధానం తెగిపోయింది. అయితే ఎటువంటి ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం అందలేదు. రాష్ట్రంలో రెండు రోజులుగా మంచు కురుస్తుండటంతో రహదారులను మూసివేశారు. దీంతో ప్రయాణీకులు ఎక్కడివారక్కడే చిక్కుకుపోయారు. సిమ్లా జిల్లాలోని పట్టణ ప్రాంతాలైన నర్కండ, జుబ్బాల్, ఖరపథర్, రోహ్రూ, చోపాల్ రహదారులు కిన్నౌర్ జిల్లాతో అనుసంధానాన్ని కోల్పోయాయని ప్రభుత్వాధికారి ఒకరు తెలిపారు. మనాలిలో 30 సెంటీమీటర్ల మేర మంచు కురియగా, కల్పలో 39.6 సెం.మీ, ధర్మశాలలో 53 మిల్లీ మీటర్లు మంచు కురిసినట్లు నమోదయ్యింది. రాష్ట్రంలో గురువారం వరకు మంచు కురిసే అవకాశముందని భారత వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

ఎన్నికల తరువాతే ప్రధానిపై నిర్ణయం!

(మొదటి పేజీ తరువాయి)

ఆహ్వానించలేదు. ఒకవేళ ఆహ్వానించి ఉంటే వెళ్లాలా వద్దా అనేది నిర్ణయం తీసుకునే వాళ్లం. బెంగాల్లో ప్రజాస్వామ్యం ఖూనీ చేస్తూ, దేశంలోని మిగతా ప్రాంతాల్లో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతున్నట్లు మీరు పోజు పెట్టలేరు. బిజెపి, టిఎంసిలు రెండూ మతోన్మాదాన్ని పెంచిపోషించడంలో పోటీ పడుతున్నాయి. బంగ్లాదేశ్, మన్మాయర్‌కు సరిహద్దు రాష్ట్రంగా ఉన్న బెంగాల్లో ఈ రకమైన మతతత్వ ధోరణి దేశ సమైక్యత, సమగ్రతలకు పెను ముప్పు తెచ్చిపెట్టనుంది. ముందుకు సాగేందుకు ఉన్న మార్గం ఒక్కటే. టిఎంసిని ఓడించి బెంగాల్‌ను, బిజెపిని ఓడించి దేశాన్ని కాపాడుకోవడం ఆ మార్గం.

- **కానీ, ప్రతిపక్షాల ఐక్యత మాటేంటి?**

రాష్ట్రానికి, రాష్ట్రానికి ఇది మారుతూ ఉంటుంది. మేం తీసుకున్న నిర్ణయాన్ని మిగిలిన లౌకిక పార్టీలన్నీ అనుసరిస్తే బిజెపి వ్యతిరేక ఓట్లను ఒకే ముద్దగా ఉండేలా చూడొచ్చు.

- **రానున్న ఎన్నికల్లో శబరిమల వివాదం పార్టీ అవకాశాలను దెబ్బతీస్తుందని సిపిఎంలో చాలా మంది భావిస్తున్నారు. మీరు అభిప్రాయమేంటి?**

మహిళా కుడ్యం కోసం 55 లక్షల మంది మహిళలు కేరళ రాష్ట్ర వ్యాప్తంగా కదలి రావడం చారిత్రాత్మకం.గతంలో ఎప్పుడూ జరగని సంఘటన. ఇంత మంది మహిళలు రోడ్డు మీదకు వచ్చారంటనే కేరళ ప్రజల అభిప్రాయమేంటో అర్థమౌతోంది. రానున్న లోక్‌సభ ఎన్నికల్లోనూ, ఆ తర్వాతి అసెంబ్లీ ఎన్నికల్లోనూ పార్టీకి అనుకూలమైన ఫలితాలు వస్తాయనే మేము భావిస్తున్నాను.

- **శబరిమలలో మహిళల ప్రవేశంపై నిషేధం విధించాలని కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది. ఓట్ల కోసం మీరు, బిజెపి పోరాడుకుంటే కాంగ్రెస్ విజేతగా నిలిచే అవకాశం లేదంటారా?**

కాంగ్రెస్ వైఖరి దురదృష్టకరం. మేం ఖండించాం కూడా. బిజెపికి, మోడీ ప్రభుత్వానికి సంబంధించినంత వరకు త్రిపుల్ తలాక్ బిల్లు విషయంలో వాళ్లు మహిళా హక్కుల గురించి మాట్లాడతారు. అదే శబరిమల దగ్గరకు వచ్చేసరికి సంప్రదాయాలను పాటించాలని డిమాండ్ చేస్తున్నారు. త్రిపుల్ తలాఖ్ విషయంలో ముస్లిం మత పెద్దలు కూడా ఇదే వాదన చేస్తున్నారు.

కానీ కాంగ్రెస్ పార్టీ తప్పుడు నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర స్థాయిలో ఒకలా, అఖిల భారత స్థాయిలో మరోలా ద్వంద్వ వైఖరిని కాంగ్రెస్ కలిగి ఉండడం సరైంది కాదు. యుపిఎఛైర్మన్ , కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇద్దరూ తాము సమానత్వానికి, లౌకికత్వానికి కట్టుబడ్డామని స్పష్టం చేశారు. ఆ పార్టీ వైఖరిలో చాలా వైరుధ్యం కన్పిస్తోంది. ప్రజలు వారి ద్వంద్వ వైఖరిని గమనిస్తున్నారని నేను భావిస్తు న్నాను. ఈవిధమైన వైఖరితో వారు ఎన్నికల్లో ఎటువంటి లబ్ధిని పొందలేరు. మరోవైపు వారి లౌకిక ఓటును కోల్పోనున్నారు.

- **ఆశ్చర్యకంగా సిపిఎం ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లను సమర్థించింది. ఎందుకని?**

మండల్ ఆందోళన కాలంలో ఈ అంశం తెరపైకి వచ్చింది. ఓబిసిలకు సంబంధించి ఆర్థిక కొలబద్దను ప్రామాణికంగా తీసుకోవాలని మా పార్టీ ఒక్కటే చెప్పింది. ఎస్‌సి,ఎస్‌టిలకు సంబంధించి రాజ్యాంగం చాలా స్పష్టంగా పేర్కొంది. అందులో ఎలాంటి వివాదానికి తావే లేదు. కాబట్టి దానిపై రాజీకి ఆస్కారం లేదు. ఓబిసిల విషయంలో రిజర్వేషన్ ప్రయోజనాలు అసలైన లబ్ధిదారులకు లభించేలా చూడాలంటే వీటికి ఆర్థిక కొలబద్ద ఉండాలని చెప్పిన ఏకైక పార్టీ మాదే. ఇతర వామపక్ష పార్టీలు కూడా దీనికి సుముఖత చూపలేదు. ఈ విషయంలో మాకు ఒకే ఒక మిత్రపక్షం సుప్రీంకోర్టు, క్రీమీలేయర్ ఫార్ములాను రూపొందించాలని అది చెప్పింది. ఆ సమయంలో రిజర్వేషన్ లేని కేటగిరిల్లోని ఆర్థికంగా వెనుక బడిన వారి పరిస్థితి ఏంటనే ప్రశ్న ఉత్పన్నమయింది. వారికి కూడా ప్రయోజనం కల్పించాలని మేం చెప్పాం. కానీ ఇప్పుడు మోడీ ప్రభుత్వం కోటా బిల్లు తీసుకొచ్చిన తీరును మేము విమర్శిస్తున్నాము. ఈ కోటా బిల్లు వల్ల ప్రయోజనం పొందే దెవరు? అగ్రవర్ణాల్లో పేదలను ఎలా గుర్తించాలి అనే దానిపై కనీస చర్చ గానీ, సంప్రదింపులు గానీ జరపలేదు. ఇది కేవలం ఎన్నికల ప్రయోజనం కోసం ప్రవేశపెట్టిందనేది స్పష్టం. కానీ అగ్రవర్ణాల్లో పేదలకు రిజర్వేషన్లు కల్పించాలనే ప్రాథమిక భావనను పరిగణనలోకి తీసుకోవాలన్నది మా అభిప్రాయం.

- **దీనిపై సమర్థవంతంగా చట్టాన్ని తెచ్చేందుకు మీరు ప్రతిపాదిస్తున్న సవరణలు ఏంటి?**

రిజర్వేషన్లకు అర్హులెవరో గుర్తించేందుకు వెంటనే ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. ఇది ఏదో ఒక సెక్షన్‌కే పరిమితం చేయకూడదు. అన్ని సెక్షన్లలోని పేదలందరికీ వర్తింపజేయాలి. పేదలను ఎలా నిర్వచిస్తారు? ముందుగా పేదలు ఎంతమంది ఉన్నారో లెక్కించాలి. మొత్తం ఈ చట్టం గురించి బిజెపి పరిభాషలోనే చెప్పాలంటే ఇదో 'జుమ్లా', ఉద్యోగాలను సృష్టించకుండా చేపట్టే ఇటువంటి ప్రక్రియకు అర్థం వుండదు. ప్రైవేట్ రంగంలోనూ ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసిల తోపాటు అగ్రవర్ణాల పేదలకు కూడా రిజర్వేషన్లు కల్పించాలనేది మా డిమాండ్. ప్రభుత్వం అత్యంత నిర్లక్ష్యంగా అన్నిటినీ ప్రయివేటీకరించుకుంటూ పోతోంది. ప్రతిదీ అవుట్‌సోర్సింగ్‌కు ఇస్తోంది. ప్రభుత్వ ఉద్యోగాలు బాగా కుదించుకుపోతున్నాయి. ఉద్యోగాలే లేకుంటే ఈ రిజర్వేషన్లు ఉండి ఏం లాభం?

- **కులం ఆధారంగా ఇచ్చే రిజర్వేషలన్నింటిని పక్కన పెట్టి ఆర్థిక ప్రాతిపదిక ఆధారంగానే రిజర్వేషన్లు ఒక్కటే ఉండాలనేది మీ అభిప్రాయమా?**

కాదు. కులం ఆధారంగా రిజర్వేషన్లు రాజ్యాంగంలో పొందుపరచబడ్డాయి రిజర్వేషన్ల ఉద్దేశ్యం సామాజిక తరగతులను భాగస్వాములను చేయడమే. అంతే కానీ, పేదరిక నిర్మూలన చర్యగా దీనిని చూడరాదు. ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్లు కొనసాగుతున్నప్పటికీ మన లక్ష్యాలను సాధించలేకపోయాం. మేం రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదు. ఆర్థికంగా వెనకబడిన తరగతులను కూడా వారితోపాటు చేర్చాలనేది మా వైఖరి.

- **2019లో సిపిఎం ఎన్ని లోక్‌సభ స్థానాలు గెలుచుకోగలదో చెప్పగలరా?**

మేము పోటీ చేసే ప్రతి సీటులో గెలుపుకోసం పోరాడతాం. మేము ఎక్కడ గట్టిగా పోటీ ఇవ్వగలం అని అనుకుంటామో ఆ స్థానాల్లోనే పోటీ చేస్తాం.

- **వివిధ రాష్ట్రాల్లో పొత్తుల కోసం మీరు ప్రయత్నిస్తున్నారు. ఎన్ని సీట్లలో మీరు పోటీ చేయబోతున్నారో చెప్తారా?**

ఏ మేరకు అవగాహనలు కుదురుతాయనేదానిపైనే ఇది ఆధారపడి ఉంది. బీహార్, మహారాష్ట్రతోపాటు ఇతర రాష్ట్రాల్లో చర్చలు జరుగుతున్నాయి. సాధారణంగా మేం 60 సీట్లలో పోటీ చేస్తాం. ఈసారి కూడా దాదాపు అదే సంఖ్యలో పోటీ చేయవచ్చు.

- **పశ్చిమబెంగాల్, త్రిపురలో మీ పార్టీ పరిస్థితి ఏలా ఉంటుంది?**

చూద్దాం. త్రిపురలో పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ఇండిజీనియస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర(ఐపిఎఫ్‌టి) బిజెపికి ఎడంగా జరుగుతోంది. బిజెపి, ఐపిఎఫ్‌టి ఎంత అవకాశవాదంతో కలిశాయో చాలామంది ఆదివాసీలు అర్థం చేసుకుంటున్నారు. గిరిజనులకు ప్రత్యేక రాష్ట్రం ఇస్తామని బిజెపి హామీనిచ్చింది. కానీ ఇప్పుడు మాట తప్పింది. రాష్ట్రంలో పరిస్థితి దిగజారుతోంది. మాకు అసెంబ్లీ ఫలితాల కన్నా మెరుగైన ఫలితాలు వచ్చే అవకాశముంది. బెంగాల్లో మొత్తంగా చూస్తే టిఎంసిని ఓడించి బెంగాల్‌ను, బిజెపిని ఓడించి భారత్‌ను కాపాడాలనే మా లక్ష్యానికి అనుగుణంగా ముందుకు సాగుతున్నాం. మాకు పెరుగుతున్న మద్దతును ఓట్లుగా మలుచుకోవడమెలా అన్నదే మా ముందున్న సమస్య. మేము ఎన్నికల్లో ఓడిపోవడానికి మా ప్రజా పునాది మాకు ఓటు వేయకుండా అడ్డుకోవడం ఒక కారణం. మా కేడర్‌పై భౌతిక దాడులు చేస్తుండడంతో వారు బయటకు వచ్చి ఓటేసే పరిస్థితి ఉండడం లేదు. బెంగాల్లో శాంతియుత, స్వేచ్ఛా వాతావరణంలో ఎన్నికలు జరిగితే మేం పుంజుకునేందుకు మంచి అవకాశాలున్నాయి.

- **లోక్‌సభ ఎన్నికల్లో కొత్త ప్రాంతాలకు విస్తరించ వచ్చని సిపిఐ(ఎం) భావిస్తుందా?**

కచ్చితంగా. మా బద్ధ శత్రువులు సైతం అంగీకరించే విషయం ఏమంటే ప్రజలను ఉద్యమాల్లోకి కదిలిస్తున్నదీ, సమీకరిస్తున్నది వామపక్షాలు మాత్రమే. కొత్త ప్రాంతాలకు విస్తరించడానికి ఇది తోడ్పడుతుంది. పోరాటాల్లో కలిసొచ్చిన వీరిని ఇప్పుడు ఓట్ల రూపంలోకి మార్చుకోవాల్సి ఉంది. సంప్రదాయంగా మాకు అంతగా పట్టు లేని మహారాష్ట్ర, రాజస్థాన్ లాంటి రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాం, అక్కడ మేం కొత్త స్థానాల్లో గెలిచే అవకాశం ఉంది. బెంగాల్, కేరళ, త్రిపురలో కాకుండా మిగతా ప్రాంతాల్లో మా అభ్యర్థుల అశ్చర్యకర విజయాలను మీరు చూడవచ్చు.

- **ఒక వేళ యుపిఎ లాంటి పరిస్థితి ఉంటే వామపక్షాలు పాత్ర ఎలా ఉంటుంది**

అంతిమంగా ఎటువంటి సంకీర్ణం అవిర్భవిస్తుందనే దానిపైన ఆధారపడి ఉంటుంది. దేశంలో ప్రత్యామ్నాయ లౌకిక ప్రభుత్వ ఏర్పాటుకు, దాని సుస్థిరతకు వామపక్షాలు కచ్చితంగా తమ వంతు పాత్ర పోషిస్తాయి.

- **మీరు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభుత్వంలో భాగంగా ఉంటే దేశద్రోహం చట్టం, ఆధార్ చట్టాలను ఉపసంహరిస్తారా?**

ప్రభుత్వ ఏర్పాటులో వామపక్షాలు కీలక పాత్ర పోషించినప్పుడు ప్రజలకు మేలు జరిగే చాలా అంశాలను మేం తీసుకురాగలిగాం. సమాచార హక్కు చట్టం, విద్యా హక్కు, ఆహారభద్రత హక్కు, ఉపాధి హామీ చట్టం ఇలా చాలా ఉన్నాయి. ప్రభుత్వ ఏర్పాటులో మా పాత్ర కీలకంగా ఉంటే మా పలుకుబడితో తప్పుడు పనులను చాలావరకు అడుకుంటాం. దేశ ద్రోహ చట్టం పోవాల్సిందే. ఆధార్ విషయంలో వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్ల కూడదు. వ్యక్తిగత గోప్యతకు భంగం కలగకుండా చూసేందుకు చట్టపరంగా కొన్ని చర్యలు చేపడతాం.

- **కమ్యూనిస్టు సిద్ధాంతం ప్రాసంగికతను కోల్పోతుందనే అభిప్రాయం ఉంది కదా?**

ప్రపంచంలో రెండో అతిపెద్ద శక్తి ఏది? చైనా. అక్కడి అధికార పార్టీ మార్క్సిజం, లెనినిజం పునాదులపై ఆధారపడి పని చేస్తోంది. చైనా ఇంతటి విజయాలు సాధించిందంటే కమ్యూనిజం ఇప్పటికీ ప్రాసంగికత కలిగివుందనే కదా అర్థం. రెండో అంశం సోషలిస్టేతర దేశాల్లో అమెరికా పెత్తనానికి వ్యతిరేకంగా ఎదురొడ్డి పోరాడుతున్నది వామపక్షాలు, వామపక్ష స్ఫూర్తితో నడిచే ఉద్యమాలే.

ఫ్రాన్స్‌లో అధ్యక్షుడు మాక్రాన్ దిగివచ్చి కార్మికుల డిమాండ్లను అంగీకరించాల్సి వచ్చింది. మరోవైపున నయా ఫాసిస్టు శక్తుల రూపంలో మితవాద శక్తులు బలపడుతున్నాయి. అవి జాతివివక్ష, భయోత్పాతాన్ని సృష్టిస్తూ నయా ఫాసిస్టు రూపం తీసుకుంటున్నాయి. ఇంకోవైపు వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమాలు సాగుతున్నాయి. ఇది ఒక రాజకీయ పోరాటం. ప్రజల్లో పెరుగుతున్న పోరాటాలను పెట్టుబడిదారీ విధానానికి రాజకీయ ప్రత్యామ్నాయంగా మారకుండా నియంత్రించేందుకు మితవాదశక్తులు ప్రయత్నిస్తున్నాయి. ఇవన్నీ ఏం తెలియజేస్తున్నాయి. కమ్యూనిజం వన్నె ఎంతమాత్రమూ తగ్గలేదు. పైగా మరింత ప్రాధాన్యత సంతరించుకుంటోంది. మన దేశంలో ఈ దిశగా పోరాటం కొనసాగుతోంది.

అమెరికాలో ఉగ్రదాడికి కుట్ర

భగ్నం చేసిన పోలీసులు

వాషింగ్టన్ : అమెరికాలో విద్వేష భావాలు పెరిగిపోయాయి. దేశాధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ముస్లింలు, సిక్కులపై దాడులు అధికమయ్యాయి. న్యూయార్క్ నగరంలో ముస్లింల జనాభా అధికంగా ఉన్న ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకొని పేలుళ్లకు కుట్ర పన్నిన నలుగురు యువకులను పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి భారీ ఎత్తున పేలుడు పదార్థాలు, తుపాకులు, రైఫిల్స్, మారణాయుధాలు స్వాధీనం చేసుకొని నిందితుల కుట్రను భగ్నం చేశారు. ఎస్పీ పాట్రిక్ ఫెలాన్ వెల్లడించిన వివరాల ప్రకారం...రోచెస్టర్ ప్రాంతానికి చెందిన బ్రియాన్ కొలానెరి (20), ఆండ్రీవ్ క్రీసెల్ (18), విన్సింట్ వెట్రోమైల్ (19)తో పాటు మరో 16ఏండ్ల యువకుడు న్యూయార్క్‌లోని ముస్లింలు జనాభా అధికంగా ఉన్న ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకొని పేలుళ్లకు కుట్రపన్నారు. ఇస్లాం మతం పట్ల విద్వేష భావాల కారణంగానే తాము దాడులకు కుట్రపన్నినట్టు ప్రాథమిక విచారణలో నిందితులు అంగీకరించారని ఎస్పీ తెలిపారు.



ప్రదర్శన

అమెరికాలో నల్లజాతివారిపట్ల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ స్మృత్యార్థం ప్రతియేటా మాదిరిగానే ఈ ఏడాది జనవరి మూడవ సోమవారం పరేడ్ నిర్వహించారు.

షట్‌డౌన్‌కు నేడో రేపో తెర

సరిహద్దు గోడ బిల్లుకు ఓకే చెప్పనున్న సెనేట్

వాషింగ్టన్: నెల రోజులకు పైగా కొనసాగుతున్న ప్రభుత్వ షట్‌డౌన్‌కు ఎట్టకేలకు తెరపడనుంది. ఈ ప్రతిష్టంభనకంతటికీ మూలమైన ట్రంప్ సరిహద్దు గోడ బిల్లుకు గురువారం ఆమోదం తెలపనున్నట్లు సెనేట్ నాయకులు ప్రకటించారు. సెనేట్‌లో మెజార్టీ నాయకుడు మిచ్ మెక్‌కానెల్ (రిపబ్లికన్ పార్టీ), సెనేట్ మైనార్టీ నాయకుడు చుక్ షూమర్ (డెమొక్రాటిక్ పార్టీ) బుధవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ, వివిధ ప్రభుత్వ శాఖలకు నిధులు మంజూరుకు సంబంధించిన బిల్లుతోబాటు, అధ్యక్షుడు ట్రంప్ మంకు పట్టు పట్టిన 507 కోట్ల డాలర్ల సరిహద్దు గోడ బిల్లుకు కూడా ఆమోదం తెలపడానికి తాము సిద్ధంగా వున్నామని చెప్పారు. సరిహద్దు గోడకు ఆమోదం తెలిపితే, చిన్నప్పుడే అమెరికాలో వచ్చి స్థిరపడిన అక్రమ వలస వాసులపై మూడేళ్లపాటు ఎటువంటి చర్యలు లేకుండా చూస్తామని ట్రంప్ ఇచ్చిన హామీ మేరకు డెమొక్రాట్లు ఈ రాజీకి అంగీకరించారు. ఈ బిల్లులు ఆమోదం పొందితే గత నెల రోజులుగా నిధులు స్తంభించిపోవడంతో తలెత్తిన ప్రభుత్వ పాక్షిక మూసివేతకు తెర పడనుంది. ట్రంప్ తొలుత ప్రకటించిన సరిహద్దు గోడకు బదులు స్టీల్ స్లాట్స్, ముళ్ల కంచెకు ఈ ప్రాజెక్టును పరిమితం చేస్తున్నానని చెప్పారు. అంతకుముందు డెమొక్రాట్లు సుదీర్ఘంగా ప్రభుత్వ షట్ డౌన్ కొనసాగడానికి ట్రంపే కారణమని విమర్శించారు. బందీలను గావించి బేరసారాలాడే ఎత్తుగడను ట్రంప్ అనుసరించారని, చివరికి తన అధ్యక్ష భవనాన్ని కూడా ఆయన బందీగావించారని డెమొక్రాట్లు పేర్కొన్నారు.

లాస్‌ఏంజెలెస్‌లో ముగిసిన టీచర్ల సమ్మె

వాషింగ్టన్ : లాస్‌ఏంజెలెస్ నగరంలో ఉపాధ్యాయ సంఘాలు గత 9 రోజుల నుంచి చేపడుతున్న సమ్మె బుధవారం ఎట్టకేలకు ముగిసింది. 1240 పాఠశాలలు పున: ప్రారంభమయ్యాయి. ఆరు శాతం వేతనాల పెంపు, పరిమితమైన విద్యార్థులతో చిన్న తరగతి గదులు, చిన్నారుల సంరక్షణార్థం ఆయాలను, నర్సులను ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో లాస్‌ఏంజెలెస్ జిల్లాలో పనిచేస్తున్న 34వేల మంది టీచర్స్ తరగతులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. దీంతో, ఆరు లక్షల మంది చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు పాఠశాలలు ప్రత్యామ్నాయంగా ఉపాధ్యాయులను ఏర్పాటు చేసుకున్నప్పటికీ పలు విద్యాసంస్థలు చిన్నారులు సైతం తరగతులను స్వచ్ఛందంగా బహిష్కరించి టీచర్లకు మద్దతుగా నిలవడం గమనార్హం. టీచర్ల సమ్మెకు యూనియన్ ప్రెసిడెంట్ అలెక్స్ కాప్యూటో పెరల్ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ డిమాండ్లకు స్కూల్ యాజమాన్యాలు అంగీకరించడంతో సమ్మె విరమించామని అన్నారు. లాస్‌ఏంజెలెస్‌లోని పాఠశాలల్లో 6లక్షల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు.

అమెరికా కుట్రలను తిప్పికొడతాం...

వెనిజులా ఉపాధ్యక్షుడి హెచ్చరిక



కారకాస్‌లో మదురో మద్దతుదారుల ప్రదర్శన

కారకాస్: వెనిజులాలో మదురో ప్రభుత్వానికి వ్యతిరేకంగా అమెరికా ఉపాధ్యక్షుడు మైక్‌పెన్స్ నేతృత్వంలో జరుగుతున్న కుట్రలను తాము దీటుగా తిప్పికొడతామని వెనిజులా ఉపాధ్యక్షుడు డెల్సీ రోడ్రిగ్జ్ హెచ్చరించారు. అధ్యక్షుడు నికొలస్ మదురోకు వ్యతిరేకంగా ప్రతిపక్షం తలపెట్టిన నిరసన ప్రదర్శనను తాను సమర్థిస్తున్నట్లు పెన్స్ పంపిన ఒక వీడియో సందేశంపై ఆయన తీవ్రంగా స్పందించారు. ప్రస్తుతం సస్పెన్షన్‌లో వున్న జాతీయ అసెంబ్లీకి స్వయంప్రకటిత అధ్యక్షుడిగా చెప్పుకుంటున్న ప్రతిపక్ష ఎంపి జువాన్ గుయాడోకు పెన్స్ ఈ వీడియో సందేశాన్ని పంపారు.

పెన్స్ వెనిజులాలో అస్థిరతను, హింసను ప్రోత్సహిస్తున్నారని వెనిజులా సమాచార మంత్రి జార్జ్ రోడ్రిగ్జ్ చేసిన విమర్శను సమర్థిస్తూ ఉపాధ్యక్షుడు డెల్సీ రోడ్రిగ్స్ ఈ వ్యాఖ్యలు చేశారు. పెన్స్‌కు వేరే పనేమీ లేకపోవటంతోనే ఆయన తరచు వెనిజులా వచ్చి వెళ్తూ ఇక్కడి ప్రతిపక్షాల కుట్రకు ఆజ్యం పోస్తున్నారని డెల్సీ రోడ్రిగ్జ్ మండిపడ్డారు. వెనిజులా అంతర్గత వ్యవహారాలలో పెన్స్ జోక్యాన్ని తాము సహించబోమని ఆయన స్పష్టం చేశారు.

అంతకు ముందు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇక్కడి ప్రతిపక్ష నేత, నేషనల్ అసెంబ్లీ ప్రెసిడెంట్ జువాన్ గ్యూడో బుధవారం భారీ ర్యాలీ తీశారు. ఈ ర్యాలీని ఉద్దేశించి జువాన్ గ్యూడో మాట్లాడారు. దేశాధ్యక్షుడిగా కొనసాగే అర్హతలు మదురోకు లేవంటూ ఆరోపించారు. మదురోను గద్దె దించేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు. మదురోకు వ్యతిరేకంగా గ్యూడో తీసిన ర్యాలీని అధికార సోషలిస్ట్ పార్టీ తీవ్రంగా ఖండించింది.

పోటా పోటీగా ప్రదర్శనలు

వెనిజులాలో మార్కోస్ పెరెజ్ జిమెనెజ్ నియంతృత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు జరిగి 61 ఏళ్లు అయిన సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం వెనిజులా యునైటెడ్ సోషలిస్టు పార్టీ ఆధ్వర్యాన పెద్దయెత్తున ప్రదర్శన నిర్వహించారు. ప్రతిపక్షాల్లో కొన్ని సెక్షన్లు ఈ ప్రదర్శనకు మద్దతు పలికాయి. మదురో ప్రభుత్వాన్ని అస్థిర పాల్జేసేందుకు దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసేందుకు దేశంలో మితవాద శక్తులు, అమెరికా సామ్రాజ్యవాదులు సాగిస్తున్న కుట్రలను దీటుగా తిప్పికొట్టాలని యునైటెడ్ సోషలిస్టు పార్టీ నేతలు పిలుపునిచ్చారు. మాజీ అధ్యక్షుడు హ్యూగో ఛావెజ్ విగ్రహం పై రాళ్లు విసిరిన ప్రతిపక్షాల చర్యను వారు ఖండించారు.

గత ఇజ్రాయిల్‌ను కట్టడి చేయకుంటే టెల్ అవీవ్‌పై దాడి..!

ఐరాస భద్రతా మండలికి సిరియా హెచ్చరిక

డెమాస్కస్ : ఇజ్రాయిల్‌ను కట్టడి చేయకపోతే ఆత్మరక్షణకు హక్కును వినియోగించుకొని టెల్ అవీవ్ విమానాశ్రయంపై దాడి చేస్తామని సిరియా ఐరాస భద్రతా మండలిని హెచ్చరించింది. తమ దేశ గగనతలంలోకి తరచు చొచ్చుకు వస్తున్న ఇజ్రాయిల్ వైమానిక దళాన్ని వెంటనే కట్టడి చేయాలని సిరియా డిమాండ్ చేసింది. గత కొన్నేళ్లుగా ఇజ్రాయిల్ విమానాలు సిరియా గగనతలంలోకి చొరబడి పౌర ఆవాసాలతో పాటు డెమాస్కస్ అంతర్జాతీయ విమానాశ్రయంపై చేస్తున్న దాడులతో విసిగిపోతున్న సిరియా ప్రభుత్వం ఈ మేరకు హెచ్చరిక చేసినట్లు పరిశీలకులు చెబుతున్నారు. సిరియా, అరబ్ భూభాగాలపై తరచు దురాక్రమణలకు పాల్పడుతున్న ఇజ్రాయిల్‌ను భద్రతా మండలి కట్టడి చేయాలని ఐరాసలో సిరియా శాశ్వత ప్రతినిధి డా.బషర్ అల్ జాఫరీ డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్ డెమాస్కస్ విమానాశ్రయంపై దాడులు చేసిన తరహాలోనే తాము కూడా టెల్ అవీవ్ విమానాశ్రయంపై దాడులతో దీటుగా స్పందిస్తామని ఆయన అన్నారు. సిరియా సార్వభౌమత్వాన్ని ఉల్లంఘిస్తున్న ఇజ్రాయిల్‌ను కట్టడి చేసేందుకు తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన భద్రతా మండలికి విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ చట్టనిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఇజ్రాయిల్‌ను ఫ్రాన్స్, బ్రిటన్, అమెరికా వంటి దేశాలు సమర్థిస్తున్న తరుణంలో అంతర్జాతీయ చట్ట నిబంధనల ప్రకారం శాంతి భద్రతలను కాపాడుకునేందుకు దీటుగా స్పందించటం తమ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.

యూదు సంస్థ చర్యలను ఖండించిన పాలస్తీనా కమ్యూనిస్టు పార్టీ

జెరూసలేంలో యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ (పాలస్తీనా శరణార్థుల కోసం ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో పనిచేసే సహాయక సంస్థ) పాఠశాలలను మూసివేయాలని యూదు సంస్థ తీసుకున్న నిర్ణయాన్ని పాలస్తీనా కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా ఖండించింది. పాలస్తీనియన్ల ప్రయోజనాలు, హక్కులకు వ్యతిరేకంగా తీసుకున్న ఈ చర్య వల్ల తీవ్ర ఉద్రిక్తతలు చెలరేగుతాయని పేర్కొంది. పాలస్తీనియన్లు వెనక్కి తిరిగి వారి మాతృభూమికి వచ్చే హక్కును, జెరూసలేంను యూదుల నగరంగా తీర్చిదిద్దడానికి జరిగే యత్నాలను ఈ చర్య అడ్డుకుంటుందని పేర్కొంది. ఆక్రమిత జెరూసలేంలో పాలస్తీనియన్ల ఉనికికి ప్రమాదం వాటిల్లేలా ఈ నిర్ణయం వున్నందున దీన్ని వ్యతిరేకించాల్సిందిగా పాలస్తీనా కమ్యూనిస్టు పార్టీ కార్యాలయం జెరూసలేంలోని పాలస్తీనియన్లకు పిలుపునిచ్చింది. సిరియా భూభాగంపై యూదుల దురాక్రమణను కూడా పాలస్తీనా కమ్యూనిస్టు పార్టీ ఖండించింది. ఈనాడు అరబ్ ప్రపంచం చవిచూస్తున్న విభేదాలను ఈ దురాక్రమణ క్రమం ప్రతిఫలిస్తోందని పేర్కొంది. దారుణమైన దురాక్రమణపై తీవ్రంగా స్పందించిన సిరియన్ అరబ్ సైన్యానికి పాలస్తీనా కమ్యూనిస్టు పార్టీ అభినందనలు తెలియచేసింది.

2019-2020లో ప్రపంచ ఆర్థిక వృద్ధి రేటు 3శాతమే!

ఐరాస నివేదిక వెల్లడి

ఐక్యరాజ్య సమితి : ప్రపంచ ఆర్థిక వృద్ధి రేటు మళ్లీ ఊపందుకుంటోందని ప్రచారం మధ్య వచ్చే రెండేళ్లలోను ప్రపంచ వృద్ధి రేటు 3శాతం దగ్గరే ఉంటుందని ఐక్యరాజ్య సమితి స్పష్టం చేసింది. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, అవకాశాలు, 2019 శీర్షికతో ఐక్యరాజ్యసమితి సోమవారం నాడిక్కడ వార్షిక నివేదికను విడుదలజేసింది. 2018లో 3.1శాతం మేర వృద్ధిరేటు పెరిగినట్లు అంచనా వేశారు. కానీ ఇది ఈ ఏడాది,వచ్చే ఏడాదిల్లో 3శాతం వద్దే వుండగలదని ఆ నివేదిక తెలిపింది.

అమెరికాలో వృద్ధి రేటు ఈ ఏడాది 2.5శాతమే వుండగలదని అంచనా వేశారు. 2020లో అయితే కేవలం 2శాతమే ఉండొచ్చని నివేదిక అంచనా వేసింది. 2018లో ఆర్థిక ఉద్దీపన చర్యల పర్యవసానమే ఇది అని పేర్కొంది. యురోపియన్ యూనియన్‌కు సంబంధించి వృద్ధిరేటు 2శాతం నిలకడగా వుండగలదని అంచనా. అయితే బ్రెగ్జిట్ ప్రభావంతో సహా ఇతర రకాల ముప్పులు తగ్గే అవకాశం వున్నా అభివృద్ధి రేటు అంచనాలు పెరగలేదు. చైనాలో వృద్ధిరేటు 2018లో 6.6శాతం వుండగా, ఈఏడాది అది 6.3శాతానికి తగ్గింది. విధానపరమైన మద్దతు వుండడం వల్ల పాక్షికంగా వాణిజ్య ఉద్రిక్తతల ప్రతికూల ప్రభావం తగ్గిందని నివేదిక పేర్కొంది. బ్రెజిల్, నైజీరియా, రష్యా వంటి దేశాలతో సహా పెద్ద ఎగుమతులు జరిపే దేశాల వృద్ధి రేటు ఒక మోస్తరుగా వుండగలదని అంచనా వేశారు. అయితే ఆర్థిక వృద్ధి అనేది అంతటా ఒకేలా లేదని, ఎక్కడైతే పూర్తి స్థాయిలో అవసరమో అక్కడ లక్ష్యాన్ని చేరుకోలేక పోయిందని నివేదిక పేర్కొంది. ఆఫ్రికా, పశ్చిమాసియా, లాటిన్ అమెరియా, కరేబియా ప్రాంతాల్లో 2019లో తలసరి ఆదాయాలు స్తంభించిపోవడమో లేదా పెరగమో జరగవచ్చని నివేదిక పేర్కొంది.

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ప్రియాంకా గాంధీ

స్థానాలు కలిగి ఉండటంతో పాటు కేంద్రంలో అధికారం చేపట్టడంలో ఈ రాష్ట్రం కీలకం కావడంతో ఒక ఇన్‌ఛార్జి సరిపోరని ప్రియాంకను తూర్పు విభాగానికి ఇన్‌ఛార్జిగా నియమించారని, రాష్ట్రంలో ఎక్కువస్థానాలలో విజయం సాధించేందుకు కాంగ్రెస్ సన్నద్ధమౌతున్నట్లు పరిశీలకులు భావిస్తున్నారు. అలాగే వచ్చే ఎన్నికలలో ప్రధాని మోడీతో పాటు పాలక బిజెపిని తీవ్రంగా దెబ్బతీసేందుకు కాంగ్రెస్ వ్యూహాలు రచిస్తోంది. యుపి పశ్చిమ విభాగానికి జ్యోతిరాదిత్య సింధియా ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించనున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా కెసి.వేణుగోపాల్‌ను, హర్యానా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా గులాం నబీఆజాద్‌ను నియమిస్తున్నట్లు అధిష్టానం ప్రకటించింది. కాగా, రెండు రోజుల పాటు రాహుల్ తన నియోజకవర్గ పర్యటన చేపట్టనున్న సందర్భంలో ప్రియాంకను ఎంపిక చేసినట్లు వార్త వెలువడడం విశేషం. అఖిలేష్, మాయావతిల పొత్తు నేపథ్యంలో యుపిలో అత్యధిక సీట్లను కైవసం చేసుకునేందుకు క్రియాశీల రాజకీయాల్లోకి ప్రియాంకను రంగంలోకి దించినట్లు తెలుస్తోంది. ప్రియాంకా, జ్యోతిరాదిత్యల నియామకం ప్రస్తుత ఎన్నికలలో విజయం సాధించడం కోసం మాత్రమే కాదని, రాష్ట్రంలో కాంగ్రెస్ విధానాలను ముందుకు తీసుకెళ్లేందుకు వారిని నియమించినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో ప్రస్తుతం చేపట్టిన నియామకాలు, వ్యూహాలతో బిజెపి భయపడుతోందని రాహుల్ అన్నారు. కాగా, ప్రియాంక భర్త అయిన రాబర్ట్ వాద్రా ప్రియాంకకు అభినందనలు తెలుపుతూ నీ జీవితంతో ప్రతి దశలోనూ ఎల్లప్పుడూ అండగా వుంటానని ట్వీట్ చేశారు. హర్యానా, రాజస్తాన్‌లలో అవినీతి, భూ కుంభకోణాలలో వ్యాపారవేత్త అయిన వాద్రాను లక్ష్యంగా చేసుకుని కేంద్ర ప్రభుత్వం సిబిఐతో విచారణ చేయిస్తున్న సంగతి తెలిసిందే. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌కు జ్యోతిరాదిత్య కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తరప్రదేశ్ తూర్పు విభాగాన్ని బలోపేతం చేసేందుకు తీసుకున్న నిర్ణయంగా ఆయన పేర్కొన్నారు. 'ఇది చాలా తెలివైన నిర్ణయమని' కాంగ్రెస్ నేత ప్రియాంకా చతుర్వేది ట్వీట్ చేశారు. అలాగే నూతనంగా బాధ్యతలు చేపట్టిన వేణుగోపాల్, సింధియా, గులాంనబీ ఆజాద్‌లకు చతుర్వేది అభినందనలు తెలిపారు. నూతనంగా నియమితులైన వారందరికి శుభాకాంక్షలు అని కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ట్వీట్ చేశారు. ఈ ప్రకటన రాష్ట్రంలోనే కాక దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పునరుజ్జీవానికి తోడ్పడుతుందని కాంగ్రెస్ నేత రాజీవ్ శుక్లా అన్నారు. కాంగ్రెస్ ప్రకటనపై బిజెపి స్పందించింది. కాంగ్రెస్ తీసుకున్న ఈ నిర్ణయంతో రాహుల్ గాంధీ విఫలమైనట్లు, పార్టీ నైరాశ్యంలో ఉన్నట్లు వెల్లడవుతోందని అన్నారు. రాహుల్‌కు ప్రియాంక 'ఊతకర్ర' వంటివారని, ఆ కుటుంబంలో వ్యక్తులు తప్ప ఇతరులకు ప్రాధాన్యం ఇవ్వరని బిజెపి సీనియర్ నేత సంబిత్ పాత్రా వ్యాఖ్యానించారు.

రాష్ట్రంలో ఒంటరిగానే

ఏర్పాటు చేస్తామని చెప్పారు. బస్సుయాత్ర, ఎన్నికల కమిటీలపై ఈ నెల 31న జరిగే సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రఘువీరా రెడ్డి మాట్లాడుతూ అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు ఇచ్చిన కేంద్రప్రభుత్వం, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా కోసం ఫిబ్రవరి 1న జరిగే రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే విభజన హామీలు నెరవేరుతాయని చెప్పారు. అంతకుముందు జరిగన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో టిడిపితో పొత్తుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్లు తెలిసింది. సమావేశంలో ఎఐసిసి కార్యదర్శులు సిడి మెయ్యప్పన్, క్రిష్టోఫర్ తిలక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు తులసిరెడ్డి, కనుమూరి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

దూదేకులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి : బాబన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చట్ట సభల్లో దూదేకుల (నూర్ భాషా) కులానికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని రాష్ట్ర దూదేకుల ఫెడరేషన్ చైర్మన్ డాక్టర్ పి బాబన్, పోలీస్ హౌసింగ్ బోర్డు చైర్మన్ నాగుల్ మీరాలు డిమాండ్ చేశారు. బుధవారం ఆ ఫెడరేషన్ కార్యాలయంలో వివిధ పథకాల బ్రోచర్‌ను వారు ఆవిష్కరించారు. అనంతరం బాబన్ మాట్లాడుతూ రాష్ట్రంలో దూదేకుల కులానికి చెందిన వారు 20 లక్షల మంది ఉన్నారన్నారు. ముస్లింల కంటే దూదేకుల జనాభా ఎక్కువగా ఉన్నా ఇంత వరకు చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించ లేదన్నారు. తన కుమార్తెకు ఎమ్మెల్యే సీటు కేటాయించినట్టు ఎమ్మెల్యే జలీల్ ఖాన్ చెప్పడం విడ్డూరంగా ఉందని నాగుల్ మీరా అన్నారు. జనాభా దామాషా ప్రకారం దూదేకుల కులానికి రాజకీయ ప్రాధాన్యం కల్పించాలన్నారు.



గిరిజనులకు అండగా వుంటాం

మొదటి పేజీ తరువాయి

హాని చేసి నదులను కలుషితం చేస్తున్నారు. పెద్దరికం నిలబెట్టుకోవాలి. పిచ్చి పిచ్చి మాటలు వద్దు.' అని పవన్ హెచ్చరించారు. ఈ సభలో శాసన సభ మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్, మాజీ మంత్రి పి.బాలరాజు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.నర్సింగరావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి రాజారావు, పాడేరు నియోజకర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు తుడుమ అశోక్ జనసేన పార్టీలో చేరారు.

చెరువులో పడి ఇద్దరు చిన్నారులు మృతి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు (ప్రకాశం)

చెరువులో పడి ఇద్దరు బాలురు మృతి చెందిన ఘటన ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం బి.నిడమానూరులో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు..బి నిడమానూరులోని ఎస్సీ కాలనీకి చెందిన కొండ్రు అభిరామ్(6), వడ్డిముక్కల దినేష్ బాబు (7) అదే కాలనీలోని ప్రభుత్వ పాఠశాలకు వెళ్లారు. సాయంత్రం విరామ సమయంలో పాఠశాలకు సమీపంలోని చెరువులో తామరపూల కోసం వెళ్లారు. పూలు కోసుకుని వచ్చే క్రమంలో గుంతలో పడిపోయి ఊపిరాడక మృతి చెందారు. పాఠశాల పూర్తయినా వారు కనిపించకపోవడంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు వెతికారు. చెరువులో వారి మృతదేహాలు కనిపించాయి. ఈ ఇద్దరి తల్లిండ్రులు నిరుపేదలే. కూలి పని చేసుకుని జీవనం సాగిస్తుంటారు.

జగ్జీవన్ జ్యోతి వెలుగులేవి?

పథకం తీరుపై తీవ్ర అసంతృప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎస్సీ, ఎస్టీలకు ఉద్దేశించిన జగ్జీవన్ జ్యోతి పథకంపై పెద్ద ఎత్తున అసమ్మతి నెలకొంది. . ఈ పథకం కింద రూ. 38.65 కోట్లతో 4.67 లక్షల ఎస్సీలు, రూ. 5.78 కోట్లతో 50వేల మంది ఎస్టీలకు ఉచిత విద్యుత్‌ను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం అమలు కోసం సాంఘిక సంక్షేమ శాఖకు రూ. 148. 65 కోట్లు కేటాయించింది. 100 యూనిట్ల కరెంట్‌కు ప్రభుత్వమే బిల్లులు చెల్లిస్తున్నట్టు చెబుతున్నప్పటికీ, అనేక ప్రాంతాల్లో లబ్ధిదారులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి వస్తోంది. కరెంటుకు బిల్లులు చెల్లించాలని ఇబ్బందులు పెడుతున్నట్టు 34 శాతం మంది లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు ఆర్టీజి సర్వేలో వెల్లడైంది. కడప, అనంతపురం, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు, గుంటూరు, కృష్ణా జిల్లాలో ఈ తరహా ఫిర్యాదులు అధికసంఖ్యలో వచ్చాయి. జగ్జీన్ జ్యోతి పథకం అమలు తీరు, దీని వల్ల లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఇటీవల రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజి) ద్వారా ప్రత్యేక సర్వే నిర్వహించారు. సిఎం సొంత ఇలాకలోనే 37 శాతం మంది లబ్ధిదారులు బిల్లు చెల్లింపుల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వంద యూనిట్ల కరెంటు సరఫరా కావడం లేదని మరో 25 శాతం మంది తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్టు ఈ సర్వేలో వెల్లడించారు. కరెంటు సరఫరా అంతరాయం సమస్య ఎక్కువగా శ్రీకాకుళంలో ఉండగా, 13 జిల్లాల నుంచి సగటున 23 శాతం మంది అసంతృప్తిని వ్యక్తం చేశారు. దాదాపు 57 శాతం మంది సరఫరా సమస్యలు ఎదుర్కొంటుండటం గమనార్హం. వినియోగ దారుల్లో సుమారు 42 శాతం మంది ఎస్సీ, ఎస్టీలు ఈ పథకం గురించి అసలు తెలియదని వెల్లడించారు. గరిష్టంగా తూర్పు గోదావరి జిల్లాలో 49 శాతం మంది తమకు తెలియదని వ్యక్తం చేయగా కనిష్టంగా కడప జిల్లాలో 37 శాతం మంది ఈ పథకం ఉందనే విషయం తమకు తెలియదని వ్యక్తం చేసినట్టు సర్వేలో పేర్కొన్నారు.

నూతన హైకోర్టుకు పటిష్ట భద్రత

ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సమీక్షించిన శ్రీకాంత్, అనురాధ



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతిలో నూతన హైకోర్టుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు కల్పించాలని ఉన్నతాధికారులు సంబంధిత సిబ్బందికి సూచించారు. వచ్చే నెల 3వ తేదీన హైకోర్టు ప్రారంభం కానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై జిఎడి కార్యదర్శి శ్రీకాంత్, హోమ్ శాఖ కార్యదర్శి అనురాధ సమీక్షించారు. హైకోర్టు ప్రధాన, ఇతర న్యాయమూర్తులకు ప్రత్యేక భద్రత కల్పించాలని, వారి రాకపోకలు సజావుగా సాగేలా చూడాలని హోం శాఖ కార్యదర్శి అనూరాధ పోలీస్ అధికారులను ఆదేశించారు. పటిష్ట భద్రత కల్పించడంతో పాటు ఫైర్ సర్వీసులు, ట్రాఫిక్, పార్కింగ్, ప్రముఖుల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విఐపిలు, ప్రముఖుల వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. భవనాలకు బయోఫెన్సింగ్ వేయడంతో పాటు పోలీస్ అవుట్ పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. న్యాయమూర్తుల ఇంటి వద్ద గార్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో హైకోర్టు రిజిస్ట్రార్ రాంబాబు, సమాచార శాఖ కమిషనర్ ఎస్ వెంకటేశ్వర్, ఇతర పోలీసు, అగ్నిమాపక, సిఆర్‌డిఏ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం వీరు హైకోర్టు భవనాలను పరిశీలించారు.

ఆశ్రమ పాఠశాలల సమస్యల పరిష్కారానికి 29న ధర్నా : యుటిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గిరిజన సంక్షేమ శాఖలోని ఆశ్రమ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. ఈ నెల 29న విజయవాడలో రాష్ట్రస్థాయి ధర్నా నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ సాబ్జీ, పి బాబురెడ్డి తెలిపారు. ధర్నా నోటీసును గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టరుకు బుధవారం అందజేశామన్నారు. హాస్టళ్లను హైస్కూల్స్‌గా మార్చిన పాఠశాలలకు పిజి హెచ్‌ఎం, సబ్జెక్టు పోస్టులను మంజూరు చేసి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జిఒ 233 ప్రకారం మంజూరైన పోస్టులకు ఆర్థికశాఖ అనుమతి తీసుకుని వెంటనే భర్తీ చేయాలని కోరారు. గిరిజన సంక్షేమ పాఠశాలలకు కూడా పండిట్, పిఇటి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. పిజి హెచ్‌ఎం లేని పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు సమీపంలోని పిజి హెచ్‌ఎం ద్వారా జీతాలు చెల్లించే ఏర్పాటు చేయాలని కోరారు. అన్ని ఐటిడిఏల్లోని ఉపాధ్యాయ ఖాళీలకు స్పెషల్ డిఎస్‌సి నిర్వహించాలని డిమాండ్ చేశారు. సిఆర్‌టిలకు ఉద్యోగ భద్రత కల్పించి, అన్ని సెలవులు వర్తింప చేసి మినిమం టైమ్ స్కేలు ఇవ్వాలని కోరారు. టిడబ్ల్యు గవర్నమెంట్ ప్రైమరీ పాఠశాలల్లో 1 నుండి 5 తరగతులు కొనసాగించాలని కోరారు.

ఆర్‌టిసి కార్మికులు అత్యాశకు పోకూడదు : వర్ల

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఆర్‌టిసిలో సమ్మె హెచ్చరికలు సరికాదని సంస్థ చైర్మన్ వర్ల రామయ్య పేర్కొన్నారు. గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కార్మికులు వేతన సవరణ విషయంలో అత్యాశకు పోరాదన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో 50 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ సాధ్యం కాదన్నారు. కార్మిక సంఘాలతో ఎమ్‌డి సురేష్ బాబు చర్చిస్తున్నారని, ఆర్‌టిసి వేగంగా అభివృద్ధి చెందుతున్న సమయంలో కార్మికులు సమ్మెకు పూనుకోవడం సరికాదన్నారు. కార్మిక సంఘాల డిమాండ్లపై సిఎం, రవాణ శాఖ మంత్రి తగిన నిర్ణయం తీసుకుంటారని చెప్పారు.

జెఎన్‌యు చార్జిషీట్‌పై న్యాయ సలహా కోరనున్న ఢిల్లీ ప్రభుత్వం

న్యూఢిల్లీ : జెఎన్‌యు దేశద్రోహం కేసులో ప్రాసిక్యూషన్‌కు అనుమతి మంజూరు చేసే అంశంపై న్యాయ సలహా తీసుకోవాలని ఢిల్లీ ప్రభుత్వం నిర్ణయించింది. అధికారుల అనుమతి తీసుకోకుండానే జెఎన్‌యు ఎస్‌యు మాజీ అధ్యక్షుడు కన్హయ్య కుమార్, మరో 9మందిపై దేశద్రోహం కేసులో చార్జిషీట్ దాఖలు చేయడాన్ని కోర్టు ప్రశ్నించిన నేపథ్యంలో కేజ్రీవాల్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

'ఇస్మార్ట్ శంకర్' ప్రారంభం



రామ్

రామ్, పూరీ జగన్నాథ్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమా బుధవారం ప్రారంభమైంది. ' ఇస్మార్ట్ శంకర్ ' అనే టైటిల్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం తొలి షాట్‌కు హీరోయిన్ ఛార్మి క్లాప్ కొట్టారు. స్రవంతి రవికిశోర్ కెమెరా స్విచాన్ చేశారు. ఈ చిత్రంలో రామ్ సరికొత్త లుక్‌లో కనిపించనున్నాడు. రేపటి నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. యాక్షన్ ఎంటర్ టైనర్‌గా తెరకెక్కుతోంది. మణిశర్మ సంగీతం సమకూరుస్తున్నారు. రాజ్ తోట సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. పునీత్ ఇస్సార్, సత్య దేవ్, మిలింద్ గునాజి, ఆశిష్ విద్యార్థి, గెటప్ శ్రీను ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. పూరీ జగన్నాథ్ టూరింగ్ టాకీస్ , పూరీ కనెక్ట్స్ పతాకాలపై పూరీ జగన్నాథ్ , ఛార్మి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాని మేలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

'నీ కోసం' తొలి పాట

కొత్త తరహా ప్రేమ కథగా రూపొందుతోన్న సినిమా 'నీ కోసం'. ప్రేమలో సున్నితమైన భావోద్వేగాన్ని టచ్ చేస్తూ భిన్నమైన కోణాలను స్పృశించబోతోందీ చిత్రం. అరవింద్ రెడ్డి, శుభాంగి పంత్, అజిత్ రాధారామ్, దీక్షిత ప్రధాన జంటలుగా నటిస్తున్నారు. ఈ రెండు జంటల మధ్య ప్రేమకథను ఈ తరానికి నచ్చేలా తెరకెక్కుతోందని ఈ సినిమా యూనిట్ చెబుతుంది. ఎంటర్‌టైన్‌మెంట్ తగ్గకుండానే ప్రేమకథలో ఓ కొత్త కోణాన్ని ఆవిష్కరించబోతోన్న ఈ చిత్ర టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చిందని తెలిపింది. తాజాగా ఈ చిత్రంలోని తొలి పాటను దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ బుధవారం విడుదల చేశారు. 'తొలి తొలిగా' అంటూ సాగే ఈ పాట విన్న వెంటనే భరద్వాజ చాలా బావుందని మెచ్చుకున్నారని చెప్పారు. నిర్మాత




అల్లూరమ్మ మాట్లాడుతూ 'లవ్ స్టోరీలో ఎమోషన్‌కు ఎప్పుడూ ఎక్కువ స్కోప్ ఉంటుంది. అలాంటి ఎమోషనల్ టచ్ చేయడంతో పాటు మంచి ఎంటర్‌టైన్‌మెంట్ కూడా ఉంటుంది. ఇది ప్రేమకథే అయినా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది' అని తెలిపారు. తీర్థసాయి ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అల్లూరమ్మ(భారతి) నిర్మిస్తోంది. ఈ చిత్రానికి అవినాష్ కోకటి దర్శకుడు. ఇప్పటికే టాకీ పార్ట్ పూర్తి చేసుకుంది. ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్స్ వర్క్స్ జరుపుకుంటోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి వచ్చే నెలలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతోంది యూనిట్. ఈ చిత్రానికి సంగీతం : శ్రీనివాస్ శర్మ సినిమాటోగ్రఫీ : శివకృష్ణ, ఎడిటర్ : తమ్మిరాజు, ఆర్ట్ : క్రాంతి ప్రియ.

తారక్‌నే అడగాలి

– అఖిల్ అక్కినేని

'ఈ సినిమాను 40 రోజులు విదేశాల్లో చిత్రీకరించాం. వెంకీ హార్డ్‌కోర్ అక్కినేని ఫ్యాన్. విక్కీ అనే క్యారెక్టర్ 'ప్రేమ్‌నగర్' సినిమా నుండి స్ఫూర్తిగా తీసుకుని తయారు చేశాడు. మజ్ను అనే టైటిల్ మా ఫ్యామిలీకి బాగా కలిసొచ్చింది. దాన్ని నేనూ క్యారీ చేయాలనుకుంటున్నాను. 8 ప్యాక్ చేయాలని ముందుగా అనుకోలేదు. శేఖర్ మాస్టర్ వచ్చి నన్ను 8-9 నెలలు కేవలం చేపలనే తినాలని చూపించారు. అలానే చేశాను. అఖిల్ అక్కినేని హీరోగా శ్రీవెంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పి పతాకంపై 'తొలిప్రేమ' ఫేం వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మిస్టర్ మజ్ను'. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మించారు. ఈనెల 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా అఖిల్ అక్కినేని బుధవారం పాత్రికేయులతో మాట్లాడారు.



- వెంకీ స్క్రిప్ట్ చెప్పినప్పుడు నాన్నకు నచ్చుతుందో.. లేదో తెలియదు. అప్పటికే ఓ సినిమా కమిట్ అయ్యాను. ఏడాదిన్నర సమయం పడుతుంది. ఆలోపు మరేదైనా సినిమా చేసుకుంటే చేసుకోమని వెంకీకి చెప్పాను. ఆయన కూడా ఏడాదిన్నర పాటు ఖాళీగా ఉండటం ఎందుకు? మరో సినిమా చేసుకుంటాను అని చెప్పాడు. ఈ స్క్రిప్ట్ మాత్రం నా కోసం పక్కన పెడతానని చెప్పాడు. అన్నట్లుగానే పక్కన పెట్టాడు.
- క్యారెక్టర్ బేస్డ్ స్క్రిప్ట్ కావడం, నేను చేసిన నా రెండు సినిమాల్లోని క్యారెక్టర్‌కు కంప్లీట్ అపోజిట్ రోల్ కావడంతో ఈ కథ వినగానే నచ్చేసింది. ఈ చిత్రంలో ముందు అంతా కుటుంబ భావోద్వేగాలు ఉంటాయి. విక్కీ అనే క్యారెక్టర్‌ను రిజిష్టర్ చేయడానికి ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్ అవసరం. కాబట్టి క్యారెక్టర్ రిజిష్టర్ అయిన తర్వాత కథలోకి వెళతాం. నటుడిగా నాకు సవాలు అనిపిస్తుంది. నటుడిగా నేను ఎంట్రీ ఇచ్చినప్పుడు భారీ అంచనాలుండడంతో ఒత్తిళ్లు నా శత్రువులుగా మారాయి. నేను ఆ విషయాన్ని నిజాయితీగా ఒప్పుకుంటాను. అందుకనే నేను అంచనాలను రీచ్ కావడానికి ప్రయత్నించడం లేదు. నచ్చిన సినిమాలు చేయడానికే ప్రాధాన్యమిస్తున్నాను. అది ఒకేసారి కాకుండా ఒక్కొక్క మెట్టుగా ముందుకు వెళుతున్నాను.
- 'మిస్టర్ మజ్ను' ఎంటర్‌టైనింగ్ మూవీ. ఫ్యామిలీ ఎమోషన్స్ ఉన్నాయి. ఎంటర్‌టైన్ సినిమాలకు మంచి ఆదరణ ఉంటుంది. ఓ క్లాసిక్ సినిమాను బేస్ చేసుకుని వెంకీ నేటి స్టయిల్‌కు తగ్గట్లు మార్చి రాశారు. త్రివిక్రమ్‌గారి సినిమాలను చూసి వెంకీ సన్నివేశాలను ఎక్కడా కాపీ కొట్టలేదు. వెంకీ నాకు పదేళ్లుగా తెలుసు. మూడేళ్లుగా తనతో ఎక్కువగా జర్నీ చేశాను. ఇప్పుడు అతను క్లోజ్ ఫ్రెండ్‌గా మారాడు. ఈ సినిమా పరంగా వెంకీ నన్ను కొత్తగా చూపించే ప్రయత్నం చేశాడు. సినిమా సెట్స్‌కు వెళ్లడానికి ముందు వెంకీ, నేను మాట్లాడుకున్నాం. చిన్న చిన్న విషయాలు కూడా తన కేర్ తీసుకుని చేశాడు. షూటింగ్ సమయాల్లో ఇద్దరం డిస్కస్ చేసుకునేవాళ్లం. ప్రస్తుతానికి నేను సింగిల్. రెడీ టు మింగిల్. ఈ సినిమాకు బాయ్స్ విల్ బి బాయ్స్ అనే క్యాప్షన్‌ను పెట్టడానికి కారణం తెలుసుకోవడానికి సినిమా చూడాల్సిందే. దానికి న్యాయం చేసేలా రెండు, మూడు చిన్న ట్విస్ట్‌లుంటాయి.



ఎన్టీఆర్, రామ్ చరణ్‌తో అఖిల్

- 'తొలిప్రేమ' తర్వాత మా స్క్రిప్ట్‌లో ఎలాంటి మార్పులు లేవు. లొకేషన్ పరంగా అమెరికా నుండి లండన్‌కు మార్చామంతే. స్క్రిప్ట్ స్టేజ్‌లో నాన్నగారు వింటారు. అలాగే ఈ కథను కూడా విన్నారు. ఆయనకేమైనా డౌట్ అనిపిస్తే మార్పులు చేసుకోమని సలహాలు మాత్రమే ఇస్తారు. ఈ సినిమా సమయంలో కూడా ఓ సీన్ దగ్గర ఆయనకు చిన్న సందేహం వచ్చింది. దాన్ని ఆయన చెప్పారు. లింక్ రావడం లేదని అప్పటికే నాకు, వెంకీ కూడా అనిపించడంతో చిన్న సీన్‌ను రీ షూట్ చేశాం. సాధారణంగా సినిమాతో మేం ఎక్కువగా ట్రావెల్ చేయడం వల్ల సినిమాను ఎక్కువగా ప్రేమించేస్తాం. దాని వల్ల డిస్‌కనెక్ట్‌గా ఉండే వ్యక్తికి సినిమా చూపిస్తే దానిలో లోటు పాట్లు తెలుస్తాయి కదా. అందుకనే నాన్నగారికి సినిమా చూపించాం.
- బివిఎస్ఎన్‌గారి చుట్టూ హ్యాపీనెస్‌తో కూడిన వాతావరణం ఉంటుంది. నేను ఆయనతో ఎప్పుడూ 'మా తాతగారితో సినిమా చేశారు. ఇప్పుడు నాతో సినిమా చేస్తున్నారు. నాకు చాలా గర్వంగా ఉంది' అనేవాడిని. బాపినీడు ఎప్పుడు బ్యాక్‌ఎండ్‌లో ఉంటారు.
- తమన్ ఈ సినిమా కోసం ఆరు అద్భుతమైన సాంగ్స్‌ను ఇచ్చారు. ఓ సాంగ్‌లో ఓ షాట్‌లో కనపడతాడు. క్రికెట్‌కు సంబంధించిన సినిమా చేయాలంటే నేను ఆలోచిస్తాను. ఎందుకంటే ఎక్కువ స్పోర్ట్స్ సినిమాలు పెద్దగా కనెక్ట్ కావు. అందుకు కారణం నటించే నాకే కాదు.. డైరెక్టర్‌కి కూడా క్రికెట్ మీద అవగాహన ఉండాలి. అయితే ఇప్పటి వరకు క్రికెట్‌కు సంబంధించిన స్క్రిప్ట్స్ రాలేదు. అయితే ఓ స్పోర్ట్స్ సినిమా డిస్కషన్‌లో ఉంది. అంతా ఓకే అయితే ఆ వివరాలను నేనే ప్రకటిస్తాను.

చరణ్ 'వినయ విధేయ రామ' చిత్రీకరణ సమయంలో మా సినిమాసెట్‌కు వచ్చి సాంగ్ చూశారు. చాలా అప్రిషియేట్ చేశారు. అలాగే తారక్‌ను చూసి నాన్న మాస్ నేర్చుకోమని అన్నాడు. అదెలాగో ఆయన్నే అడగాలి.

గత రెండు చిత్రాలు చాలా అనుభవాన్ని ఇచ్చాయి. నా తొలి చిత్రం డిజాస్టర్ అయింది. డిజాస్టర్స్ నుండి స్టార్ హీరోలు కూడా అంత త్వరగా బయటపడలేరు. అలాంటి ఒక కొత్త నటుడిగా నేను దాన్ని అధిగమించి, 'హలో' సినిమా చేశాను. ఆ సినిమా వల్ల నాలో కాన్ఫిడెంట్ పెరిగింది. సాధారణంగా మజ్ను అంటే ట్రాజిక్ ఆలోచనలు వచ్చేస్తాయి. ఇక్కడ ట్రాజిక్ విషయాలు ఉండవు.. యంగ్ పర్సన్ గురించి చెబుతున్నాం కాబట్టి మిస్టర్ మజ్ను అనే టైటిల్‌ను పెట్టాం. అతను అమ్మాయిలను ప్రేమిస్తాడు.. అమ్మాయిలూ అతన్ని ప్రేమిస్తారు. ప్లేబోయ్‌లాంటి కుర్రాడు లవర్‌బోయ్‌లా ఎలా మారాడనేదే కథ.

- ఒకట్రెండు మల్టీస్టారర్ సినిమాలు చేయమని అడిగారు కానీ నాకు ఆసక్తిగా అనిపించలేదు. ఇంట్రెస్టింగ్ స్క్రిప్ట్ వచ్చినప్పుడు తప్పకుండా నటిస్తాను. నాకు ఎక్స్‌పెండబుల్స్ తరహా మల్టీస్టారర్ చేయాలని ఉంది. ఆరేడు మంది స్టార్స్ కలిసి సినిమా చేసేటప్పుడు ఆ ఎన్విరాన్‌మెంట్ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది.

మార్చిలో 'లక్ష్మీస్ ఎన్టీఆర్'

రామ్ గోపాల్ వర్మ తెరకెక్కిస్తున్న చిత్రం 'లక్ష్మీస్ ఎన్టీఆర్'. ఎన్టీఆర్ జీవితం ఆధారంగా రూపొందుతోంది. లక్ష్మీపార్వతి ఎన్టీఆర్ జీవితంలోకి వచ్చాక జరిగిన పరిస్థితులపై ఈ చిత్రం ప్రధానాంశంగా తెరకెక్కుతోంది. ప్రస్తుతం ఈ షూటింగ్ పనుల్లో వర్మ బిజీగా ఉన్నాడు. బుధవారం ఈ చిత్రానికి సంబంధించిన కొన్ని ఫొటోలను ట్విట్టర్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈ సినిమాని మార్చిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు వెల్లడించారు. "ఈ చిత్రాన్ని మార్చిలో విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. రాజకీయ లబ్ధి కోసమేమీ



ఎన్నికల సమయంలో విడుదల చేయడం లేదు. అటువంటి ప్రణాళికలు ఏమీ లేవు. క్రిష్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఎన్టీఆర్ కథానాయకుడు', ఎన్టీఆర్ మహానాయకుడు'లో నందమూరి తారక రామారావు జీవితానికి సంబంధించి చెప్పని ముఖ్యమైన విషయాలను ఈ చిత్రం ద్వారా తెలుగు ప్రజలకు తెలియజేయడమే మా ధ్యేయం" అని పేర్కొన్నాడు. నిర్మాత రాకేశ్ రెడ్డి మీడియాకు తెలియజేస్తూ.. 'ఈ చిత్రం టీజర్‌ను ఫిబ్రవరి మొదటి వారంలో విడుదల చేస్తాం. 'లక్ష్మీస్ ఎన్టీఆర్'లో అంతా కొత్తవారు నటిస్తున్నారు. ఎన్టీఆర్‌గా రంగస్థల నటుడు చేస్తున్నారు. లక్ష్మీపార్వతిగా యజ్ఞ శెట్టి కనిపించనున్నారు' అని తెలిపారు.

'మీటూ'కు మద్దతు ఉంటుంది కానీ...

'టోటల్ ధమాల్' సినిమా పనుల్లో బిజీగా ఉన్న అజయ్ దేవగన్ మీటూ ఉద్యమంపై స్పందించారు. ఈ ఉద్యమానికి తన మద్దతు ప్రకటిస్తూనే...వేధింపులు ఎదుర్కొన్న వారికి న్యాయం జరిగేలా మీటూ సాగాలే తప్ప దీన్ని అవకాశంగా తీసుకొని ఎవరిపైబడితే వారిపైన ఆరోపణలు చెయ్యొద్దని సూచించారు. తనుశ్రీదత్ వల్లే ఇండస్ట్రీలో ఈ ఉద్యమం వచ్చింది. మరుగున పడిపోయిన లైంగిక వేధింపుల వ్యవహారాలను ఆమె వెలుగులోకి తీసుకొచ్చారు. ఈమె కాదు ఈమెతో పాటు చాలామంది బయటకొచ్చి తమకు ఎదురైన అనుభవాలను, వేధింపులను వివరించారు. వీరి వల్లే చిత్రసీమలో పలుకుబడి ఉన్న వ్యక్తుల అరాచకాలు బయటకొచ్చాయి. తాజాగా 'సంజు' సినిమా షూటింగ్ సమయంలో ప్రముఖ దర్శకుడు రాజ్‌కుమార్ హిరానీ తనను వేధించారని సహాయ దర్శకురాలు బయటపెట్టింది. ఈ మీటూ ఉద్యమంపై అజయ్ దేవగన్ స్పందిస్తూ...'మీటూ నేపథ్యంలో చాలా మంది ఎదుర్కొన్న వేధింపులు గురించి చెప్పారు. అందులో చాలా వరకూ నిజమే ఉంటాయి. వాటిపై విచారణ అవసరం. నేను ఈ ఉద్యమానికి మద్దతిస్తున్నా. కానీ కొందరు ఈ ఉద్యమాన్ని అవకాశం తీసుకుంటూ కొందరిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు అదే బాధగా ఉంది. దీని వల్ల కొందరు అమాయకులు ఇబ్బంది పడుతున్నారు. ప్రతి చిత్రసీమలోనూ మంచివారు చెడ్డవారూ ఉంటారు. అయితే అందులో కొందరే ఇటువంటి పనులు చేసేవారుంటారు కాబట్టే ఇండస్ట్రీలో ఇంకా పని చేయడానికి అందరూ ముందుకొస్తున్నారు" అని అన్నారు. కాజోల్ మాట్లాడుతూ 'ఈ విషయంలో అసలు ఏం జరుగుతుందో చూపించాల్సిన బాధ్యత మీడియా తీసుకోవాలి. ప్రముఖులంతా ఈ వివాదంలో ఉండడం వల్ల ఎక్కువ దృష్టి సారించాల్సి ఉంది. ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి తాము ఎదుర్కొన్న వేధింపులను చెప్పాలి. వాటిని మీడియా, ప్రజలు అంతా వినాలి" అని అన్నారు.



కాజోల్, అజయ్ దేవగన్

ఫిబ్రవరి 8న 'యాత్ర'



మమ్ముట్టి

వైఎస్సార్ జీవితం ఆధారంగా రూపొందుతోన్న చిత్రం 'యాత్ర'. మలయాళ నటుడు మమ్ముట్టి వైఎస్ఆర్ పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన టీజర్లు, ట్రైలర్స్‌కి మంచి స్పందన వచ్చిందని యూనిట్ చెప్పింది. 'ఆనందో బ్రహ్మ' దర్శకుడు మహి వి రాఘవ్ ఈ 'యాత్ర'ని తెరకెక్కించారు. 70 ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రూపొందుతోంది. శివ మేక సమర్పకుడు. ఫిబ్రవరి 8న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. తెలుగు, తమిళం, మళయాలం భాషల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తెలుగు పార్టు సెన్సారు కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. క్లీన్ యు సర్టిఫికెట్‌ని సొంతం చేసుకుంది. నిర్మాతలు విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి మాట్లాడుతూ ' రాజశేఖర్ రెడ్డిగారి జీవితంలో అతి కీలకమైన పాదయాత్ర ఘట్టాన్ని మెయిన్‌గా తీసుకుని ఈ చిత్రాన్ని నిర్మించాం. మమ్ముటి వైఎస్ఆర్ పాత్రలో పరకాయ ప్రవేశం చేసి నటించారనేది ఇప్పటికే ట్రైలర్స్ చూసినవారందరికీ తెలిస్తుంది. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ చిత్రాన్ని నిర్మించాం. ఈ చిత్రంలో ఆద్యంతం ఎమోషన్‌తో కూడిన పాత్రలు, పాత్ర చిత్రణ కనిపిస్తుంది. తెలుగు ప్రజలందరూ తప్పకుండా చూడవలసిన చిత్రంగా తెరకెక్కిస్తున్నాం' అని తెలిపారు.

సరైన కథ కోసం చూస్తున్నా

– సుస్మితా సేన్



కుమార్తె అలీషాతో సేన్

సరైన కథ కోసం నిరీక్షిస్తున్నా...మంచి స్క్రిప్ట్ కుదిరితే రీ ఎంట్రీకి సిద్ధంగా ఉన్నా అని మాజీ విశ్వసుందరి, నటి సుస్మితా సేన్ చెప్పింది. డిజైనర్ అశిష్ ఎన్ నిర్వహించిన కార్యక్రమంలో ర్యాప్ వాక్ చేసిన అనంతరం ఆమె మాట్లాడింది. 'ప్రస్తుతం నేను ఫ్యాషన్ వీక్‌లు చేస్తున్నా. ఇంటిదగ్గర ఉన్నప్పుడు ఒకటే ఆలోచిస్తూ ఉంటా ఫ్యాషన్ వీక్ ద్వారా ప్రేక్షకుల్లోనే నేను నిరంతరం జీవిస్తున్నా'నని తెలిపింది. మళ్లీ సినిమాల్లోకి వచ్చే అవకాశాలపై ప్రశ్నించిగా దానికి సేన్ బదులిస్తూ...'సరైన కథ కోసం ఎదురు చూస్తున్నా. నేను ఎప్పుడూ సినిమాకు దగ్గరగానే ఉంటున్నా. అయితే ఎందులోనూ నటించడం లేదు. ఇప్పటి వరకూ ఆ ఆలోచన లేదు. ఇప్పుడు చేద్దామనుకుంటున్నా. చూడాలి ఎలా ఉంటుందో' అని చెప్పింది. ఎప్పుడైతే సినిమాలు చేస్తానో అప్పుడు ప్రొడక్షన్‌ను వదులుకుంటానని, ఎందుకంటే రెండూ కలసి చేయదలుచుకోలేదని, ప్రస్తుతానికి బాలీవుడ్ చాలా బాగుందని స్పష్టం చేసింది. ఫ్యాషన్ రంగంలో కొత్త కొత్త ప్రయోగాలు చేయడమంటే తనకెంతో ఇష్టమని పేర్కొంది.

రజనీకాంత్ కుమార్తెకు ఫిబ్రవరిలో వివాహం



ఐశ్వర్య, విశగన్ వనంగముడి

రజనీకాంత్ చిన్న కుమార్తె సౌందర్యకు వచ్చే నెల 11వ తేదీన వివాహం జరగనుంది. నటుడు, వ్యాపారి అయిన విశగన్ వనంగ ముడిని ఆమె పెళ్లాడనుంది. ఇది వరకూ ఈమెకు అశ్విన్‌తో వివాహం జరిగిన విషయం తెలిసిందే. పెళ్లి అనంతరం ఇద్దరి మధ్య విబేధాలు తలెత్తి విడిపోయారు. విడాకులు పొందినట్టు ట్విట్టర్‌లో రజనీ ఫ్యాన్స్ అడిగిన ఓ ప్రశ్నకు ఇటీవల సౌందర్యంగా సమాధానంగా కూడా చెప్పింది. విశగన్‌కి మందుల తయారీ కంపెనీ ఉంది. ఇతను గత ఏడాది 'వన్జగర్ ఉలగమ్' అనే చిత్రం ద్వారా వెండితెరకు నటుడిగా పరిచయమయ్యాడు. విశగన్‌కి కూడా గతంలో ఓసారి వివాహం జరిగింది. ఇది అతనికీ రెండో పెళ్లే. ప్రస్తుతం సౌందర్య సినిమా నిర్మాతగా కొనసాగుతున్నారు. విశగన్, సౌందర్య వివాహం చెన్నైలో జరగనుంది. ఫిబ్రవరి తొమ్మిదో తేదీ నుంచి ఈ పెళ్లి వేడుకలు ప్రారంభం కానున్నాయి. అందులో సంగీత్, మెహందీ వంటివి ఉండనున్నాయి. దీనికి ముందు రజనీకాంత్ గార్డెన్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

సంగమం

సంస్కృతి, కళలపై రచనలకు ఆహ్వానం!

ఇది కళలు, సంస్కృతి, రంగస్థలం తదితర అంశాలపై ప్రత్యేక పేజీ. మీ ప్రాంత సంస్కృతి, జానపద కళలు, వాటి ప్రత్యేక విశేషాలు; నాటకం, చిత్రకళా ప్రదర్శనలపై మీరు కూడా వ్యాసాలూ, నివేదికలూ రాసి పంపవచ్చు. సాంస్కృతికరంగంలో వస్తున్న మార్పుల మంచిచెడ్డలపై విశ్లేషణాత్మక వ్యాసాలు రాయవచ్చు. మా చిరునామా : సంగమం, ప్రజాశక్తి, ఎంబి విజ్ఞానకేంద్రం, గవర్నరుపేట, విజయవాడ- 2.

అక్షరాంజలి





మృణాల్ సేన్... జగద్విఖ్యాత సినీ దర్శకుడు. కళాస్రష్ట. రిత్విక్ ఘటక్, సత్యజిత్ రేల సమకాలికుడు, భారతదేశ వాస్తవవాద, కళాత్మక సినిమాల విషయంలో మృణాల్ సేన్. తెలుగు పద్యంలో కవిత్రయంలా 'ఘటక్-రే-సేన్'లను బెంగాలీ దర్శక త్రయంగా చెప్పుకుంటారు. ప్రపంచం గుర్తెరిగిన ఆఖరు బెంగాలీయుడు వెళ్లిపోయాడంటూ వాపోయాడు సుప్రసిద్ధ దర్శకుడు బుద్ధదేవ్ దాస్ గుప్తా. 2018 డిసెంబరు 30న కన్నుమూసిన మృణాల్ .. జీవితాంతం భారతీయ సినిమాను ప్రపంచస్థాయికి తీసుకెళ్లటానికే కృషి చేశారు.

నవ సినిమా వైతాళికుడు

హఠాత్తుగా ఓ రోజు!

1989లో మృణాల్ సేన్ హిందీలో తీసిన సినిమా పేరు 'ఏక్ దిన్ అచానక్' (హఠాత్తుగా ఓ రోజు). మృణాల్ సేన్ సినిమాల్లోకి రావడం కూడా హఠాత్తుగానే జరిగింది. 1923 మే 14న నేటి బంగ్లాదేశ్‌లోని ఫరీద్‌పూర్‌లో జన్మించిన సేన్ భౌతికశాస్త్రం చదివేందుకు కలకత్తా వచ్చాడు. అప్పట్నుంచి కోల్‌కతా అతడి ప్రియమైన 'మహానగరం' అయిపోయింది. ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) సాంగత్యంలోకి వచ్చాక అతడికి మార్క్సిస్టు భావాలు అలవడ్డాయి. అప్పుడే రిత్విక్ ఘటక్, సలీల్ చౌదరి, శంభు మిత్రా, సలీమ్ షరాఫీవంటి మహామహులతో పరిచయం, పేరడైజ్ కాఫీ హౌస్‌లో కప్పుల కొద్దీ టీ, గంటలకొద్దీ చర్చలు అతడిని తీర్చిదిద్దాయి.

సినిమాలపై పెద్దగా ఆసక్తి లేని అతడికి హఠాత్తుగా ఓ రోజు లైబ్రరీలో రుడాల్ఫ్ అర్న్ హెమ్ రాసిన 'ఫిల్మ్' పుస్తకం దొరికింది. దాంతో ఫిల్మ్‌కి దగ్గరయ్యాడు. 'భారతీయ వ్యాపార సినిమాలు చూస్తే సినిమాలు ఎలా ఉండకూడదో తెలిసేది. ప్రపంచ సినిమా మహామహుల పుస్తకాలు చదివితే సినిమాలు ఎలా ఉండాలో తెలిసేది. చెత్త సినిమాలపై కోపం, మంచి సినిమాలపై ప్రేమ ఒకేసారి పెంచుకుంటూ పెరిగాను నేను' అని చెబుతాడు సేన్. మొదట్లో సినిమాల గురించి వ్యాసాలు రాయనారంభించాడు. కానీ భుక్తి కోసం ఉత్తరప్రదేశ్‌లో మెడికల్ రిప్రజెంటేటివ్‌గా కుదరక తప్పలేదు.

హఠాత్తుగా ఓ రోజు... 1951లో... ఝాన్సీ నగరంలోని ఓ హొటల్ గదిలో... అద్దంలో తనని తాను చూసుకుంటూ 'నేనెవర్ని? నేను చేయాల్సినదేమిటి? చేస్తున్నదేమిటి?' అని తర్కించుకుని 'ఇక చాలు' అని తీర్మానించుకుని ఆ ఉద్యోగానికి గుడ్ బై చెప్పి కలకత్తాలోని ఓ స్టూడియోలో టెక్నీషియన్ చేరాడు. ఆ విధంగా ఖండాంతరాల్లో ఖ్యాతిగాంచిన ఓ ప్రగతిశీల సినీ దర్శకుడు మనకు లభించాడు.

నవతరంగ సినిమాకు ఆద్యుడు

హిందీలో నవతరంగ సినిమా మృణాల్ సేన్ తీసిన 'భువన్ షోమ్'తోనే ఆరంభమైంది. ఫ్రెంచి, ఇటాలియన్ వాస్తవవాదం, జర్మన్ అనుభూతివాద ప్రభావాలతో భారతీయ చలనచిత్ర రంగంలో నూతన ఒరవడికి నాంది పలికింది 'భువన్ షోమ్'. ఎనభయ్యో దశకంలో 'ఆర్ట్ సినిమా' ఉద్యమానికి 'భువన్ షోమ్' విజయం ప్రధాన కారణమైంది. వాస్తవవాద సినిమాలకు నీరసంగా స్పందించే తెలుగు చిత్రసీమలో కూడా 'దాసి', 'రంగుల కళ' వంటి సినిమాలు వచ్చాయి. అయితే ప్రేమ్‌చంద్ 'కఫన్' కథ ఆధారంగా మృణాల్ సేన్ తెలుగులో నిర్మించిన 'ఒక ఊరి కథ' (1977) ఈ సినిమాలకు ప్రేరణ అని చెప్పుకోవచ్చు. గౌతమ్ ఘోష్ దర్శకత్వం వహించిన 'మా భూమి' కూడా మరో గుర్తించదగ్గ సినిమా.

తొలిదశ/ సనాతన సినీనిర్మాణ దశ


మృణాల్‌సేన్ సినిమాలను మూడు దశలుగా విభజించవచ్చు.

1955లో తీసిన 'రాత్‌భోరె' (రాత్రంతా) అనే మొదటి సినిమా నుంచి 1969లో 'భువన్ షోమ్' వరకూ ఈ దశలోనివిగా చెప్పుకోవచ్చు. ఉత్తమ్‌కుమార్‌తో తీసిన 'రాత్‌భోరె' సినిమా మృణాల్‌సేన్‌కు ఎంత అసంతృప్తి కలిగించిందంటే, ఆ సినిమా ప్రస్తావనే ఏనాడూ చేయలేదతడు. రెండో సినిమా 'నీల్ ఆకాశేర్ నీచే' (నీలాకాశం కింద) (1958) హేమంత్‌కుమార్ స్వరపరిచిన 'ఓ నోదిరే' వంటి సూపర్ హిట్ పాటలతో వాణిజ్యపరమైన విజయం సాధించింది. చైనా సిల్క్ వ్యాపారికి, కోల్‌కతా మహిళకూ మధ్య ప్రేమకథగా సాగిన ఈ సినిమా స్వతంత్ర భారతంలో నిషేధానికి గురైన మొదటి సినిమాగా ప్రసిద్ధిగాంచింది. కానీ, ప్రత్యేక షో చూసిన నెహ్రూ ఈ సినిమాను మెచ్చుకున్నాడట! అతడి మూడో చిత్రం 'బాయిసే శ్రావణ్' (శ్రావణమాసం 22వ తేదీ – రవీంద్రుడు చనిపోయిన రోజు) (1960)కి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. బెంగాల్ కరువు కాటకాల్లో నలిగిన ప్రేమ కథ ఇందులో ఇతివృత్తం. 1943లో సంభవించిన బెంగాల్ క్షామం యువ మృణాల్ మదిలో చెరగని ముద్ర వేసింది. ఈ సంఘటన అతడి చాలా సినిమాల్లో మళ్లీ మళ్లీ చోటుచేసుకుంది. అయితే 'కరువును చావుల సంఖ్యలతో రికార్డు చేసే పాత్రికేయుడిలా కాకుండా ఆ కాలంలో మానవ సంబంధాల్లో వచ్చే బీభత్సమైన సంక్షోభాన్ని పరిశీలించడంలో నాకు ఆసక్తి ఎక్కువ' అని చెబుతాడు సేన్ ఓ ఇంటర్వ్యూలో.

రెండో దశ/ తిరుగుబాటు సినిమాల దశ


చాలామంది ఈ సినిమాల్ని ఏజిట్- పాప్ సినిమాలని అభివర్ణించారు. ఒకప్పటి బెంగాలీ నవజాగృతి పాతకాలపు మాట అయిపోయింది. 1943 నాటి దుర్భిక్షంలో నిండు జీవమున్న మనుషులు పండుటాకుల్లా రాలిపోవడం బెంగాల్ స్మృతిపథం నుంచి ఇంకా చెరిగిపోలేదు. దేశ విభజన సమయంలో రక్తపుటేర్లు పారడం కోల్‌కతా ఇంకా మర్చిపోలేదు. స్వాతంత్రం వచ్చి 25 ఏళ్లు దాటినా, కరువులు, నిరుద్యోగం విలయతాండవం చేస్తున్నాయి. ఈ దశలోనే కమ్యూనిస్టు పార్టీ ముక్కలు కావడం, నక్సల్బరీ ఉద్యమం, వేలకొలది యువకులు ఎన్‌కౌంటర్లకు బలికావడం – ఇవన్నీ మృణాల్ సేన్‌కు అత్యంత ప్రియమైన కోల్‌కతా నగరంలో అతని కళ్లముందే జరుగుతున్నాయి. ఈ దశలో వచ్చినవే కోల్‌కతా త్రయంగా పేర్కొనదగ్గ 'ఇంటర్వ్యూ' (1970), 'కోల్‌కతా 71' (1972), 'పదాతిక్' (గెరిల్లా వీరుడు) (1973). ఈ మూడు సినిమాలే కాక 'కోరస్' (1974) 'మృగయ' (1977), 'పరశురామ్' (1978) వంటి సినిమాల్లో సేన్‌లోని తిరుగుబాటుతత్వం కనిపిస్తుంది. దృశ్యాల నిరంతర దాడితో ప్రేక్షకుడిపై బలమైన ముద్ర వేసే ప్రత్యేక తరహా స్టైలు (ఐజెన్‌స్టీన్ మాంతాజ్, గొదార్ జంప్‌కట్‌ల ప్రభావాలతో) ఈ కాలంలో వచ్చిన సినిమాల్లో కనిపిస్తుంది. బెంగాలీ సినిమా మహా నాయకుడు ఉత్తమ్‌కుమార్ (మృణాల్ సేన్ మొదటి సినిమాలో నటుడు). ఆయన ఓ రోజు మార్నింగ్ వాక్‌కి వెళ్లి కోల్‌కతా మైదాన్‌లో యాదృచ్ఛికంగా ఓ యువకుడి (బహుశా విప్లవకవి సరోజ్ దత్త) బూటకపు ఎన్‌కౌంటర్ చూసి ఆ సంగతి మృణాల్ సేన్‌కి చెప్పాడంటారు. 'కోల్‌కతా 71'లో ఆ దృశ్యం చోటుచేసుకుంది. ఈ దశలో వచ్చిన సినిమాలు మృణాల్ సేన్ నిర్మించిన అత్యుత్తమ సినిమాలని ఒప్పుకోక తప్పదు. కొందరు వీటిని ప్రచార సినిమాలన్నా పట్టించుకోడు సేన్. 'నన్ను ఉద్వేగానికి గురిచేసి, ఓ చోట నిలువనీయకుండా చేసి, ఏడ్పించిన కాలమది. అటువంటి కాలాన్ని వెండితెరపై ఆవిష్కరించినప్పుడు అవి ప్రచార సినిమాలుగా అనిపించినా సరే నాకు ఇబ్బంది లేదు' అంటూ తెగేసి చెబుతాడు సేన్.





ఆఖరు దశ/ ఆత్మపరిశీలన దశ

కోల్‌కతా త్రయంలోని మూడో సినిమాలోనే కథానాయకుడు తను పాల్గొన్న ఉద్యమంలో లోపాలేమిటా అనే సంశయంలో పడతాడు. దాన్ని 'రివిజనిజం'గా గుర్తిస్తుంది పార్టీ నాయకత్వం. 'మన బయటి శత్రువుని వేలెత్తి చూపడం కంటే, లోపలి శత్రువుని గుర్తించడం అవసరం' అని మృణాల్ సేన్ ఆ తర్వాత ఎన్నోసార్లు చెప్పినట్లు ఉంటాయి అతడి ఆఖరు దశలోని సినిమాలు. 'ఏక్‌దిన్ ప్రతిదిన్' (1979) నుంచి వచ్చిన సినిమాలు ఆఖరి ఆత్మ పరిశీలనాదశలోనివిగా చెప్పుకోవచ్చు. ఆఫీసు నుంచి సకాలంలో ఇంటికి తిరిగిరాని పెద్ద కూతురు ('ఏక్‌దిన్ ప్రతిదిన్') (1979), గంటలో తిరిగివస్తానని చెప్పి మాయమైన తండ్రి ('ఏక్‌దిన్ అచానక్') (1989) – వారి గైర్హాజరులో ఇతర పాత్రల ద్వారా వారి మూల్యాంకనం, ఇలా సాంఘిక, మనోవైజ్ఞానిక పరిశోధనతో సాగుతాయి ఈ సినిమాలు. మధ్యతరగతి హిపోక్రసీని నిలదీసిన మరో గొప్ప సినిమా 'ఖారిజ్' (1982). 'ఆకాలేర్ సొంధానే' (కరువు అన్వేషణలో) (1980) మరో కళాఖండం. ప్రసిద్ధ కన్నడ దర్శకుడు గిరీష్ కాసరవెల్లి ప్రకారం మృణాల్ సేన్ అత్యుత్తమ సినిమా 'ఆకాలేర్ సొంధానే'. బెంగాల్ కరువును చిత్రీకరించడానికి వెనకబడ్డ ప్రాంతానికి బయల్దేరిన ఓ కోల్‌కతా ఫిలిం యూనిట్‌కి వర్తమానంలోని కరువు భయానకంగా సాక్షాత్కరిస్తుంది. ఈ సినిమా మరో విశేషమేమిటంటే మృణాల్ సేన్ తన వద్ద రెడీగా స్క్రిప్టు పెట్టుకోకుండా షూటింగ్‌కు బయల్దేరాడు. సినిమా ఏనాటికానాడు తనంతట తానే రూపుదిద్దుకుంది. ఇదో అద్భుత ప్రయోగం. 'ఖాండహార్' (1983), 'జెనెసిస్' (1986) కూడా ఈ దశలో వచ్చిన పేర్కొనదగ్గ సినిమాలు. సాదత్ హసన్ మంటో కథ ఆధారంగా 1993లో 'అంతరీన్' (బందీ) తర్వాత గుజరాత్ మత దురాగతాల నేపథ్యంలో మమతానురాగాల మంచి మనుషుల కథతో 'అమార్ భువన్' (నా నేల) (2002) వచ్చింది. ఇదే మృణాల్ సేన్ తన 79వ ఏట నిర్మించిన ఆఖరి సినిమా.



రెండో ప్రపంచ యుద్ధం, బెంగాల్ దుర్భిక్షం, మత కలహాలు, దేశ విభజన, స్వాతంత్ర్యం, విప్లవించిన యువతరం, వైఫల్యం మిగిల్చిన నైరాశ్యం, పరిస్థితుల యథావిధగమనం – ఇలా మృణాల్‌సేన్ జీవిత కాలంలో జరిగిన సంఘటనలన్నీ అతడి మనో ప్రపంచాన్ని కలచివేశాయి. అవే కథాంశాలుగా చలనచిత్రాలయ్యాయి. మృణాల్ సేన్‌లో గమనించదగ్గ అంశం నిరంతర పరివర్తన. ఈ పరివర్తన విషయ వస్తువులోనూ, చిత్ర నిర్మాణశైలిలోనూ చూడవచ్చు. బెంగాలీ, హిందీ, ఒరియా, తెలుగు భాషల్లో 28 చలన చిత్రాలు, నాలుగు డాక్యుమెంటరీలు, టీవీ కోసం 14 టీవీ ఫిల్ములు మృణాల్‌సేన్ దర్శకత్వంలో వెలువడ్డాయి.

మంచి సినిమా బతకాలంటే మంచి ప్రేక్షకులు కావాలి. వాళ్లు ఎక్కడి నుంచో ఊడిపడరు. వారి అభిరుచిని తయారుచేయాలి. అందుకే ఫిల్మ్ సొసైటీ ఉద్యమం అవసరం. ఈ అవసరాన్ని గుర్తించిన మనిషి మృణాల్ సేన్. 'కోల్‌కతా సినీ సెంట్రల్' సంస్థాపక సభ్యుడు మృణాల్ సేన్. తళుకు బెళుకుల ప్రభుత్వ చిత్రోత్సవం కంటే తన ఫిలిం సొసైటీ చిత్రోత్సవానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవాడు. 90 ఏళ్ల వయసులో కూడా కాసరవెల్లి కూర్మావతారం ప్రారంభోత్సవంలో నవ యువకుడిలా పాల్గొన్నాడు. నమ్మిన సిద్ధాంతం విషయంలో ఏనాడూ రాజీ పడలేదు. సమకాలీన రాజకీయాలపై చురకల్లాంటి వ్యాఖ్యలు చేసేవాడు.

మృణాల్ సేన్‌కు అందని అవార్డులు లేవు. ఎనిమిది సార్లు జాతీయ అవార్డులు వచ్చాయి. మాస్కో, చికాగో, కాన్స్, వెనిస్, బెర్లిన్, మాంట్రియల్, కైరో, కార్లోవివారి, వలడోవిచ్ వంటి అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో అవార్డులు లభించాయి. ఎన్నో అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో జ్యూరీ సభ్యుడిగా పాల్గొన్నాడు. 1981లో పద్మభూషణ్, 1998లో పార్లమెంటులో గౌరవ సభ్యత్వం, 2005లో దాదా సాహెబ్ ఫాల్కే అవార్డులతో భారత ప్రభుత్వం ఆయనను గౌరవించింది. 1985లో ఫ్రాన్స్ అధ్యక్షుడు మిట్టరాండ్ సేన్‌కు ఆ దేశ అత్యున్నత పౌరసత్కారంతో గౌరవించారు. 2000లో రష్యా ప్రభుత్వం ఆర్డర్ ఆఫ్ ఫ్రెండ్‌షిప్‌తో సన్మానించింది.

బెంగాలులోని సర్కార్‌డంగా, బల్లబ్‌పూర్‌డంగా అనే రెండు చిన్న చిన్న గ్రామాలు మృణాల్ సేన్‌ని మరో రకంగా గుర్తుంచుకుంటాయి. రాజ్యసభ సభ్యునిగా ఉన్నప్పుడు తన లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ ఫండ్‌ని ఏనాడూ కరెంటుతీగ చూడని ఆ గ్రామాలను విద్యుదీకరించడానికి వినియోగించాడు. ఒకవైపు సినీప్రియుల కోసం వెండితెరపై, మరోవైపు ఈ చీకటి గ్రామాల్లో వెలుగుదీపమై అజరామరంగా ప్రకాశిస్తూనే ఉంటాడు ఆయన.

– బాలాజీ (కోల్‌కతా)
90077 55403

ప్రయోగం

పిల్లల కళాత్మక విద్యాలోకం

అక్కడ పిల్లలు సొంతంగా ఆలోచిస్తున్నారు. మాట్లాడుతున్నారు. రాస్తున్నారు. ఊహలకు రెక్కలు తొడుగుతున్నారు. భావాలకు అక్షరాల గొడుగు పడ్తున్నారు. కవిత్వాన్ని అల్లుతున్నారు. కథలు చెప్తున్నారు. తమదైన అనుభవాన్ని రంగరించుకుని, జోడించుకుని విశ్లేషిస్తున్నారు. తమదైన శైలిలో బొమ్మలు గీస్తున్నారు. చిత్రాలకు రంగులు వేస్తున్నారు. ఆటలు ఆడుతున్నారు. పాటలు పాడుతున్నారు. నాటికలు వేస్తున్నారు. నాట్యం చేస్తున్నారు. ఉడ్‌వర్క్ (చెక్కపని), క్రాఫ్ట్‌వర్క్ (చిన్న చిన్న వస్తువుల తయారీ) పాటరీ (మట్టి బొమ్మలు కుండలు తయారీ), వంటపని, పాడిపని, పొలంపని, పారేసిన పాత వస్తువులతో చిట్టి చిట్టి కళాఖండాల తయారీ (వ్యర్థం నుంచి అర్థం).. ఇలా అన్నింటిని ఎంతో ఆసక్తికరంగా నేర్చుకుంటున్నారు. అంతకుమించి శ్రద్ధగా, జట్లు జట్లుగా కలిసి పనిచేస్తున్నారు. చేస్తూ నేర్చుకోవడం (లెర్నింగ్ బై డూయింగ్) అంటే ఇదే కదా!

ఇదో పిల్లలలోకం. ఇక్కడ పోటీ అనే ప్రసక్తే లేదు. విజేతలు పరాజితులు అనే భేదమే ఉండదు. అందరూ సమానమే. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 40 స్కూళ్ళ నుంచి దాదాపు రెండొందల మంది పిల్లలు పాల్గొన్నారు. 50 మంది టీచర్లు ఈ కృషిలో పాలుపంచుకున్నారు. ఇందుకు విజయవాడ సమీపంలోని కుంచనపల్లి అరవింద స్కూలు కేంద్రమైంది. ఈ నెల 8, 9, 10 తేదీల్లో ఈ కృషి సాగింది.

ఎస్‌టిఇపి – స్టెప్ (స్టూడెంట్స్, టీచర్స్, ఎడ్యుకేషన్ అండ్ పేరెంట్స్) ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాల అరవింద. ప్రతి విద్యార్థి ప్రత్యేకం అనేది లక్ష్యం. అరవింద పాఠశాల డైరెక్టర్ చంద్రశేఖర రెడ్డి (రాజా) స్మృత్యర్థం ప్రతి ఏటా ఈ కార్యక్రమాలు నడుస్తున్నాయి. దీనికి 'సాహెస్' ఎస్ఎహెచ్ఇఎస్ (సొసైటీ ఫర్ ది అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ హోలిస్టిక్ ఎడ్యుకేషన్ ఇన్ సొసైటీ) అని పేరు పెట్టుకున్నారు.

పిల్లలమీద, చదువుమీద ప్రేమ ఉన్నవారు, పాఠమే పాటగా, చదువే ఓ ఆటగా, బోధనే ఓ నేస్తంగా (ఫ్రెండ్లీ టీచింగ్) కలిగిన ఉపాధ్యాయులు, మేధావులు, కళాకారులు మాత్రమే ఇందులో పాల్గొంటారు. పిల్లలు చెప్పే వాటిని శ్రద్ధగా వింటారు. పిల్లల లోలోపలి లోతైన సునిశిత భావాలను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తారు. ఆ భావ వ్యక్తీకరణ సాధనాలే ఈ కళలు. ఆ క్రమంలో పిల్లలు తాము రాసిన కవితలను చదువుతారు. కథలను చెప్తారు. విశ్లేషిస్తారు. గీసిన బొమ్మలను చూపుతారు. చేసిన కళాఖండాలను గమనించమంటారు. చూసి ఆశ్చర్యపడటం పెద్దల వంతు అవుతుంది.

మోసపోయిన కోడిపెట్ట కథలో ఓ యజమాని వద్ద ఓ కోడి పెట్ట ఉంటుంది. ఈ కోడిపెట్టను చూసిన దగ్గర్నుంచి ఓ నక్క దానిని తినాలనుకుంటుంది. రోజూవచ్చి కోడిపెట్టను అందంగా ఉన్నావని, నున్నగా ఉన్నావని పొగుడ్తూ ఉంటుంది. కొన్నాళ్ళకు ఆ కోడిపెట్ట తన యజమాని కళ్ళు కప్పి, మాయమాటలు చెప్పి నక్కతో వెళ్ళిపోతుంది. మధ్యలో కోడిపెట్టను నక్క చంపి తినేస్తుంది. ఈ కథ ఆధారంగా ఎన్నో స్కిట్స్ (లఘు నాటికలు) వచ్చాయి. ఒక్కొక్కటి ఒక్కో తీరు. ఒక్కో ముగింపు. ఏ జట్టు (గ్రూప్) ప్రదర్శన ఆ జట్టుదే!

అలాగే జీవితంలోని ఘటనలు – తాగుబోతు తండ్రి తాగివచ్చి అమ్మను కొడుతుంటే ఆ ఫీలింగ్స్ (భావనలు), బంధువులు, మాస్టారులైన మగ పెద్దలు బాలికలను పట్టుకోరాని చోట పట్టుకోవడం (చెడుస్పర్శ), లైంగిక వేధింపులు గురించి కూడా అనేక నాటికలు వచ్చాయి. ఇలా కథలను, జీవితగాథలను నాటికలుగా మలచుకోవడం పిల్లలు తెలుసుకున్నారు. ఇవన్నీ పిల్లలు అప్పటికప్పుడు కలసి కూర్చుని, తమకు తామే చర్చించుకుని, సమిష్టిగా ప్రదర్శించినవి. ఇతరుల జోక్యం ఏమీ లేదు. అవసరమగు నాటిక లక్షణాలను కొద్దో గొప్పో అందించడం మా బోటి రీసోర్స్ పర్సన్స్ పని. పిల్లల



ఆలోచనలతో, కదలికలతో సమాంతరంగా వెళ్ళినప్పుడే మా కది సాధ్యమయ్యేది. తమలో చెలరేగే భావాలను పిల్లలు ఎలా వ్యక్తీకరించాలి? అందుకు తగిన వేదికలు (కళారూపాలు– మాధ్యమాలు) ఏవి? పిల్లల్లో సహజంగా ఉప్పొంగే శక్తి సామర్థ్యాలను ఎలా సమర్థవంతంగా వినియోగించుకోవచ్చు? అందుకు తగిన ఆటలు, ఆటస్థలాలు, ప్రయోగశాలలు ఏవి? స్థానిక వనరులను ఎలా వినియోగించుకోవచ్చు? అనే విషయాలపై ఉపాధ్యాయులు, పెద్దల మధ్య చర్చాగోష్ఠులు నడిచాయి. 'లోకాస్ట్– నోకాస్ట్' లెర్నింగ్, టీచింగ్ మెటీరియల్ (ఎల్‌టిఎం) ఎప్పటికప్పుడు తయారు చేసుకోవడం, సేకరించుకోవడం బోధనలో భాగమేనని తెలుసుకున్నారు.

'చదువులు – కొత్తదారులు' అనే పేరుతో ఈ మధ్యన ఇలాంటి గోష్ఠులు అక్కడక్కడా నడుస్తున్నాయి కూడా. నాణ్యమైన విద్యను పొందడం బాలల విద్యాహక్కులో భాగమే! జిడ్డు కృష్ణమూర్తి బోధనలు తెలుగులోకి అనువదించిన ప్రముఖ విద్యావేత్త అరుణామోహన్, నేర్చుకుంటూ నేర్పుతూ.. గ్రంథ రచయిత సి.వి.కృష్ణయ్య, క్రాఫ్ట్‌వర్క్ నిపుణులు, పాండిచ్చేరి అరవిందాశ్రమ వాసులు శంకర్‌భయ్యా, లక్ష్మణ్; బాలసాహిత్య పరిశోధకులు డాక్టర్ ప్రసాద్, 'మంచిపుస్తకం' నిర్వాహకులు సురేష్, భాగ్యలక్ష్మి, కవి మంచికంటి ప్రభృతులు పాల్గొనడమే కాదు; పిల్లలతో మమేకం అయ్యారు. అందరూ చెప్పింది ఒక్కటే! పిల్లలను సహజంగా ప్రేమించాలి. అర్థం చేసుకోవాలి. వారు చెప్పేది చెవి ఒగ్గి, శ్రద్ధగా వినాలి. అంతరంగాలు తెలుసుకోవాలి. ఆ తర్వాతనే, తగిన విధంగా స్పందించాలి. ఆ క్రమంలో మన వద్దనున్న నైపుణ్యాలు సరిపోకపోతే మెరుగుపరుచు కోవాలి. లేకపోతే నేర్చుకోవాలి. అంతే తప్ప, పెద్దలు కదా, అని బలప్రయోగంతో అణచివేస్తే అది మరో విధంగా అత్యాచారం అవుతుంది తప్ప, బోధన కాదని తేల్చి చెప్పారు. బలవంతంగా పిల్లలకు ఏది చెప్పినా, పోటీ పేరుతో ఎలా వత్తిడి తెచ్చినా అది పరోక్షంగా బాలల హక్కులను హరించడమేనని విశదీకరించారు.

ఈ సందర్భంగా హేల్ (హెల్త్ అండ్ ఎడ్యుకేషన్‌ఫర్ ఆల్) ప్యారడైజ్ పాఠశాల విద్యార్థులు రచించిన 'మా మనసులోని మాటలు' అనే కవితా సంకలనం చిరు పుస్తకాన్ని ఆవిష్కరించారు. 'ఎదగనివ్వండి బాల్యాన్ని/ ఎగరనివ్వండి స్వేచ్ఛగా/ ప్రకృతిని పిల్లలకిచ్చేయండి/ మట్టితో బంధాన్ని బలపడనివ్వండి/' వంటి కవిత్వం ఇందులో చోటు చేసుకుంది. పిల్లల్ని కొట్టకూడదు, తిట్టకూడదు, ఉన్నంతలో హాయిగా చక్కగా చదువుకోనివ్వాలి. వ్యక్తిగతంగా ఎవరికి వారు గొప్పవారు కావడం కాదు. నలుగురికి ఉపయోగపడేలా నాణ్యమైన విద్యతో మంచివారు కావడం అనే తాత్వికభావం గల విద్యార్థులే ఈ కార్యక్రమంలో పాల్గొనడం గమనార్హం. ప్రస్తుత మార్కెట్ ప్రపంచంలో విద్యాబోధన శరవేగంతో ప్రైవేటీకరణ అవుతున్న నేపథ్యంలో పిల్లలకు కెరీర్ బేస్‌డ్ (వ్యక్తిగత ఉపాధి, ఆర్జన) విద్యావ్యవస్థ నడుస్తోంది. ఇందుకు ప్రత్యామ్నాయంగా క్యారెక్టర్ బేస్‌డ్ (సామాజిక స్పృహ, గుణార్జన) విద్యావ్యవస్థను ఇలా 'సాహెస్' ద్వారా పాదుకొల్పడం ఎంతో ముదావహం. ప్రముఖ విద్యా తత్వవేత్త శివరామ్ వంటివారు సాహెస్‌కు సూత్రధారులుగా కాగా, ఇంద్రాణి, పద్మ వంటి ఉపాధ్యాయులు పాత్రధారులు. 'మన పిల్లలను మనమే గౌరవించుకుందాం – మన భవితను మనమే నిర్మించుకుందాం' అనే అవగాహనతో సాగిన ఈ కార్యక్రమం కళాత్మక విద్యకు వేగుచుక్కగా నిలిచిందని చెప్పడం ఎంతమాత్రం అతిశయోక్తి కాదు.

– కె. శాంతారావు
99597 45723

సెరెనా ఔట్

సెమీస్‌లో ప్లిస్కోవా, ఒసాకా
జకోవిచ్, పౌలీ అమీతుమీ


సిట్సొపస్ x నాదల్


జకోవిచ్ x పౌలీ

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో బుధవారం మరో సంచలనం నమోదైంది. 23 గ్రాండ్ స్లామ్‌లు సాధించిన అమెరికాకు చెందిన దిగ్గజ క్రీడాకారిణి సెరెనా విలియమ్స్ క్వార్టర్స్‌లో ఓటమి పాలైంది. టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన సెరెనా 4-6, 6-4, 5-7 తేడాతో ప్లిస్కోవా(చెక్ రిపబ్లిక్) చేతిలో ఓడి ఆస్ట్రేలియన్ ఓపెన్ నుంచి నిష్క్రమించింది. మొదటి నుంచి హోరాహోరా సాగిన ఈ పోటీలో తొలిసెట్‌ను 4-6తో ఓడిన సెరెనా రెండో సెట్లో అదే అంతరంతో గెలిచింది. దీంతో ఇరువురు చెరో సెట్ గెలవడంతో నిర్ణయాత్మక మూడో సెట్‌లో మొదటి నుంచి నువ్వా-నేనా అన్నట్టు సాగినా చివరకు ప్లిస్కోవా 7-5తో విజయం సాధించడం విశేషం. మహిళల సింగిల్స్ ఆఖరి క్వార్టర్స్‌ఫైనల్ మ్యాచ్‌లో నాల్గోసీడ్ ఒసాకా(జపాన్) 6-4, 6-1తో ఆరోసీడ్ స్విటొలినా(ఉక్రెయిన్)ను చిత్తుచేసింది. సెమీస్‌లో ఏడో సీడ్ కరోలినా ప్లిస్కోవా నాల్గోసీడ్ ఒసాకాతో పోటీపడనుంది. పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్ మ్యాచుల్లో టాప్‌సీడ్ జకోవిచ్(సెర్బియా) 6-1, 4-1 ఆధిక్యతలో ఉండగా జపాన్‌కు చెందిన నిషికోరి వైదొలగడంతో జకో సెమీస్‌కు చేరాడు. ఆఖరి మ్యాచ్‌లో 28వ సీడ్ పౌలీ(ఫ్రాన్స్) 7-6(7-4), 6-3, 6-7(2-7), 6-4తో 16వ సీడ్ కెనడాకు చెందిన రోనిక్‌ను ఓడించాడు.


ఒసాకా x ప్లిస్కోవా


క్విటోవా x కొలిన్స్

సెమీఫైనల్స్

(పురుషులు)
సిట్సొపస్(14) x నాదల్(2)
జకోవిచ్(1) x పౌలీ(28)
(మహిళలు)
క్విటోవా(8) x కొలిన్స్
ప్లిస్కోవా(7) x ఒసాకా(4)
(బ్రాకెట్లలో ర్యాంకింగ్స్)

రెండోరౌండ్‌కు శ్రీకాంత్, సింధు

జకార్తా : ఇండోనేషియా బాడ్మింటన్ మాస్టర్స్ టోర్నీలో భాగంగా బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీల్లో కిదాంబి శ్రీకాంత్, సైనా నెహ్వాల్, పివి సింధులు గెలుపొందారు. సాయి ప్రణీత్, శుభాంకర్ దేవ్, పారుపల్లి కశ్యప్ తొలిరౌండ్‌లోనే ఓడి నిరాశపరిచారు. భారత షట్లర్ శ్రీకాంత్ 21-12, 21-8 తేడాతో చాంగ్-ఉయ్-ఫోంగ్(మలేషియా)ను చిత్తుగా ఓడించాడు. ఇతర మ్యాచ్‌ల్లో కశ్యప్‌పై 12-21, 16-21 వరుస సెట్లలో ఎంటోనీ షినిసుకా (ఇండోనేషియా) చేతిలో, సాయిప్రణీత్ 12-21, 16-21 తేడాతో చెన్‌లాంగ్(చైనా) చేతిలో పరాజయం పాలయ్యారు. అర్హత టోర్నీలో గెలిచి తొలిరౌండ్ మ్యాచ్ ఆడిన శుభాంకర్ దేవ్ 14-21, 21-19, 15-21 పాయింట్ల తేడాతో అక్సెల్సన్(డెన్మార్క్) చేతిలో ఓడాడు. ఇక టైటిల్ ఫేవరేట్‌గా బరిలోకి దిగిన సింధు 22-24, 21-8, 21-17 తేడాతో గ్జియరుయ్(చైనా)పై, సైనా 7-21, 21-16, 21-11 తేడాతో హెన్-హుయ్(చైనా)పై గెలిచారు. డబుల్స్ విభాగంలో మనుఅత్రి-సుమీత్ జోడి 14-21, 21-19, 21-15 తేడాతో కోల్డింగ్, నోహర్‌పై గెలిచారు.

కోహ్లీకి విశ్రాంతి

ముంబయి: న్యూజిలాండ్‌తో జరగనున్న చివరి రెండు వన్డేలు, టీ20 సిరీస్‌కు టీమిండియా సారథి విరాట్ కోహ్లీ దూరం కానున్నాడు. ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి మూడు వన్డేలు ముగిసిన పిమ్మట కోహ్లీకి విశ్రాంతినివ్వనున్నట్లు బిసిసిఐ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. కోహ్లీ స్థానంలో ఆ బాధ్యతలను రోహిత్ శర్మకు ఇవ్వనున్నారు.

భారత్ బోణీ

భారీ అంచనాలతో న్యూజిలాండ్‌లో అడుగుపెట్టిన టీమిండియా తొలి వన్డేలో సమిష్టిగా రాణించింది. బుధవారం ఆతిథ్య జట్టుపై ఎనిమిది వికెట్ల తేడాతో ఘనవిజయాన్ని నమోదు చేసుకొని ఐదు వన్డేల సిరీస్‌లో టీమిండియా 1-0 ఆధిక్యతలో నిలిచింది. భారత మణికట్టు మాంత్రికుడు కుల్దీప్ నాలుగు, షమి మూడు వికెట్లు తీసి కివీస్ నడ్డి విరవడంతో ఆ జట్టు 157 పరుగులకే పరిమితమైంది. భారత బ్యాట్స్‌మెన్లు ధావన్, కోహ్లీ రాణించడంతో 34.5 ఓవర్లలోనే నిర్దేశిత లక్ష్యాన్ని ఛేదించింది. పేస్ బౌలర్ మహ్మద్ షమి 56 వన్డేల్లో 100 వికెట్లను పడగొట్టి ఇర్ఫాన్ పఠాన్ (59 వన్డేల) రికార్డును బ్రద్దలు కొట్టాడు.

విజృంభించిన టీమిండియా బౌలర్లు
అర్ధశతకంతో రాణించిన ధావన్



ధావన్
75*
పరుగులు

నేపియర్: భారత్-న్యూజిలాండ్‌ల మధ్య జరుగుతున్న ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన తొలి వన్డేలో కోహ్లీసేన అదరగొట్టింది. అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్ విభాగాల్లో సమిష్టిగా రాణించి డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం 8 వికెట్ల తేడాతో ఘనవిజయాన్ని సొంతం చేసుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కివీస్‌ను భారత బౌలర్లు కుల్దీప్ యాదవ్(4/39), మహ్మద్ షమి(3/19) విజృంభించడంతో 38 ఓవర్లలో 157 పరుగులకే ఆలౌటయ్యింది. కివీస్ ఓపెనర్లను షమి సింగిల్ డిజిట్‌కే పరిమితం చేయడంతో ఆరంభంలోనే న్యూజిలాండ్ కష్టాల్లోకి వెళ్లింది. సారథి కేన్ విలియమ్సన్(64) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడినా మిగిలిన బ్యాట్స్‌మెన్ విఫలమవ్వడంతో టీమిండియా ముందు స్వల్ప స్కోరును మాత్రమే కివీస్ జట్టు ఉంచగల్గింది. నిర్దేశిత లక్ష్య ఛేదనతో బరిలోకి దిగిన భారత్ ఓపెనర్ రోహిత్ శర్మ(11) వికెట్‌ను త్వరగానే కోల్పోయింది. అనంతరం వచ్చిన కోహ్లీ-ధావన్‌తో కలిసి రెండో వికెట్‌కు 91 పరుగుల భాగస్వామ్యాన్ని సంపాదించి పెట్టాడు. అయితే అర్ధసెంచరీకి దగ్గరవుతున్న సందర్భంలో కోహ్లీ(45) లూథమ్‌కు క్యాచ్ ఇచ్చి 29 ఓవర్లలో పెవిలియన్‌కు చేరాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన రాయుడుతో కలిసి ధావన్ ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు. కేవలం 19 పరుగులు మాత్రమే ఇచ్చి కివీస్ టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్‌ను కూల్చిన మహ్మద్ షమికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వరించింది. అర్ధసెంచరీతో రాణించిన ధావన్ తక్కువ ఇన్నింగ్స్‌ల్లో(118) 5 వేలు పరుగుల మైలురాయిని అందుకున్న రెండో భారతీయ బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. ధావన్‌కంటే ముందు కోహ్లీ 114 ఇన్నింగ్స్‌లోనే ఈ మైలురాయిని చేరి తొలిస్థానంలో ఉన్నాడు.

షమీ రికార్డు : 56 వన్డేల్లోనే వంద వికెట్లు

టీమిండియా పేసర్ మహ్మద్ షమీ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. ఐదువన్డేల సిరీస్‌లో భాగంగా న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో షమీ ఈ రికార్డును నెలకొల్పాడు. ఓపెనర్లు మార్టిన్ గుప్టిల్, కొలిన్ మున్రోలను వరుస ఓవర్లలో పెవిలియన్‌కు చేర్చి వేగంగా100 వికెట్ల మార్క్‌ను అందుకున్న ఇర్ఫాన్ పఠాన్ రికార్డును బ్రేక్ చేశాడు. షమీ కేవలం 56 వన్డేల్లో 100 వికెట్ల మార్క్‌కు చేరాడు. ఇంతకుముందు ఈ రికార్డు ఇర్ఫాన్ పఠాన్ (59 వన్డేల్లో) పేరిట ఉండేది.

స్కోర్‌బోర్డు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్ : గుప్టిల్ (బి)షమి 5, మున్రో (బి)షమి 8, విలియమ్సన్ (సి)శంకర్ (బి)కుల్దీప్ 64, టేలర్ (సి అండ్ బి) చాహల్ 24, లూథమ్ (సి అండ్ బి) చాహల్ 11, నికోల్స్ (సి)కుల్దీప్ (బి)జాదవ్ 12, సాట్నర్ (ఎల్‌బి) షమి 14, బ్రాస్‌వెల్ (బి) కుల్దీప్ 7, సౌథీ (నాటౌట్) 9, ఫెర్గ్యుసన్ (స్టంప్) ధోనీ (బి) కుల్దీప్ 0, బౌల్ట్ (సి) రోహిత్ (బి)కుల్దీప్ 1. అదనం 2. (మొత్తం 38 ఓవర్లలో 157 పరుగులు)

బౌలింగ్ : భువనేశ్వర్ 5-0-20-0, షమి 6-2-19-3, శంకర్ 4-0-19-0, చాహల్ 10-0-43-2, కుల్దీప్ 10-1-39-4, జాదవ్ 3-0-17-1.

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ (సి) గుప్టిల్ (బి) బ్రాస్‌వెల్ 11, ధావన్ (నాటౌట్) 75, కోహ్లీ (సి) లూథమ్ (బి) ప్రోగ్యుసన్ 45, రాయుడు (నాటౌట్) 13. అదనం 12 (మొత్తం 34.5 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 156 పరుగులు)

బౌలింగ్ : బౌల్ట్ 6-1-19-0, సౌథీ 6.5-0-36-0, ప్రోగ్యుసన్ 8-0-41-1, బ్రాస్‌వెల్ 7-0-23-1, సాట్నర్ 7-0-32-0.

కష్టాల్లో కేరళ

రెండో ఇన్నింగ్స్‌లో 142/5


కేరళ జట్టు బ్యాటింగ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రతో జరుగుతున్న మ్యాచ్‌లో కేరళ బ్యాట్స్‌మెన్ తడబడటంతో ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 142 పరుగులు చేసింది. క్రికెట్ ప్రకాశం ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా సిఎస్‌ఆర్ శర్మ కళాశాల క్రీడామైదానంలో అండర్-19 కూచ్ బిహర్ ట్రోఫీలో భాగంగా ఆంధ్ర, కేరళ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతున్న సంగతి విదితమే. ఓవర్ నైట్ స్కోరు 261/6 ఆట ప్రారంభించిన ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 335 పరుగులకు ఆలౌట్ అయింది. ఈ జట్టులో సాయి కార్తీక్ రావు 32(124 బంతుల్లో; 3 ఫోర్లు) పరుగులు చేయగా, దుర్గా కుమార్ 39(55 బంతుల్లో; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు. కేరళ బౌలర్‌లలో నిర్మల్ జైమన్ 51 పరుగులిచ్చి 3 వికెట్లు, అక్షయ్ మనోహర్ 70 పరుగులిచ్చి 3 వికెట్లు దక్కించుకున్నారు. అజిత్ జాకోబ్, వత్సల్ గోవింద్, మోహిత్ శిబు, కిరణ్ సాగర్ ఎం చెరో వికెట్ సాధించారు. కేరళ జట్టుకి 4 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కేరళ జట్టు 59 ఓవర్లను ఎదుర్కొని 5 వికెట్ల నష్టానికి 142 పరుగులు చేసింది. అమల్ కా 4 పరుగులు, వరుణ్ నయనార్ 49(112 బంతుల్లో; 9 ఫోర్లు) రుగులు, నిఖిల్ జోస్ 0, అక్షయ్ మనోహర్ 7, అశ్విన్ ఆనంద్ 2 పరుగులు చేసి అవుటయ్యారు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి కెప్టెన్ వత్సల్ గోవింద్ 56(145 బంతుల్లో; 6 ఫోర్లు), నిఖిల్ టి 7 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. ఆంధ్ర బౌలర్‌లలో బి.సంతోష్‌కుమార్ 27 పరుగులిచ్చి 2 వికెట్లు, సాయి కార్తీక్‌రావు 36 పరుగులిచ్చి 2 వికెట్లు, ఎ. ప్రణయ్‌కుమార్ 1 వికెట్ దక్కించుకున్నారు. ఈ మ్యాచ్‌ను క్రికెట్ ప్రకాశం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్, సిహెచ్ ప్రతాప్ కుమార్, కార్యవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

విశాఖలో టీ20 మ్యాచ్‌కు ఏర్పాట్లు

ఫిబ్రవరి 27న భారత్-ఆస్ట్రేలియా మధ్య పోరు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య ఫిబ్రవరి 27న జరిగే రెండో టీ20 మ్యాచ్‌కు పోతిన మల్లయ్యపాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వేదిక కానుంది. భారత్‌లో పర్యటించనున్న ఆస్ట్రేలియా జట్టు రెండు టీ20, ఐదు వన్డేలు మ్యాచ్‌లు ఆడనున్న సంగతి తెలిసిందే. ఇందులో తొలి టీ20 బెంగళూరులో, రెండో మ్యాచ్‌కు విశాఖ ఆతిథ్యమివ్వనుంది.

ఈ మ్యాచ్‌కు టిక్కెట్ల ధరలను 500, 1200, 1600, 2,000, 4,000 రూపాయలుగా నిర్వాహక కమిటీ నిర్ణయించింది. త్వరలో ఈ టిక్కెట్లను ఆన్‌లైన్‌తో పాటు మైదానం వద్ద కూడా విక్రయించనున్నారు. ఈ మ్యాచ్‌కు గట్టి పోలీసు బందోబస్తును నిర్వహించనున్నామని సిపి మహేష్ చంద్ర లడ్డా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఫిబ్రవరి 3న ప్రజ్ఞా వికాసం పరీక్ష

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదో తరగతి విద్యార్థులకు ఫిబ్రవరి 3న ప్రజ్ఞా వికాసం పరీక్షను నిర్వహించనున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి కె రమేష్, అధ్యక్షులు ఏ అశోక్ తెలిపారు. పరీక్ష పోస్టర్‌ను సాహితీ స్రవంతి రాష్ట్ర నాయకులు ప్రగతితో కలిసి బుధవారం ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. పరీక్షలపై విద్యార్థులకు ఆందోళన పోగొట్టేందుకు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పదేళ్ల నుంచి ఈ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. శాసన మండలి మాజీ సభ్యులు కెఎస్ లక్ష్మణరావు పర్యవేక్షణలో నిర్వహించే ఈ పరీక్ష 100 మార్కులకు పూర్తి ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఉంటుందని తెలిపారు. ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాలు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె ప్రసన్న కుమార్, ఎం సోమేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్ కోటి తదితరులు పాల్గొన్నారు.

రాజధానిలో బైబిల్ మ్యూజియం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతిలో ఉత్తమ బైబిల్ మ్యూజియాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తుందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనంద్ బాబు తెలిపారు. వెలగపూడి తాత్కాలిక సచివాలయంలో బుధవారం ఆయన క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇమ్మాన్యుయేల్ జోసెఫ్, ఇతర క్రైస్తవ మత పెద్దలతో మ్యూజియం ఏర్పాటుపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మ్యూజియం నమూనా చిత్రాలను మంత్రికి చూపించారు.

తీరు మారని ఎపిపిఎస్‌సి

- తాజా నోటిఫికేషన్లలోనూ జిఓ 5 నిబంధన
- 84 పోస్టుల భర్తీకి ఉత్తర్వులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రిజర్వుడు అభ్యర్థులపై ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఎపిపిఎస్‌సి) తన తీరును మార్చుకోలేదు. ప్రిలిమ్స్‌లో రిజర్వేషన్ పొందిన అభ్యర్థులు రిజర్వుడు పోస్టులకే అర్హులేంటూ జారీ చేసిన 5వ నెంబర్ జిఓ నిబంధనను బుధవారం విడుదల చేసిన నోటిఫికేషన్లలోనూ పేర్కొంది. దీంతో అభ్యర్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కమిషన్ పెట్టిన నిబంధనను తొలగించాలని సాధారణ పరిపాలన శాఖ ఈ నెల 8న ఎపిపిఎస్‌సి కార్యదర్శికి ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం జరిగిన కమిషన్ భేటీలో ఈ విషయమై నిర్ణయం తీసుకుంటుందని నిరుద్యోగులు భావించారు. కానీఆ దిశలో స్పందించకుండానే 84 పోస్టులకు బుధవారం నోటిఫికేషన్లు విడుదల చేసింది. ఎపి ఎకనామిక్ అండ్ స్టాటిస్టికల్ సబ్‌సర్వీస్ శాఖలో 78 అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి, 6 అసిస్టెంట్ డైరెక్టర్ల పోస్టుల భర్తీకి కమిషన్ కార్యదర్శి ఎకె మౌర్య బుధవారం విడివిడిగా నోటిఫికేషన్లు విడుదల చేశారు. అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్స్ పోస్టులకు ఫిబ్రవరి 12 నుంచి మార్చి 3 వరకు, అసిస్టెంట్ డైరెక్టర్ల జనవరి 30 నుంచి ఫిబ్రవరి 2 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. స్టాటిస్టికల్ ఆఫీసర్స్ మే 19న స్క్రీనింగ్ టెస్ట్‌ను, ఆగస్టులో ప్రధాన పరీక్షను నిర్వహిస్తామని పేర్కొన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ల పోస్టులకు ఏప్రిల్ 3,4 తేదీల్లో స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుందని తెలిపారు. ఈ నోటిఫికేషన్లలో కూడా 5వ నెంబర్‌జిఓను కమిషన్‌పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది.

జిఓను రద్దు చేయాలి : చంద్రబాబుకు రామకృష్ణ లేఖ

1977లో తీసుకొచ్చిన జిఓ నెంబరు 570 ను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఐదవ నెంబర్ జిఓతో ఎపిపిఎస్‌సి ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, దీన్ని రద్దు చేసి వారికి న్యాయం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన ముఖమంత్రి చంద్రబాబునాయుడికి లేఖ రాశారు.

రిజర్వుడు అభ్యర్థులను ఓపెన్‌లోనూ అనుమతించాలి : కెవిపిఎస్

ప్రతిభ ద్వారా ఓపెన్ కేటరిగిరీకి ఎంపికైన రిజర్వుడు అభ్యర్థులను ఓపెన్ కేటగిరీ పోస్టులకూ అనుమతించాలని ఎపిపిఎస్సీ చైర్మన్ ఉదయభాస్కర్‌కు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి బుధవారం లేఖ రాశారు. ప్రిలిమ్స్‌లో కామన్ కటాఫ్ తీసి, సరిపడా అభ్యర్థులు లేకపోతే రిజర్వుడు అభ్యర్థులకు కటాఫ్ తగ్గిస్తామని, అలాంటి అభ్యర్థులను ఓపెన్ కేటగిరీ పోస్టులకు అనుమతించకపోవడమంటే.. ఓపెన్ కేటగిరీ పోస్టులకు ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ, మహిళలను ఆ పోస్టులకు దూరం చేయడమే గాక ఓసిలకు ఓపెన్ కేటగిరీ పోస్టులను రిజర్వు చేసినట్లు అవుతుందనీ మాల్యాద్రి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిభ ఉన్న రిజర్వుడు అభ్యర్థులకు సైతం ఓపెన్ పోస్టులకు అర్హత లేదంటే రాజ్యాంగపరంగా రిజర్వుడు అభ్యర్థులను అణచివేయడమేనని విమర్శించారు. గ్రూప్ పరీక్షలన్నీ ఆఫ్‌లైన్‌లోనే నిర్వహించాలని, గ్రూప్-1 పరీక్షను వాయిదా వేయాలని, పాత పద్ధతిలోనే నిర్వహించాలని, ప్రభుత్వ సంస్థల్లో ఉన్న ఖాళీలన్నింటినీ భర్తీ చేయాలని కోరారు.

మాయమైన రేడియోధార్మిక పదార్థం లభ్యం

- పాతసామగ్రి షాపులో దొరికిన సిఎస్-137
- అర్బన్ ఎస్‌పి షీమోషిబాజ్‌పాయ్ వెల్లడి



ప్రజాశక్తి - రాజమహేంద్రవరంప్రతినిధి

ఈనెల 17న ఒఎన్‌జిసి బేస్ కాంప్లెక్స్ నుంచి మాయమైన రేడియో ధార్మికపదార్థం సిఎస్-137(2.5 క్యూరి) కృష్ణా జిల్లా కలిదిండిలోని ఒక పాత సామగ్రిషాపులో దొరికిందని రాజమహేంద్రవరం అర్బన్ ఎస్‌పి షీమోషిబాజ్‌పాయ్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పోలీస్ గెస్ట్‌హౌస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. ఒఎన్‌జిసిలో ఒక కంటైనర్‌లో ఉన్న రేడియోధార్మిక పదార్థం మాయమైందని ఈనెల 17న ఒఎన్‌జిసి అధికారులు బొమ్మూరు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఇది కన్పించకపోవడంపై ప్రజల్లో తీవ్రభయాందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో దీనిపై పోలీసులు సీరియస్‌గా దృష్టి సారించారు. వరప్రసాద్, వివి.మహేశ్వరరావు, ఇతర కానిస్టేబుళ్లు ఐదు బృందాలుగా ఏర్పడ్డారు. బుధవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో సిసిఎస్ బృందం దీన్ని కనుగొంది. ఒఎన్‌జిసికి చెందిన డోసి అనే మీటర్ సాయంతో ఒఎన్‌జిసి టెక్నికల్ అధికారులు, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు బుధవారం ఈ పదార్థాన్ని నిర్ధారించారు. ప్రస్తుతం ఇది భద్రంగా ఉందని ఎస్‌పి తెలిపారు. ప్రత్యేక వాహనంలో రాజమహేంద్రవరంలో ఒఎన్‌జిసికి దాన్ని తీసుకొస్తున్నట్లు చెప్పారు. ప్రజలు భయపడాల్సిన పనిలేదన్నారు. ఇది పాత సామగ్రి షాపునకు ఎలా వెళ్లిందనే విషయంపై దర్యాప్తు జరుగుతోందన్నారు. పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామని చెప్పారు.

ఊపిరిపీల్చుకున్న అధికారులు

రేడియోధార్మిక పదార్థం (సిఎస్-137)ని 2013లో రూ.27 లక్షలకు కొనుగోలు చేసినట్టు ఒఎన్‌జిసి గతంలో ప్రకటించింది. కాగా, దీని విలువ కోట్లలో ఉంటుందని, ఇది విస్ఫోటనం జరిగితే కొన్ని గ్రామాలకు నష్టం వాటిల్లుతుందని ఈ పరికరం మాయమైనప్పుడు ప్రచారం జరిగింది. ఎట్టకేలకు ఇది లభ్యం కావడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

నేడు అర్ధరాత్రి నింగిలోకి పిఎస్‌ఎల్‌వి-సి 44

- అంతరిక్షంలోకి కలాం శాట్
- కౌంట్ డౌన్ ప్రారంభం

ప్రజాశక్తి- సూళ్లూరుపేట

శ్రీ పొటి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలోని షార్ నుంచి గురువారం రాత్రి 11.37 గంటలకు పిఎస్‌ఎల్‌వి-సి 44 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. దీనికి సంబంధించి మంగళవారం చేపట్టిన రిహార్సల్ విజయవంతమైంది. బుధవారం రాకెట్ సన్నద్ధతా సమావేశం (ఎంఆర్‌ఆర్) జరిగింది. బుధవారం రాత్రి 7.30 గంటలకు కౌంట్ డౌన్ ప్రక్రియ ప్రారంభించారు. ఇది నిరంతరాయంగా 28 గంటలపాటు కొనసాగిన తర్వాత నేడు రాత్రి 11.37 గంటలకు పిఎస్‌ఎల్‌వి -సి 44 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. పిఎస్‌ఎల్‌వి సిరీస్‌లో ఇప్పటికి 45 రాకెట్లు ప్రయోగించగా, ఇది 46వ రాకెట్. ఇందులో రెండు స్ట్రా పొండ్లు అమర్చి దీన్ని పిఎస్‌ఎల్‌వి డిఎల్ డిజైన్‌గా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తక్కువ బరువు గల ఉపగ్రహాలను ప్రయోగించేటప్పుడు రాకెట్లో ఎక్కువ స్ట్రా పొండ్లు అవసరం లేకుండా ఈ రాకెట్లు రూపొందించారు. దీని ద్వారా మైక్రో శాట్ -ఆర్, కలాం శాట్ అనే రెండు తేలికపాటి ఉపగ్రహాలు ప్రయోగించనున్నారు. మైక్రో శాట్ -ఆర్ ఉపగ్రహం బెంగుళూరులోని ఇస్రో శాటిలైట్ సెంటర్‌లో రూపొందించారు. కలాం శాట్ ఉపగ్రహాన్ని తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఒక హైస్కూల్ విద్యార్థులు రూపొందించారు.

పిఎస్‌ఎల్‌వి -సి 44 రాకెట్ ప్రయోగానికి సంబంధించి కేవలం స్ట్రాఫ్ ఆన్‌ల నిర్మాణం మాత్రమే కాకుండా మరికొన్ని కీలక మార్పులు చేసినట్లు తెలుస్తోంది. కేవలం 14 నిమిషాల వ్యవధిలోపే రాకెట్ ప్రయోగం పూర్తికానుంది. ఈ రాకెట్ సమయం నిర్దేశించిన కక్ష్యకు చేరే వ్యవధిని బట్టి రాత్రిపూట ఈ ప్రయోగం జరపనున్నారు. శ్రీ హరికోటలోని మొదటి ప్రయోగ వేదిక నుంచి ఈ ప్రయోగం జరపనున్నారు. 44.4 మీటర్ల ఎత్తు కలిగిన రాకెట్ మొదటి ప్రయోగ వేదికపై 4 దశల నిర్మాణంతోనూ రెండు ఉపగ్రహాల అనుసంధానంతోనూ ప్రయోగానికి సిద్ధంగా



ఉంచారు. 2019 క్యాలెండర్ ఇయర్‌లో షార్ నుంచి తొలి రాకెట్ ప్రయోగం కావడంతో విజయ తీరాలకు సగర్వంగా చేరాలని ఇస్రో శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు.

ఫీజుల కోసం వేధింపులు

- ఎస్సీ, ఎస్టీ విద్యార్థులపై కార్పొరేట్ స్కూళ్ల వివక్ష
- 'బెస్ట్' స్కీమ్ వరెస్ట్
- చోద్యం చూస్తున్న సర్కారు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బెస్ట్ అవేలబుల్ పాఠశాలల పథకం కింద కార్పొరేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులపై ఆయా పాఠశాలల యాజమాన్యాలు వివక్ష చూపుతున్నాయి. ఫీజుల కోసం వేధిస్తున్నాయి. పాఠాలు సరిగా బోధించడం లేదు. కార్పొరేట్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులపై రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజి) ద్వారా స్వయంగా ప్రభుత్వం చేపట్టిన సర్వేలో ఆసక్తికరమైన విషయాలు వెలుగుచూశాయి. అత్యధికంగా గుంటూరు, విజయనగరం జిల్లాల్లోనే ఇటువంటి దుస్థితి నెలకొన్నట్టు సర్వేలో వెల్లడయ్యింది. యాజమాన్యాలు తమపై వివక్ష చూపిస్తున్నాయని విజయనగరం జిల్లాలో 60 శాతం, గుంటూరు జిల్లాలో 57, కర్నూలు జిల్లాలో 27, శ్రీకాకుళం జిల్లాలో 25, పశ్చిమ గోదావరి జిల్లాలో 20 శాతం మంది విద్యార్థులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. చదువు సరిగా చెప్పడం లేదని సగటున 38 శాతం మంది విద్యార్థులు తెలిపారు. అత్యధికంగా కడప జిల్లాలో 100 శాతం మంది విద్యార్థులు తమ అభిప్రాయాల్ని వెల్లడించగా, తూర్పు గోదావరి, నెల్లూరులో 50, కర్నూలులో 45, చిత్తూరు, కృష్ణాలో 42, పశ్చిమ గోదావరి జిల్లాలో 40 శాతం మంది విద్యార్థులు వెల్లడించారు. ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తున్నా ఫీజుల పేరిట తమను వేధిస్తున్నట్టు విద్యార్థులు మొరపెట్టుకున్నారు. విశాఖపట్నం జిల్లాలో ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నట్టు 100 శాతం మంది విద్యార్థులు తెలిపారు. బెస్ట్ అవేలబుల్ స్కూల్స్ స్కీమ్ కింద ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో చదువు చెప్పిస్తున్న విషయం తెలిసిందే. సుమారు 30వేల మంది విద్యార్థులు 13 జిల్లాల్లోని వివిధ కార్పొరేట్ స్కూళ్ళల్లో ఈ పథకం కింద చదువుకుంటున్నారు. డే స్కాలర్స్ కింద చదువుకుంటున్న వారికి రూ. 20వేలు, రెసిడెన్షియల్ విధానంలో చదువుకుంటున్న వారికి రూ. 30వేలు ప్రభుత్వమే యాజమాన్యాలకు చెల్లిస్తోంది. ఈ ఏడాదిలో ఈ పథకం కింద సాంఘిక సంక్షేమ శాఖ కింద 42.57 కోట్లు, గిరిజన సంక్షేమ శాఖ కింద 34.64 కోట్లు కేటాయించారు.

లోపించిన పర్యవేక్షణ

ఈ పథకం కింద చదువుకుంటున్న విద్యార్థుల బాగోగులపై పర్యవేక్షణ లోపించింది. పాఠాలు సరిగా బోధిస్తున్నారా, బోధనలు విద్యార్థులకు అర్థమవుతున్నాయా, సమస్యలేమైనా ఎదుర్కొంటున్నారా తదితర అంశాలపై ఆయా పాఠశాలల యాజమాన్యాలతో ప్రభుత్వం చర్చించాలి. సమస్యలు పునరావృతం కాకుండా యాజమాన్యాలకు తగు సూచనలివ్వాలి. అవసరమైతే అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించాలి. కానీ నాలుగేళ్ళల్లో అటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఏదో మొక్కుబడిగా పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించి, ఫీజులు చెల్లించి, తమకేమీ సంబంధం లేదన్నట్టుగా సర్కారు చేతులు దులుపుకుంటోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68